అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ


గురువారం 02-01-2020

సమగ్ర తెలుగు దినపత్రిక




సంపుటి : 6 | సంచిక : 05 | Published from Hyderabad, Rangareddy, Mahaboobnagar, Khammam, Karimnagar, Warangal | www.navatelangana.com | 10 + 12 పేజీలు | వెల : 6.50

# తాగేశారు



## కొత్త ఏడాది వేడుకల్లో పారిన మద్యం

- రెండురోజుల్లోనే రూ.436 కోట్ల ఆదాయం

**న్యూ ఇయర్ అంటే మద్యం.. మద్యం.. మద్యం..అన్నట్టుగా ఏరులై పారింది. తాగారు..ఊగారు..తందనాలాడారు. చిందులేశారు. మందు వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు అంటున్నా..నూతన సంవత్సరం తొలిరోజే కదా...అంటూ తెగ తాగేశారు. రోడ్లపై కేరింతలు కొడుతూ చిందేశారు. వేడుకల అనంతరం రాత్రిళ్లు వెళ్లండని ప్రకటనలిచ్చిన సర్కారు.. పోలీసులతో చెక్‌పోస్టులు పెట్టి బ్రీత్ ఎనలైజర్ టెస్టులు జరిపింది. ఇలా రెండు విధాలుగా జనాన్ని నిలువుదోపిడీ చేసింది. జనాన్ని ఇంతలా తాగించి...సర్కార్ ఖజానాలో పోగేసుకున్న కరెన్సీ ఎంతంటే... అక్షరాల రూ. 436 కోట్లు.**




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన సంవత్సరం వేడుకలు రాష్ట్ర ఖజానాకు కిక్కునిచ్చింది. మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో సగటున రోజుకు రూ.60 కోట్లు విలువైన మద్యం విక్రయాలు మాత్రమే జరుగుతాయి. అయితే నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి గత రెండ్రోజుల్లోనే రూ.436 కోట్ల అమ్మకాలు చోటుచేసుకోవడం గమనార్హం. అంటే రోజుకు సగటున రూ.220 కోట్లమేర జరగడం గమనార్హం. డిసెంబర్ 30, 31 తేదీల్లో రూ.436 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు వివరించారు. గడిచిన రెండు రోజుల్లో 4.85 లక్షల కేసుల మద్యం, 5.10 లక్షల కేసుల బీర్లను మద్యం ప్రియులు కొనుగోలు చేశారు.

| కొత్త ఏడాది | అమ్మకాలు (రూ.కోట్లల్లో) |
|---|---|
| 2018, డిసెంబర్ 31న | 338 |
| 2017 | 100 |

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై రూ.20 వేల కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం వస్తుందని అంచనా వేసింది. గతేడాది కంటే మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగింది. దీంతో ఖజానా ఆరున్నర రెట్లు ఆదాయం పెరిగింది. 2017లో కేవలం ...5లో

### 3049 మంది మందుబాబులపై కేసులు



రాష్ట్రంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం సేవించి చిందులు తొక్కిన మందుబాబులపై బారీగానే పోలీసులు కేసులను నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం రాత్రి 239 ప్రాంతాల్లో మొత్తం 3049 కేసులను పోలీసులు పెట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో అత్యధికంగా 951 కేసులు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యాయి. రెండవ స్థానంలో ...5లో

# గ్యాస్ బాదుడు



## సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.19 పెంపు

- 5 నెలల్లో రూ.140 భారం
- వరుస షాక్‌లు ఇస్తున్న మోడీ సర్కారు

**న్యూఢిల్లీ:** కొత్త ఏడాదిలోనూ మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు దేశ ప్రజలకు వరుసగా షాక్‌లు ఇస్తున్నది. నూతన సంవత్సరంలో ఇప్పటికే రైల్వే చార్జీలు పెంచిన కేంద్రం.. తాజా సబ్సిడీయేతర ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో మోడీ సర్కారు తీసుకుంటున్న చర్యల కారణంగా ప్రజలపై మరింత భారం పడనున్నది. కేంద్రం తీసుకున్న రాయితీలేని వంట గ్యాస్ ధరల పెంపు నిర్ణయంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీయేతర ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ.19 పెంచింది. పెరిగిన ధరలు కొత్త సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చాయని ప్రభుత్వరంగ సంస్థలు ప్రకటించాయి. పెరిగిన ధరల ప్రకారం 14.2 కిలోల సిలిండర్‌పై న్యూఢిల్లీలో రూ.19, ముంబయిలో రూ.19.50, ఇతర ప్రాంతాల్లో రూ.20 వరకూ అదనంగా భారం పడుతుంది. కాగా, వరుసగా 5 నెలల్లో సిలిండర్ ధరలు రూ.140 పైగా పెరగడం గమనార్హం. ప్రస్తుతం న్యూఢిల్లీలో రూ.714, ముంబయిలో రూ.684.5, చెన్నైలో రూ.734కు ఎల్పీజీ గ్యాస్‌ను సరఫరా చేస్తున్నట్టు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది. గతేడాది డిసెంబర్‌లో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలు న్యూఢిల్లీలో రూ.695, ముంబయిలో రూ.665గా ఉన్నాయి. అయితే గతేడాది ఆగస్టు నుంచి సబ్సిడీయేతర గ్యాస్ సిలిండర్ ధర న్యూఢిల్లీలో రూ.139.5 పెరిగింది. ముంబయిలో రూ.138 పెరిగాయి. ఈవిధంగా ఆరు నెల్లలో సబ్సిడీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధరలు 25 శాతం ...5లో

## భారాలు తగదు : ఏచూరి

వివరాలు 5లో

# కార్పొరేట్లు అంతేగా...



## పన్నులు తగ్గించినా పెరగని వసూళ్లు..

- నవంబర్‌లో 25 శాతం తక్కువ
- 2018-19తో పోల్చితే రూ. 2 వేల కోట్ల తేడా

**న్యూఢిల్లీ :** కార్పొరేట్లు చెల్లించే పన్నులను తగ్గించినా వసూళ్లు మాత్రం పెరగడం లేదు. కొద్దికాలంగా దేశంలో నెలకొన్న మందగమన పరిస్థితులతో గతేడాది సెప్టెంబర్‌లో మోడీ సర్కారు ...5లో

# ధాన్యం బస్తాలకు నిప్పు



## జాతీయ రహదారిపై రాస్తారోకో

- 1075 రకం ధాన్యం కొనాలని డిమాండ్
- వికారాబాద్‌లో పత్తి రైతుల ఆందోళన

నవతెలంగాణ-గోవిందరావుపేట/ యాలాల

ధాన్యం, పత్తి కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకోలు చేశారు. ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ ఘటనలు బుధవారం ములుగు, వికారాబాద్ జిల్లాల్లో జరిగాయి. 1075దొడ్డు ...5లో

# నా చిన్నప్పటి నుంచి బీజేపీ అలాగే...

## కాంగ్రెస్‌ను అంత ఈజీగా తీసుకోబోం...

- మాకు శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులూ లేరు
- ఎంఐఎంతో కలిసి పోటీ చేసేది లేదు :కేటీఆర్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తన చిన్నప్పుడు రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఎలా ఉండేదో.. ఇప్పుడు కూడా అదే విధంగా ఉందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని అంత ఈజీగా తీసుకోబోమని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీతోనే తమకు ...5లో

# న్యూ ఇయర్ బర్త్‌డే బేబీలు

## 1న పుట్టే శిశువులలో 17 శాతం మంది భారతీయులు

- భారత్‌లో 67,385 శిశు జననాలు : యూనిసెఫ్ అంచనా

వివరాలు 2లో



# వానొచ్చే..

## చలికాలంలో చినుకులు

- మరో రెండు రోజులపాటు వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉదయం పూట నుంచి మబ్బుతో నిండి..సాయంత్రం వానొచ్చింది. బుధవారం హైదరాబాద్‌తో సహా పలు చోట్ల వర్షం పడింది. కొద్దిపాటి చినుకులకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో వాహనరాకపోకలకు అసౌకర్యం కలిగింది. వాహనాలు దూసుకెళ్లటంతో..పాదచారులకు కష్టాలు తప్పలేదు. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఒడిషా, పరిసర ప్రాంతాలలో ఒకటిన్నర కిలోమీటర్ల నుంచి 2.1 కిలోమీటర్ల మధ్య ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారిందని కేంద్రం అధికారి రాజారావు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆగ్నేయ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పు దిశ నుంచి ప్రధానంగా గాలులు వీస్తున్నాయి. కోస్తాంధ్ర, యానాంలో ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు గురువారం కూడా అక్కడక్కడ కురిసే అవకాశముందని వివరించారు. రాయలసీమలో గురువారం నుంచి వరుసగా మూడురోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడవచ్చని అధికారులు అంచనా వేశారు.

### క్యాంపు రాజకీయాలు జానాన్నై

## ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడించేందుకు కుట్ర జరిగింది

- ప్రజల విశ్వాసం ఉన్న వారికే టికెట్లు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల

వివరాలు 3లో

### బీమా కోరెగావ్ వార్షికోత్సవానికి

# 5 లక్షల మంది దళితులు

## విస్తృత బందోబస్తు.. ఇంటర్నెట్ నిలిపివేత

- విద్యా సంస్థలు, మార్కెట్లు మూసివేత



వివరాలు 2లో

# చిన్నారిపై లైంగికదాడి

## అర్ధరాత్రి తల్లి పక్క నుంచి అపహరణ

- పరారీలో నిందితుడు



నవతెలంగాణ-కాటారం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అమానుష ఘటన జరిగింది. గతంలో హన్మకొండలో జరిగిన మాదిరిగానే.. తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని అర్ధరాత్రి అపహరించి లైంగిక దాడికి ఒడిగట్టాడు ఓ దుర్మార్గుడు. ఈ ఘటన మహాముత్తారం మండలంలోని ...5లో

### సీఏఏ నిరసనలతో న్యూఇయర్‌కు స్వాగతం

వివరాలు 2లో




# సీఏఏతో దేశ సమగ్రతకే ప్రమాదం


మాట్లాడుతున్న రామచంద్రన్ పిళ్లై

## రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాపోరాటాలు

- గ్లోబల్ వార్మింగ్‌తో వ్యవసాయం కుదేలు
- రోజురోజుకీ పడిపోతున్న వ్యవసాయ కార్మికుల కూలి
- పర్యావరణ పరిరక్షణను పట్టించుకోని కేంద్రం: ఏఐఏడబ్ల్యూయూ మహాసభలో సీపీఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యులు రామచంద్రన్ పిళ్లై

కన్నూర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మోడీ సర్కారు తీసుకొచ్చిన సీఏఏతో దేశ సమగ్రతకే ప్రమాదం పొంచి ఉన్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్. రామచంద్రన్ పిళ్లై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని సమస్యలను పక్కనపడేసి భావోద్వేగ పూరిత ...5లో

# ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే...!

## సీఏఏపై సీపీఐ(ఎం) విమర్శ



**న్యూఢిల్లీ:** ఇటీవల అమలులోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలేనని సీపీఐ(ఎం) ఘాటుగా విమర్శించింది. బంగ్లాదేశ్‌లో మతపరమైన అణచివేతను ఎదుర్కొంటున్న బాధితులందరికీ ఎటువంటి వివక్షకూ తావులేకుండా భారత పౌరసత్వాన్ని కల్పించాలని తాము మొదటి నుంచి చెబుతున్నామనీ, వారి హక్కుల కోసం తాము చేస్తున్న పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రధాని తన విషపూరిత విధానాల ద్వారా ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచురించిన ఒక పుస్తకంలో ధ్వజమెత్తింది. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్, మోడీ సర్కారు పది పెద్ద అబద్ధాలు' అంటూ ప్రచురించిన ఈ పుస్తకంలో ప్రధాని ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సీపీఐ(ఎం) అంశాలవారీగా విమర్శలు గుప్పించింది. గత నెల 22న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మోడీ బంగ్లాదేశ్‌లో మతపరమైన అణచివేతకు గురైన వారందరికీ పౌరసత్వాన్నిచ్చే అంశాన్ని తాము ...5లో

## 2021లో చంద్రయాన్‌-3

**ఇస్రో చైర్మెన్‌ శివన్‌**

**న్యూఢిల్లీ :** ప్రతిష్టాత్మక చంద్ర మిషన్‌ చంద్రయాన్‌-2ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పూర్తిగా విజయవంతం చేయలేదని కొందరు భావించిన కొన్ని నెలల వ్యవధిలోనే చంద్రయాన్‌-3 ప్రాజెక్టును ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నది. ఈ విషయాన్ని ఇస్రో చీఫ్‌ కె. శివన్‌ బుధవారం ధ్రువీకరించారు. చంద్రయాన్‌-3 ప్రాజెక్టు పురోగతిలో ఉన్నదని, అయితే అనుకున్న సమయానికి కాకుండా 14-16 నెలలు ఆలస్యంగా 2021 నాటికి పూర్తి అవుతుందని చెప్పారు. చంద్రయాన్‌ -3కి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ మంగళవారం మాట్లాడుతూ 2020లో చంద్రయాన్‌-3ని ప్రయోగం జరుగుతుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. చంద్రయాన్‌-3కి సంబంధించి రెండో 'స్పేస్‌పోర్ట్‌' అవసరమైన భూమిని ఇప్పటికే సేకరించామని, ఇది తమిళనాడులోని తుతుకుడి వద్ద ఏర్పాటు కానున్నదన్నారు. రూ.250 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్టు తెలిపారు.

## త్రివిధ దళాల మధ్య సమగ్రతకు కృషి : సీడీఎస్‌ బిపిన్‌ రావత్‌

**న్యూఢిల్లీ :** త్రివిధ దళాలను సమన్వయం చేస్తూ వాటి మధ్య సమగ్రతను పెంపొందించేందుకు కృషి చేస్తానని, వనరుల నిర్వహణను దారికి తీసుకు వస్తానని కొత్త త్రివిధ దళపతి జనరల్‌ బిపిన్‌ రావత్‌ బుధవారం అన్నారు. దేశ తొలి సీడీఎస్‌గా బిపిన్‌ రావత్‌ నియమితులైన విషయం తెలిసిందే. రావత్‌ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. త్రివిధ దళాలు ఒక బృందంగా కలిసి పనిచేస్తూ సామర్థ్యాలను పెంపొందించుకునేలా కృషి చేస్తామన్నారు. రక్షణ రంగ చీఫ్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానన్నారు. సమన్వయంతో పనిచేయడానికి వీలుగా 'సేవలను ఎలా సమగ్ర పరచవచ్చో' చూస్తామన్నారు. సీడీఎస్‌గా తాను తటస్థంగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి జాతీయ యుద్ధ స్మారకం వద్ద అమరులకు నివాళులు అర్పించారు. సైనిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సైన్యాధ్యక్షుడు మనోజ్‌ ముకుంద్‌ నరవనే, వైమానికదళ చీఫ్‌ మార్షల్‌ రాకేష్‌ కుమార్‌ సింగ్‌ బహదూరియా, నావికాదళ చీఫ్‌ కర్మవీర్‌ సింగ్‌ పాల్గొన్నారు.

## విజయ్‌ మాల్యా ఆస్తుల వేలానికి కోర్టు అనుమతి

**న్యూఢిల్లీ :** పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు విజయ్‌మాల్యాకు సంబంధించిన జప్తు చేసిన ఆస్తులను వేలం వేసేందుకు ఎట్టకేలకు బ్యాంకులకు అనుమతి లభించింది. మాల్యా ఆస్తులను వేలం వేసేందుకు భారతీయ స్టేట్‌ బ్యాంక్‌తో పాటు, ఇతర బ్యాంకులను ముంబయిలోని మనీ లాండరింగ్‌ నిరోధక (పీఎంఎల్‌ఏ) కోర్టు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ వర్గాలు బుధవారం తెలిపాయి. అయితే ఈ ఉత్తర్వులపై జనవరి 18 వరకు స్టే విధించింది. ఈ ఉత్తర్వులతో ప్రభావితమయ్యే సంస్థలు బొంబే హై కోర్టులో అప్పీల్‌ చేసుకునేందుకు స్టే విధించినట్టు తెలిపింది. మాల్యాకు సంబంధించిన జప్తు చేయనున్న ఆస్తులలో ప్రధానంగా పెద్ద విలువైన ఆర్థిక సెక్యూరిటీలు ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## కాంగ్రెస్‌, ఆప్‌ల కారణంగానే ఢిల్లీలో హింసాకాండ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాలైన కాంగ్రెస్‌, ఆప్‌ల కారణంగానే ఢిల్లీలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని కేంద్రమంత్రి ప్రకాష్‌ జవదేకర్‌ వ్యాఖ్యానించారు. జాతీయ పౌరసత్వ సవరణ చట్టాలను వ్యతిరేకిస్తూ.. కాంగ్రెస్‌, ఆప్‌లు ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. బీజేపీ ఢిల్లీ ఇన్‌చార్జిగా జవదేకర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. బీజేపీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ నిర్ణయించలేదని, అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని అన్నారు. మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారాస్త్రాలుగా వినియోగిస్తామని, ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని జవదేకర్‌ అన్నారు.

## 2019లో 160మంది ఉగ్రవాదులు హతం

- **30శాతం తగ్గిన ఘటనలు: జమ్మూ పోలీస్‌ అధికారులు**

**శ్రీనగర్:** గతేడాది (2019)లో జమ్మూకాశ్మీర్‌లో 160మంది ఉగ్రవాదులు హతమయ్యారని డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీస్‌ (డీజీపీ) దిల్బాగ్‌ సింగ్‌ వెల్లడించారు. మరో 250మంది ఉగ్రవాదులు లోయలో తమ కార్యకలాపాలను చురుకుగా కొనసాగిస్తున్నారని తెలిపారు. జమ్మూలోని పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌లో బుధవారం జరిగిన వార్షిక ప్రెస్‌ కాన్ఫరెన్స్‌లో దిల్బాగ్‌ మాట్లాడుతూ.. 2018తో పోల్చుకుంటే 2019లో ఉగ్రఘటనలు, పౌరహత్యలు 30శాతం తగ్గగా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు 36శాతం తగ్గాయని తెలిపారు. ఉగ్రవాదం వైపు వెళ్లే స్థానిక యువత సంఖ్య తగ్గిందని అన్నారు. 2018లో 218 మంది స్థానిక యువత ఉగ్రవాదంలో చేరగా, 2019లో 139మంది మాత్రమే చేరారనీ, వారిలో 40మంది ప్రాణాలు కోల్పోగా, ప్రస్తుతం 89మంది జీవించి ఉన్నారని వెల్లడించారు. ఉగ్రవాదంలో చేరిన వారి జీవితకాలం మూడు నెలలకే పరిమితమవుతుందనీ, జహంగిర్‌ సరూరీ, రియాజ్‌ నాయికూ వంటి వారు అతికష్టం మీద ప్రాణాలు కాపాడుకుంటున్నారని అన్నారు.

అలాగే, ఉగ్రవాద ఏరివేత కార్యకలాపాల్లో 11మంది పోలీసులు, 72మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారని చెప్పారు. చొరబాటుదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, వారి చర్యలను భద్రతా సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకున్నదని అన్నారు. 2018లో 143మంది చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించగా, 2019లో 130మంది ప్రవేశించారని వెల్లడించారు. వీటితో పాటు కాల్పుల విరమణ ఉల్లంఘనలూ ఎక్కువగానే జరిగాయని తెలిపారు. ఆర్టికల్‌ 370రద్దు సమయంలో పోలీసుల పనితీరును కొనియాడారు. త్వరలోనే అన్ని ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్‌ సేవలను పునరుద్ధరించనున్నామని తెలిపారు.

## ఏడాదిలో 110పులులు, 491చిరుతలు మృతి

**డబ్ల్యూపీఎస్‌ఐ నివేదికలో వెల్లడి**

**నాగ్‌పూర్:** గడిచిన ఏడాది (2019)లో 110 పులులు, 491చిరుతలు మృత్యువాత పడ్డాయి. చిరుత మరణాలకు మూడోవంతు రోడ్డు, రైలు ప్రమాదాలు కారణమవ్వగా, వేటకారణంగా ఎక్కువమొత్తంలో పులులు ప్రాణాలు కోల్పోయాయని 'వైల్డ్‌ లైఫ్‌ ప్రొటెక్షన్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా' (డబ్ల్యూపీఎస్‌ఐ) అనే స్వచ్ఛంద సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2018లో 34పులులు వేటకారణంగా మృత్యువాతపడగా, 2019లో 38పులులను వేటాడి చంపేశారు. అంతకుముందు ఏడాదిలో 500చిరుతలు మరణించగా, ఆ సంఖ్య 2019లో కాస్త తగ్గి 491గా ఉన్నప్పటికీ, అధికసంఖ్యలో రోడ్డు, రైలు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే విషయం. అటవీప్రాంతాల్లో రోడ్ల వెడల్పు కారణంగానే వాహనాలు వేగంగా వెళ్తున్నాయనీ, దాంతో జంతువులు రోడ్డు దాటేటప్పుడు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నాయని డబ్ల్యూపీఎస్‌ డెరెక్టర్‌ నితిన్‌ దేశాయ్‌ వెల్లడించారు.

పులుల మరణాల సంఖ్య గత రెండేండ్లుగా మధ్యప్రదేశ్‌, మహారాష్ట్రలోనే ఎక్కువగా ఉంటున్నది. 2018లో మధ్యప్రదేశ్‌లో 23 పులులు మృత్యువాత పడగా, మహారాష్ట్రలో 19చనిపోయాయి. ఈ సంఖ్య 2019లో మధ్యప్రదేశ్‌లో 29, మహారాష్ట్రలో 22కు పెరిగింది.

చనిపోయిన 110పులుల్లో, 38పులులు గాయాలు వేటాడటం కారణంగా ప్రాణాలు కోల్పోగా, 36పులులు ఇతర జంతువులతో ఘర్షణ పడటం కారణంగా మృత్యువాత పడ్డాయి. మరో 26 సహజమరణం పాలవ్వగా, రోడ్డు, రైలు ప్రమాదాల్లో మూడు, రక్షించే క్రమంలో ఆరు పులులు మృతిచెందాయి. అలాగే, మృతిచెందిన 491చిరుతల్లో కేవలం మహారాష్ట్రలోనే 97ప్రాణాలుకోల్పోగా, అందులో 31రోడ్డు, రైలు ప్రమాదాల వల్ల చనిపోయాయి. 127చిరుతలు వేటకారణంగా మృత్యువాత పడ్డాయి. దీనిపై డబ్ల్యూపీఎస్‌ఐ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌ టిటో జోసెఫ్‌ మాట్లాడుతూ.. 2019లో గాయాలు, వేటకారణంగా మృతిచెందిన పులుల సంఖ్య పెరిగిందని అన్నారు. పులుల శరీరభాగాలకు ఉన్న డిమాండ్‌ వల్లే వేటగాళ్లు రెచ్చిపోతున్నారని తెలిపారు.

# సీఏఏ నిరసనలతో న్యూఇయర్‌కు స్వాగతం

### దేశవ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

**న్యూఢిల్లీ, చెన్నై, తిరువనంతపురం :** దేశవ్యాప్తంగా పౌరసత్వ చట్ట సవరణ(సీఏఏ) వ్యతిరేక ఆందోళనల ఊపు కొత్త సంవత్సరంలోనూ కొనసాగింది. వివాదాదాస్పద చట్టానికి వ్యతిరేకంగా.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి దేశరాజధాని ఢిల్లీలోని పలు ప్రాంతాలు నిరసనలతో హెూరెత్తాయి. షహీన్‌ బాఘ్‌లో వేలాది మంది నిసనకారులు సీఏఏ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత నిరసనకారులు జాతీయ గీతాన్ని ఆలపిస్తూ.. కొత్త ఏడాదికి ఆహ్వానం పలుకుతూ.. తమ నిరసనను వ్యక్తం చేశారు. జామియా మిలియా ఇస్లామియా(జేఎంఐ)లోనూ విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటకలలోనూ చట్టానికి వ్యతిరేకంగా ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించారు. అసోం, త్రిపుర సహా ఈశాన్య రాష్ట్రాల్లో సీఏఏ వ్యతిరేక ఆందోళనలు కొనసాగాయి.

**ఢిల్లీలో ఎముకలు కొరికే చలిలోనూ..**

సీఏఏ వ్యతిరేక ఆందోళనలతో మంగళవారం దేశరాజధాని ఢిల్లీ దద్దరిల్లింది. షహీన్‌ బాఘ్‌, సాకెత్‌, కన్నాట్‌ ప్లేస్‌ లలో ఆందోళనకారులు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. ఒక పక్కన ఎముకలు కొరికే చలిలోనూ వెనక్కి తగ్గకుండా వారు ఆందోళనలు చేశారు. మహిళలు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, పలువురు ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. కొత్త సంవత్సరంలోనైనా సీఏఏను రద్దు చేయాలనే డిమాండ్‌ను వారు వినిపించారు. ప్రధానంగా షహీన్‌ బాఘ్‌ ప్రాంతంలో రెండు వారాలుగా నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ నిరసనల్లో మరీ ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరితో పాటు వారి చిన్నారులు, కాలేజీ విద్యార్థులు ఉన్నారు.

ఇటు జేఎంఐలోనూ విద్యార్థుల నిరసనలు కొనసాగాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న సమయంలో షహీన్‌బాఘ్‌, జేఎంఐ వర్సిటీలలో నిరసనకారులు జాతీయ గీతాన్ని ఆలపించి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నిరసన తెలిపారు.

ఆ తర్వాత 'ఇంక్విలాబ్‌ జిందాబాద్‌' అంటూ పెద్ద పెట్టున నినాదాలు వినిపించారు. సీఏఏ.. భారత రాజ్యాంగానికి ముప్పు అనీ, దాని నుంచి రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకుంటామని పలువురు నిరసనకారులు తెలిపారు. సీఏఏకు వ్యతిరేక ఆందోళనల్లో జాతీయ జెండాలను, ప్లకార్డులను ప్రదర్శించారు.

దక్షిణ ఢిల్లీలో సామాజిక కార్యకర్త షబ్నం హష్మీ, లాయర్‌ వృందా గ్రోవర్‌ సహా పలువురు ఆందోళనల్లో పాల్గొన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాన్‌స్టిట్యూషన్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇండియా వద్ద పలువురు సామాజిక కార్యకర్తలు, ఆర్టిస్టులు గుమిగూడి సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారికి తమ మద్దతును ప్రకటించారు. జేఎంఐ వద్ద బుధవారం కూడా విద్యార్థుల నిరసన ప్రదర్శనలు కొనసాగాయి.

బాలీవుడ్‌ నటి స్వరా భాస్కర్‌.. జేఎంఐ దీక్షా ప్రదేశాన్ని సందర్శించి ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఇండియా గేట్‌ వద్ద నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనల్లో పాల్గొన్నారు. 'రాజ్యాంగాన్ని రక్షించాలి' అంటూ నిరసనకారులంతా ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞకు ముందు, తర్వాత నిరసనకారులు పెద్ద పెట్టున నినాదాలు వినిపించారు.

తమిళనాడులో సీఏఏ నిరసనల పర్వం కొనసాగింది. చెన్నైలోని వల్లువర్‌ కొట్టం వద్ద సీఏఏ వ్యతిరేక నిరసనలు జరిగాయి. సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా మాట్లాడిన తమిళ రచయిత నెల్లై కన్నన్‌ను అరెస్టు చేయాలంటూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో బీజేపీ సీనియర్‌ నాయకులు హెచ్‌ రాజా, పొన్‌ రాధాకృష్ణన్‌ సహా 100 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కేరళలోని కొచ్చిలో వేలాది మంది ముస్లింలు సీఏఏ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు, ప్లకార్డులను ప్రదర్శించారు. 'భారత్‌లోనే పుట్టాం. భారత్‌లోనే జీవిస్తాం. భారత్‌లోనే మరణిస్తాం' అంటూ ప్లకార్డులపై నిరసనకారుల రాతలు కనిపించాయి. దీంతో తీర ప్రాంత నగరంలోని వీధులు ర్యాలీలు, నినాదాలతో హెూరెత్తాయి. వివాదాస్పద సీఏఏను మోడీ సర్కారు వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రజలు డిమాండ్‌ చేశారు.

చండీగఢ్‌లో వామపక్ష అనుబంధ సంఘాలు సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాయి. సెక్టార్‌ 17 వద్ద జరిగిన నిరసనలో కార్యకర్తలు పాల్గొన్నారు. 'మేము పత్రాలను చూపం', 'విభజనకు పౌరులు వ్యతిరేకం' అనే నినాదాలతో నిరసనకారులు బ్యానర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మోడీ సర్కారుపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో యూపీలోని అలీగఢ్‌ ముస్లిం యూనవర్సిటీకి సెలవులను మళ్లీ పొడిగించారు. వాస్తవానికి ఈనెల 6న యూనివర్సిటీ తెరుచుకోవాలి. అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సెలవులను పొడిగించామనీ, తరగతుల పున:ప్రారంభంపై ప్రస్తుత పరిస్థితులను అంచనావేసిన తర్వాత సమగ్ర షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

కర్నాటక రాజధాని బెంగళూరులో నిరసనలు ఎగిశాయి. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లకు వ్యతిరేకంగా నిరసనకారులు ఆందోళన చేపట్టారు. వాటికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు.

**బెంగాలీ సినీ నిర్మాతపై దాడి**

కోల్‌కతాలో సీఏఏకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్నందుకు ప్రముఖ బెంగాలీ సినీ నిర్మాత రోన్నీ సేన్‌పై కొందరు దుండగులు కత్తితో దాడి చేశారు. జాదవ్‌పూర్‌ యూనివర్సిటీలో సీఏఏ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్‌పై బీజేపీ కార్యకర్తలు రెండురోజుల క్రితం దాడికి దిగిన విషయం విదితమే.



ఢిల్లీలో..



చెన్నైలో..

### త్రిపురలో పోరాటానికి ఐపీఎఫ్‌టీ పిలుపు

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో అధికార బీజేపీకి మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ షాకిచ్చింది. సీఏఏ నుంచి రాష్ట్రాన్ని మినహాయించడంతో పాటు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 6 నుంచి నిరవధిక దీక్షకు దిగనున్నది. ఖుముల్‌వింగ్‌లోని త్రిపుర ట్రైబల్‌ ఏరియాస్‌ అటానమస్‌ డిస్ట్రిక్ట్‌ కౌన్సిల్‌(టీటీఏడీసీ) ప్రధాన కార్యాలయం వద్ద దీక్షకు దిగనున్నట్టు ఐపీఎఫ్‌టీ సహాయ ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి అయిన మంగోల్‌ దేవ్‌వర్మ తెలిపారు. అసోంలో బీజేపీ మిత్రపక్షమైన అసోం గణ పరిషత్‌(ఏజీపీ).. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. పౌరసత్వ చట్టం, జాతీయ పౌర రిజిస్టర్‌, ఎన్పీఆర్‌ లపై దేశవ్యాప్తంగా ప్రజలు చేస్తున్న ఆందోళనలతో మోడీ సర్కారుపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్న క్రమంలో ఇటు మిత్రపక్షాలు కూడా షాకిస్తుండటం గమనార్హం.

# బీమా కోరెగావ్‌ వార్షికోత్సవానికి 5 లక్షల మంది దళితులు

### విస్తృత బందోబస్తు ఇంటర్నెట్‌ నిలిపివేత

- **విద్యా సంస్థలు, మార్కెట్లు మూసివేత**

**పూణె :** మహారాష్ట్రలోని పూణెలో బుధవారం జరిగిన బీమా కొరెగావ్‌ యుద్ధ 202వ వార్షికోత్సవానికి దాదాపు 5 లక్షల మంది దళితులు హాజరయ్యారు. పూణెకు 40 కిలోమీటర్ల దూరంలో భీమాకోరెగావ్‌ ప్రాంతముంది. భీమా కోరెగావ్‌ యుద్ధ విజయానికి సంకేతంగా ఈ ప్రాంతంలోని పెర్నె గ్రామం వద్ద జయస్తంభాన్ని నిర్మించారు. ప్రతి ఏటా లక్షలాది మంది దళితులు ఇక్కడకు చేరుకుని నివాళులు అర్పిస్తారు. రెండేండ్ల క్రితం ఈ వార్షికోత్సవం సందర్భంగా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి.

ఈ నేపథ్యంలో బుధవారం ప్రభుత్వం 10 వేల మంది పోలీసులను మోహరించిందని, ముందస్తు జాగ్రత్త చర్యగా ఇంటర్నెట్‌ సేవలను రద్దు చేసిందని పూణె జిల్లాకు చెందిన సీనియర్‌ అధికారి ఒకరు తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్‌ నావల్‌ కిషోర్‌ రామ్‌ మీడియాతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమంలో పుకార్ల వ్యాప్తిని నివారించేందుకు ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇంటర్నెట్‌ను నిలిపివేసినట్టు చెప్పారు. స్థానిక పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, మార్కెట్లను మూసివేశారు. ఈ ప్రాంతానికి ఇప్పటికే ఐదు లక్షల మంది సందర్శకులు చేరినట్టు స్పెషల్‌ ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ (కొల్హాపూర్‌ రేంజ్‌) సుహాస్‌ వాడ్కే తెలిపారు.



సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. గత ఏడాది దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌ పవార్‌, ప్రముఖ దళిత నాయకుడు ప్రకాష్‌ అంబేద్కర్‌ కూడా జయ స్తంభాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ప్రకాష్‌ అంబేద్కర్‌ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆంగ్లేయులకు-మరాఠాలకు మధ్య జరిగిన మూడో యుద్ధంలో బ్రిటీషు బలగాలు విజయం సాధించినందుకు చిహ్నంగా జయస్తంభ్‌ను ఏర్పాటు చేశారు. ఈ యుద్ధం 1818లో జరిగింది. ప్రతి ఏడాది జనవరి 1న వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఈ క్రమంలో బుధవారం నాటి కార్యక్రమానికి కూడా లక్షల సంఖ్యలో దళితులు హాజరయ్యారు. ఆ కాలంలో సమాజంలో అంటరానివారుగా పరిగణించబడుతున్న మహర్‌ కమ్యూనిటి నుండి వచ్చిన సైనికులకు ఈస్ట్‌ ఇండియా కంపెనీ సైన్యం మద్దతిచ్చింది. అప్పట్లో ఉన్నత కులాలుగా పిలవబడే పీష్వాలపై దళితులు కృతనిశ్చయంతో జరిపిన పోరాటానికి సంకేతంగా ప్రతి ఏడాది విజయోత్సవాన్ని జరుపుకొంటారు.

రెండేళ్ళ క్రితం 2018లో జరిగిన విజయోత్సవం సందర్భంగా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# న్యూ ఇయర్‌ బర్త్‌డే బేబీలు

### 1న పుట్టే శిశువులలో 17 శాతం మంది భారతీయులు

**యూనిసెఫ్‌ అంచనా**



**న్యూఢిల్లీ:** కొత్త ఏడాది మొదటి రోజున జన్మించబోయే శిశువుల్లో 17 శాతం మంది భారతీయులు ఉంటారని అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'యూనిసెఫ్‌' అంచనావేసింది. యూనిసెఫ్‌ వెల్లడించిన మరిన్ని వివరాల ప్రకారం.. నూతన సంవత్సరంలో జనవరి 1న పుట్టే దాదాపు 3,92,078 శిశువులలో 17 శాతం మంది భారతీయ శిశువులు ఉండనున్నారు. కొత్త ఏడాదిలో మొదటి బిడ్డ ప్రసవం పసిఫిక్‌లోని ఫిజీలో జరిగే అవకాశం ఉండగా, అమెరికాలో చివరి ప్రసవం జరగనున్నదని యూనిసెఫ్‌ తెలిపింది. అయితే, ప్రపంచవ్యాప్తంగా సగానికిపైగా జననాలు 8 దేశాల్లో ఉండగా, ఈ జాబితాలో భారత్‌ (67,385 శిశు జననాలు) అగ్రస్థానంలో ఉండగా, చైనా (46,299), నైజీరియా (26,039), పాకిస్తాన్‌ (16,787), ఇండోనేషియా (13,020), అమెరికా (10,452), డెమొక్రటిక్‌ రిపబ్లిక్‌ ఆఫ్‌ కాంగో (10,247) ఇథియోపియా(8,493)లు తర్వాతి స్థానాల్లో ఉంటాయని యూనిసెఫ్‌ అంచనా వేసింది.

ప్రతి ఏడాది నూతన సంవత్సరం మొదటి రోజున జన్మించిన ప్రతిశిశువు రాబోయే తరాలకు గుర్తింపు అంటూ వారి పుట్టిన రోజు వేడుకలను యూనిసెఫ్‌ ప్రత్యేకంగా నిర్వహిస్తుంది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భారతీయ భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్‌ బోస్‌( 1894 జనవరి 1), బాలీవుడ్‌ ప్రముఖ నటి విద్యాబాలన్‌(1979 జనవరి 1) వంటి వారు నూతన ఏడాది మొదటిరోజున జన్మించారు. కాగా, 2018లో ప్రపంచవ్యాప్తంగా 2.5 మిలియన్ల నవజాత శిశువులు నెలలోపే చనిపోయారు. వీరిలో మూడో వంతు జన్మించిన మొదటిరోజునే మృతి చెందారు. దీనికి అదనంగా 2.5 మిలియన్ల మంది చిన్నారులు ప్రతీ ఏటా చనిపోతున్నప్పటికీ.. మూడేండ్లలో మరణాల తగ్గింపులో మంచి పురోగతి సాధించామని యూనిసెఫ్‌ తెలిపింది.

# ఐక్యపోరాటాలను విస్తృత పర్చాలి

### బీకేఎమ్‌యూ అధ్యక్షులు పెరియార్‌స్వామి

**కన్నూరు నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

దేశవ్యాప్తంగా ఐక్యపోరాటాలను విస్తృత పర్చాల్సిన ఆవశ్యకత ఉందని బీకేఎమ్‌యూ అఖిల భారత అధ్యక్షులు పెరియార్‌స్వామి అన్నారు. కన్నూర్‌లోని ఈకే నయనార్‌ అకాడమీలోని పీకే కాంచన్‌ నగర్‌లో జరుగుతున్న ఏఐఏడబ్ల్యూయూ మహాసభనుద్దేశించిన ఆయన సౌహార్ధక సందేశాన్ని ఇచ్చారు. పారిశ్రామిక రంగం పూర్తిగా దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ అనాలోచిత నిర్ణయాల వల్ల సామాన్యులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం దేశ వ్యవసాయ రంగంపైన కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదన్నారు. మరోవైపు వన్‌నేషన్‌, వన్‌ కాన్‌స్టిట్యూషన్‌, వన్‌ రిలీజియన్‌...అనే ధోరణితో బీజేపీ వెళుతున్నదనీ, ఇది దేశానికే ప్రమాదకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విశాల పోరాటాలను నిర్మించుకుంటూ భారతదేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**మహాసభ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి: తీర్మానాన్ని ప్రవేశపెట్టిన వి.వెంకటేశ్వర్లు**

'దేశంలోని 22 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు రెక్కలను నమ్ముకుని జీవిస్తున్నారు. స్వాతంత్య్రం వచ్చి 70 ఏండ్లు గడుస్తున్నా వీరికి ఎలాంటి చట్టాలు లేవు. వ్యవసాయరంగం ఉత్పత్తిలో వీళ్ల కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. దేశంలో కేరళ రాష్ట్రం మినహా ఎక్కడ కూడా కనీస వేతనాలు అమలు చేయడం లేదు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టంలో కూడా వంద రోజుల పని గ్యారంటీ అనేది ఎక్కడా జరగడం లేదు. పనికిదగ్గ వేతనం కూడా పడటం లేదు. దీంతో లక్షలాది వలసలు పోయి ప్రమాదాల్లో చనిపోతున్నారు. వీళ్ల జీవన విధానం మెరుగుపడాలంటే ప్రతి కుటుంబానికి భూ పంపిణీ చేయడం ద్వారానే ఆర్థిక స్తోమత, సామాజిక భద్రత చేకూరుతుంది. భారతదేశంలో పాలకవర్గాలు ఈ పని చేయడంలేదు. ఈ దేశంలో వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం సాధించుకోవడం ద్వారానే సకల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. చట్టం పోరాడి సాధించుకోవాలి' అని ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా...బెంగాల్‌ నాయకులు బిశ్వనాథ్‌ ఘోష్‌ బలపరిచారు. మహాసభ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

**ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి : నిత్యానంద**

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ నాయకులు నిత్యానంద స్వామి ప్రవేశపెట్టారు. 'దేశంలో ప్రస్తుతం వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం వల్ల వ్యవసాయ కార్మికుల ఆదాయాలు రోజురోజుకీ పడిపోతున్నాయి. చాలా మందికి ఆహారం కూడా దొరకని పరిస్థితి నెలకొంది. మరోవైపు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. గ్రామీణ పేదలను ఆదుకోవాలంటే ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిందే. అవినీతిని అరికట్టాలి. ప్రతి కుటుంబానికీ నెలకు సరిపడా సరుకులు అందజేయాలి. అందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లాభం చేకూరేలా ఉండాలి' అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వీఆర్‌.బాలన్‌ బలపరిచారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

# మున్సిపల్ రిజర్వేషన్లపై సర్కారు కుస్తీ

- ఊపందుకున్న ప్రక్రియ

## బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ఓటర్ల తొలగింపు, చేరికలూ కీలకమే



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికలకు కీలకఘట్టం మొదలైంది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల మేయర్లు, చైర్ పర్సన్ల రిజర్వేషన్ల ఖరారుకు ప్రక్రియకు సంబంధించి అధికారులు శ్రీకారం చుట్టారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కలే ప్రాతిపదిక కావడంతో పాత, కొత్త కార్పొరేషన్లు, మున్సిపాల్టీల జనాభా వివరాలను క్రోడీకరిస్తున్నారు. ఇక మిగిలిన బీసీ రిజర్వేషన్ల కోసం ఓటర్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నందున తాజాగా జరుగుతున్న ఓటర్ల చేరికలు, తొలగింపులు కీలకంగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో పురపాలక శాఖ అధికారులు బీసీ ఓటర్లకు సంబంధించి ఒక అంచనాకు వచ్చినప్పటికీ తుది జాబితా వచ్చాక స్పష్టత రానున్నది. ఈలోపు 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించాల్సిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు తుదిరూపం ఇచ్చే పనిలో పడ్డట్టు సమాచారం. మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల వారీగా ఆ వర్గాల జనాభా, మొత్తం జనాభాలో వారి శాతాన్ని లెక్కిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 19 కార్పొరేషన్లుండగా ఒక ఎస్సీ జనరల్, ఒక ఎస్సీ మహిళ, ఒక ఎస్టీ జనరల్, మూడు బీసీ జనరల్, మూడు బీసీ మహిళ, ఐదు మహిళా జనరల్, ఐదు అన్‌రిజర్వ్‌డ్ ఉన్నాయి. తెలంగాణలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్టీ జనరల్‌కు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ జనరల్‌కు, జీహెచ్‌ఎంసీ బీసీ జనరల్‌కు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా జనరల్ కు కేటాయించారు. వరంగల్ , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లు జనరల్ కేటగిరీ కింద ఉన్నాయి. నాడు ఆరు కార్పొరేషన్లుండగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడు మున్సిపాల్టీలను కార్పొరేషన్లుగా మార్చడంతో మొత్తం 13 అయ్యాయి. ప్రస్తుతం రిజర్వేషన్లను ఖరారు చేసే ముందు 13 కార్పొరేషన్లలో ఎస్సీ, ఎస్టీ జనాభాను మొదట లెక్కిస్తారు. ఆ తర్వాత మొత్తం కార్పొరేషన్లలో ఉన్న జనాభాలో ఎస్సీల శాతం, ఎస్టీల శాతం ఎంతుందో అంచనా వేస్తారు. ఏ కార్పొరేషన్లో అయితే ఎస్సీలు, ఎస్టీలు ఎక్కువ శాతముంటే ఆ కార్పొరేషన్లు వారికి దక్కనున్నాయి.

ఇక మున్సిపల్ చైర్ పర్సన్ల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్టీ జనరల్ 2, ఎస్టీ (మహిళ) 2, ఎస్సీ జనరల్ 10, ఎస్సీ (మహిళ) 10, బీసీ జనరల్ 27, బీసీ (మహిళ) 26, జనరల్ (మహిళ) 41, అన్‌రిజర్వ్‌డ్ 40 కేటాయించారు. తెలంగాణలో మహబూబాబాద్, దేవరకొండ, అచ్చంపేట్ ఎస్టీలకు దక్కగా, ఎస్సీలకు మధిర, పరకాల, ఇబ్రహీంపట్నం, హుస్నాబాద్, భూపాలపల్లి, పెద్దఅంబర్‌పేట్, కొల్లాపూర్, జమ్మికుంట కేటాయించారు. తెలంగాణ ఏర్పడే నాటికున్న మున్సిపాల్టీలకు తోడు పెరిగిన మున్సిపాల్టీలతో ప్రస్తుతం మొత్తం 128 మున్సిపాల్టీలున్నాయి. కొత్త మున్సిపాల్టీల జనాభాను కూడా పరిగణనలోకి తీసుకొని కేటాయింపులు జరపనున్నారు. పాత, కొత్త మున్సిపాల్టీల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉండడంతో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం.బీసీల రిజర్వేషన్ మాత్రం ఓటర్ల తుది జాబితా వచ్చిన తర్వాతే చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న 10 కార్పొరేషన్లు 120 మున్సిపాల్టీలతో పాటు ఎన్నికలు లేని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల జనాభాను, ఓటర్లను రిజర్వేషన్ల కోసం ప్రాతిపదికగా తీసుకోనుండడం గమనార్హం. ఈ సారి కేటాయించే రిజర్వేషన్లు రెండు దఫాలు అంటే పదేండ్ల పాటు వర్తించనుండడం గమనార్హం. కీలకమైన నాలుగు రోజులు

బీసీ రిజర్వేషన్లకు కార్పొరేషన్ లేదా మున్సిపాల్టీలో ఓటర్ల శాతం పరిగణనలోకి తీసుకుంటుండడంతో ఓటర్ల జాబితా కీలకం కానున్నది. ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపులు కూడా బీసీలకు కేటాయింపులపై ప్రభావం చూపించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనితో ఆయా రాజకీయ పార్టీల్లోని నాయకులు, ముఖ్యంగా బీసీ నాయకులు తమ అనుచరులు, వర్గం ఓట్లు ముసాయిదాలో ఉన్నాయో లేదో అని తరచి చూసి చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. బీసీ ఓటర్లను తక్కువ చేసి చూపించేందుకుగాను కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఇతర బోగస్ ఓట్లను చేర్పించే ప్రయత్నాల్లో ఉన్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి.

# నేడు హైదరాబాద్‌లో వామపక్షాల రాష్ట్ర సదస్సు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 8న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సులో తమ్మినేని వీరభద్రం (సీపీఐఎం), చాడ వెంకటరెడ్డి (సీపీఐ), పోటు రంగారావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), కె గోవర్ధన్ (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), తాండ్ర కుమార్ (ఎంసీపీఐయూ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), జానకి రాములు (ఆరెస్పీ), బండా సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ప్రసాద్ (సీపీఐఎంఎల్), రాజేష్ (సీపీఐఎంఎల్ లిబరేషన్) తదితరులు హాజరవుతారు.



## టాలీవుడ్ ప్రొడ్యూసర్ కొడుకు అరెస్ట్

- ప్రొడ్యూసర్‌పైనా కేసు
- పోలీసు విధులకు ఆటంకం కల్గించారని..

**నవతెలంగాణ-పంజాగుట్ట**

డిసెంబర్ 31 అర్ధరాత్రి పోలీసుల విధులకు ఆటంకం కల్గించారని టాలీవుడ్ ప్రొడ్యూసర్‌పై కేసు నమోదు చేయడమే కాకుండా, అతని తనయుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో డిసెంబర్ 31న ఈవెంట్‌లో 'బ్యూటిఫుల్' సినిమా ప్రమోషన్ చేస్తామని చెప్పి ప్రొడ్యూసర్ నట్టికుమార్ వద్ద ఈవెంట్ మేనేజర్ సుమన్ డబ్బులు తీసుకున్నాడు. ఆ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా రాంగోపాల్ వర్మ రావాల్సి ఉండగా రాలేదు. సినిమా ప్రమోషన్‌నూ చేయలేదు. అంతేకాకుండా, ప్రొడ్యూసర్ కొడుకు క్రాంతి కుమార్ కారును పార్కింగ్ చేస్తామని చెప్పి తాళాలు తీసుకున్న సిబ్బంది మళ్లీ ఇవ్వలేదు. దాంతో క్రాంతికుమార్ వారితో గొడవ పడ్డాడు. సమాచారం అందుకున్న పంజాగుట్ట పోలీసులు అక్కడికెళ్లి ఇరువురికీ సర్ది చెప్పే ప్రయత్నం చేయగా, క్రాంతికుమార్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. దాంతో క్రాంతికుమార్‌ను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న క్రాంతి కుమార్ తండ్రి ప్రొడ్యూసర్ నట్టికుమార్ తన అనుచరులతో పీఎస్‌కు చేరుకుని పోలీసులతో గొడవకు దిగారు. దీంతో అతనిపైనా కేసు నమోదు చేసి చేశారు.

**పోలీసులే నా కుమారుడిపై దాడి చేశారు..**

పంజాగుట్ట పోలీసులే తన కుమారుడిపై దాడి చేశారని టాలీవుడ్ ప్రొడ్యూసర్ నట్టి కుమార్ ఆరోపించారు. కంట్రీ క్లబ్ ఈవెంట్లో పార్కింగ్ విషయంలో గొడవ జరుగుతుందంటూ క్రాంతి తనకు ఫోన్ చేస్తే.. డయల్ 100కు కాల్ చేయమని చెప్పినట్టు వివరించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పాల్సింది పోయి తన కుమారుడిపై దాడి చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై డీజీపీని కలిసి వివరించినట్టు తెలిపారు. సినిమా ప్రమోషన్ కోసం తన వద్ద డబ్బులు తీసుకున్న ఈవెంట్ మేనేజర్ సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నట్టికుమార్ కోరారు.

# తల్లీకూతుళ్లను ఢీకొట్టిన అంబులెన్స్

**తీవ్ర గాయాలై ఆస్పత్రిలో ఇద్దరూ మృతి**

- మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్
- వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో మరో నలుగురు..



**నవతెలంగాణ-బూర్గంపాడు/చర్ల/డిండి**

తల్లీకూతురు కలిసి స్కూటీపై వెళ్తుండగా అంబులెన్స్ వాహనం వారిని ఢీకొట్టింది. మద్యం మత్తులో ఉన్న ఆ వాహన డ్రైవర్ అత్యంత వేగంగా నడపడంతో చిన్నారీ ఆమె తల్లి ఇద్దరూ మరణించారు. నూతన సంవత్సరం రోజున భద్రాద్రి జిల్లా బూర్గంపాడులో ఈ ఘటన విషాదం నింపింది. బుధవారం వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరో నలుగురు మృతిచెందారు. భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ బూర్గంపాడు నుంచి భద్రాచలం వైపునకు వెళ్తుంది. అదే క్రమంలో భద్రాచలం పట్టణానికి చెందిన తోట చంద్రిక(29), వడ్డె శ్రీలాస్య (6), శ్రీలతలు ముగ్గురు స్కూటీపై బుధవారం సాయంత్రం భద్రాచలం వైపునకు వెళ్తున్నారు. వెనుక నుంచి వస్తున్న అంబులెన్స్ బూర్గంపాడు శివారులోని పులితేరు వాగు సమీపంలో స్కూటీని అతివేగంతో ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం తరలించగా చంద్రిక, శ్రీలాస్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. శ్రీలతకు గాయాలయ్యాయి. బాధితులు పాము లేరు పిక్నిక్ వెళ్లి వస్తున్నట్టు సమాచారం. అంబులెన్స్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన కలిబిండి సోమరాజు(48) బైక్‌పై వస్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ జిల్లా డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందిన బొల్లి పెంట య్య కుమార్తె శివాణి (17), ఆమె స్నేహితులైన హరికృష్ణ, అనిల్ నూతన సంవత్సరం వేడుకల అనంతరం మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. కామేపల్లి స్టేజీ వద్దకు రాగానే మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించ బోయి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయారు. శివాణి తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో హరికృష్ణ మృతి చెందాడు. సిద్దిపేటజిల్లా రాయపోల్ మండలం ముంగాజ్ పల్లి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన నాగరాజు (22) మృతిచెందాడు.



## సమస్యలను గాలికొదిలేసిన మోడీ ప్రభుత్వం

**నవతెలంగాణ సంపాదకులు వీరయ్య**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక విధానాలతో ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని నవతెలంగాణ సంపాదకులు ఎస్.వీరయ్య అన్నారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలను అనుసరిస్తూ.. ప్రజా వ్యతిరేకత రాకుండా భావోద్వేగపూరిత చర్యలతో జనాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతో 2019 సంవత్సరం ప్రజలకు కష్టాలు, కన్నీళ్లనూ మిగిల్చిందని అన్నారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్‌ఆర్‌పీలను తెరపైకి తీసుకొచ్చి.. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, రైతుల సమస్యలను మోడీ ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని



పిలుపునిచ్చారు. సమావేశానికి ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి పి.ప్రభాకర్.. అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా కిరణ్‌చంద్ర, ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు.



## నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ (ఎన్‌ఎస్‌ఓ) ఫలితాలలో నారాయణ స్కూల్స్ టాప్

**హైదరాబాద్ :** జాతీయ స్థాయిలో సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్, ఢిల్లీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్-2019 మొదటిదశ ఫలితాలలో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. 3,4, 6 తరగతుల్లో ఇంటర్నేషనల్ ఫస్ట్ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. రెండవ దశకు ఎంపికైన నారాయణ విద్యార్థుల్లో 100లోపు అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన వారు 2837( 35.8శాతం) ఉండగా, 100లోపు జోనల్ (రాష్ట్ర)స్థాయి ర్యాంకులు సాధించిన వారి సంఖ్య 4,444 (56.1 శాతం)గా ఉన్నదని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ పేర్కొన్నారు.

రెండవ దశ పోటీపరీక్షకు దేశంలోనే అత్యధిక మంది విద్యార్థులు ఒక్క నారాయణ స్కూల్స్ నుంచే ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. నారాయణ తప్ప మరే ఇతర స్కూల్ ఇంతటి అత్యద్భుత విజయం సాధించలేదన్నారు. ఏటా నిర్వహించే నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షను 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

## హెూమిబాబా- సైన్స్ అస్ట్రానమి ఒలింపియాడ్‌లలో శ్రీచైతన్య హవా

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ నిధులతో హెచ్‌బీసీఎస్ ఈ (హెూమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐఏపీటీ ఒలింపియాడ్‌లో ఒక్క శ్రీచైతన్య నుంచే అత్యధికంగా 171 మంది విద్యార్థులు మెరిట్ ఇండెక్స్‌పై మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో 75 మంది విద్యార్థులు, జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో 43 మంది విద్యార్థులు, ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో 29 మంది విద్యార్థులందరూ జనవరి నెలలో జరగబోయే ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్ (ఐఎన్‌ఓ) పరీక్షలో పాల్గొంటారని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.ఎస్. రావుగారు తెలిపారు. రాష్ట్రాలవారీగా చూసినా లేక మొత్తంగా చూసినా తమకు దరిదాపుల్లో కూడా మరేఇతర విద్యాసంస్థ ఇన్ని సెలక్షన్‌లు సాధించలేదని తెలిపారు. ఈ ఫలితాలు ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య యొక్క ఆధిపత్యాన్ని మరో సారి నిరూపించాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్స్ సుష్మ, సీమ తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఒలింపియాడ్‌లలో కూడా శ్రీచైతన్య ఆల్ ఇండియా నెం. 1గా నిలిచిందని తెలిపారు. ప్రత్యేక అకాడమిక్ ప్రోగ్రామ్స్ మరియు అంకిత భావంతో పనిచేసే అధ్యాపకుల వల్లనే తాము ఇంతటి ఘన విజయాలు సాధించగల్గుతున్నామని తెలిపారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శ్రీచైతన్య విద్యాసంస్థ అధినేత డాక్టర్ బి.ఎస్.రావు అభినందనలు తెలియజేశారు.



## క్యాంపు రాజకీయాలు జాన్తానై

- ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడించేందుకు కుట్ర జరిగింది
- ప్రజల విశ్వాసం ఉన్న వారికే టికెట్లు: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్

**నవతెలంగాణ - జమ్మికుంట**

ఎమ్మెల్యే ఎన్నికల్లో కొంత మంది నమ్మక ద్రోహం చేసి వెన్నుపోటు పొడిచారని, క్యాంపు రాజకీయాలు తనతో కుదరవని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లిలోని దినేష్ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తలతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి ఈటల, మాజీ మంత్రి, టీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి బసవరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. డబ్బులు, మద్యానికి ఓట్లు పడవన్నారు. నిజాయితీగా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి పని చేసే వారికే ఓట్లు వేస్తారని చెప్పారు. ప్రజల విశ్వాసం, సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న వారికే టీఆర్‌ఎస్ టికెట్లు ఇస్తుందన్నారు నాయకులను గెలిపించేందుకు కార్యకర్తలు ఎంత కష్టపడతారో తనకు తెలుసని, అమ్ముడు పోనిది ఆత్మ గౌరవం మాత్రమేనని అన్నారు. నమ్మినవారు మోసం చేస్తే బాధ అనిపిస్తుందని, తిన్నింటి వాసాలు లెక్కపెట్టేవారి వల్ల మనసు గాయ పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి తాత్కాలికంగా మేలు కలగొచ్చుగానీ.. దీర్ఘకాలంలో న్యాయమే గెలుస్తుందనీ అన్నారు. ఎప్పుడూ పేదల పక్షమేనని, పొరపాటున కూడా ఒకరి దగ్గర చేయి చాచలేదని అన్నారు. దొంగదెబ్బ తీయడం చేత కాదని, ధర్మంగా కొట్లాడటం మాత్రమే తనకు తెలుసని అన్నారు. గెలిచిన వాళ్లు విశ్వాసంగా ఉండాలని చెప్పారు. కొంతమంది నాయకులు గెలువక ముందు ఓ విధంగా.. గెలిచిన తర్వాత మరో విధంగా ఉంటారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లలో తన ప్రమేయం ఉండదని, రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందని అన్నారు. ఈసారి ఎన్నికల్లో చాలా కఠినంగా ఉంటానని చెప్పారు. జమ్మికుంట, హుజూరాబాద్‌లో ప్రతి రోడ్డు, ఇస్తున్న ప్రతి నీటి బొట్టూ తాను ఇచ్చిందేనన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కంటే కౌన్సిలర్‌గా గెలవడం చాలా కష్టమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్థానం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎంపీపీ మమత, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యాం, మార్కెట్ చైర్మెన్ పొనగంటి శారద తదితరులు ఉన్నారు.



ఒక మంచి పని చేసి ఊరుకో. ఆ పని బాగోగుల గురించి చర్చించుకోవలసింది ఇతరులు. - పైథాగరస్




సంపాదకీయం

# అక్షరాస్యత

విద్యలేనివాడు వింత పశువు అనేది పాత నానుడి. ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. అక్షరాస్యత ప్రాధాన్యత పెరిగి నిర్వచనమే మారిపోయింది. మన సీఎం కేసీఆర్ నూతన సంవత్సర సందేశంలో అక్షరాస్యతపై చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. 2020లో వందశాతం అక్షరాస్యత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజలంతా ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యావంతుడూ మరోక నిరక్ష్యరాస్యునికి బోధించాలని చెప్పారు. 'ఈచ్ వన్-టీచ్ వన్' అనే నినాదమిచ్చారు. ఇది మంచిదే. కానీ, తెలంగాణ వచ్చాక దాదాపు ఐదున్నరేండ్లుగా టీఆర్ఎస్ సర్కారు అక్షరాస్యత, చదువు గురించి ఏనాడూ పట్టించుకోలేదు. తనపార్టీ మ్యానిఫెస్టోలో చేర్చిన కేజీ టూ పీజీ విద్యాపథకానికి అడ్రస్సేలేకుండా చేశారు. చివరకు తమ బడ్జెట్‌లోనూ ఏటేటా నిధులను తగ్గిస్తూ వస్తున్నారు. అక్షరాస్యతలో తెలంగాణ అట్టడుగుస్థానంలో ఉందని నిటిఅయోగ్ చెప్పేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా అక్షరాస్యత పెంచడానికి పత్రికా ప్రకటనలు, సందేశాలు ఇస్తే సరిపోదు. చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. ప్రభుత్వపరంగా పక్కా కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. గత కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాల విధానాలు అక్షరాస్యత పెంపును అలక్ష్యం చేశాయి. నయా ఉదారవాద రాజకీయ, ఆర్థిక విధానాలను దిగుమతి చేసుకున్నాక అటు దేశంలో, ఇటు రాష్ట్రంలోనూ అక్షరాస్యత పెంపు ఆగిపోయింది.

**రాత్రిబడులు, వయోజన విద్య, అక్షరదీపిక, దీపం పథకాలెన్ని వచ్చినా పాలకుల చిత్తశుద్ధి కొరవడటంతో అక్షరాస్యత గగన కుసుమమే అయింది. ఈనేపథ్యంలో 0-14 ఏండ్ల వయస్సున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రశ్నార్థకమే అవుతున్నది.**

ఐక్యరాజ్యసమితికి చెందిన విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ "యునెస్కో" ప్రకారం అక్షరాస్యత నిర్వచనమే రూపాంతరం చెందింది. చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవడమే గతంలో అక్షరాస్యతకు గీటురాయిగా ఉండేవి. కానీ, యునెస్కో 'అనేక సందర్భాల మధ్య సమాచారాన్నీ గుర్తించి, చదివి, రాసి, అర్థంచేసుకుని అవసరాలకనుగుణంగా అన్వయించుకుని వ్యవహరించడమే అక్షరాస్యతకు అసలు అర్థమని స్పష్టం చేసింది. దీనిని బట్టి మనం ఊహించవచ్చు దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ఇప్పుడు ఎంత మంది నిరక్షరాస్యులున్నారో. దేశంలో 74 శాతముంటే, రాష్ట్రంలో 66.46 శాతం మాత్రమే నమోదైంది. ఇందులో పురుషులు 74.95 శాతం కాగా, మహిళలు 57.92 శాతమే. ఎందుకీ దయనీయ పరిస్థితి ? ప్రభుత్వాలు అనుసరించే అసంబద్ధమైన, ప్రజావ్యతిరేక విధానాలే కారణం. కేంద్ర, రాష్ట్రాలు విద్యను అనుత్పాదకరంగంగా భావించడమే. దీంతో దానికి కేటాయింపులను తక్కువగా చేయడం, నియంత్రించడంతో నిరక్షరాస్యత ఏటేటా పెరుగుతున్నది. కేసీఆర్ సర్కారు రాష్ట్ర జీడీపీలో గత ఏడాది 1.2 శాతం నిధులే విద్యకు కేటాయించింది. తద్వారా దాదాపు రూ. 3 వేల కోట్లు తగ్గించింది. 2018-19 సంవత్సరం బడ్జెట్‌లో విద్యకు రూ.13,278 కోట్లు కేటాయించి, 2019-20కి వచ్చేసరికి రూ. 12,220 కోట్లుగా కుదించింది. ప్రాథమిక విద్యను పరిశీలిస్తే రూ.10,840 కోట్లకుగాను రూ.9,908 కోట్లే ఇచ్చారు. ఈ ఆరేండ్లల్లో ఏనాడూ అక్షరాస్యత గురించి ఆలోచించనే లేదు.




కాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సైతం టీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోయింది. బేటి పడావో..బేటి బచావో పథకం ద్వారా బాలికా విద్యకు ప్రాధాన్యతనిస్తున్నామని నీతులు చెప్పిన మోడీ సర్కారు, బడుల మూసివేతకు ఒడిగట్టింది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబితాఇంద్రారెడ్డి సెప్టెంబరులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మోడల్ స్కూళ్ల నిర్వహణా బాధ్యతల నుంచి బీజేపీ సర్కారు తప్పుకుందని చెప్పడమే నిదర్శనం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 10.88 శాతం నిధులు విద్యకు కేటాయించిన టీఆర్ఎస్ సర్కార్, 2019-20కి వచ్చేసరికి 6.71 శాతానికే పరిమితం చేసింది. నిజానికి విద్యారంగ అభివృద్ధికి దేశ జీడీపీలో 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, ఆయా రాష్ట్రాల బడ్జెట్లల్లో కనీసం 30శాతం నిధులు ఇవ్వాలని కోఠారి కమిషన్ చేసిన సిఫారసులను కేసీఆర్ సర్కారు తుంగలో తొక్కింది. ఇది రాష్ట్రంలో అక్షరాస్యతతోపాటు విద్యాప్రమాణాలు అమాంతం తగ్గిపోవడానికి కారణమైంది. ధనిక రాష్ట్రమంటూ తొలుత డాంబికాలు పలికిన ప్రభుత్వం, ప్రాధాన్యత రంగాల అభివృద్ధికి చిత్తశుద్ధితో నిధులు కేటాయించాల్సిన అవసరాన్ని దిగజారిన అక్షరాస్యతే వేలెత్తిచూపుతున్నది..

అక్షరాస్యత సాధనలో వామపక్ష ప్రభుత్వాల ఏలికలో కేరళ, త్రిపుర దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం విశేషం. బీహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి ఇప్పటికీ దూరంగానే ఉన్నాయి. ప్రపంచ నిరక్షరాసుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్వాతంత్ర్యం వచ్చి 72 ఏండ్లవుతున్నా, సంపూర్ణ అక్ష్యరాస్యత కళగానే మిగిలింది. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నేటికి బస్సు చిరునామాలు, గ్రామాల పేర్లు, తమ పేర్లు రాయడం, చదవడం, పలకడం రాదంటే ఎంతటి దారుణ పరిస్థితులున్నాయో అర్థమవుతున్నది. రాత్రిబడులు, వయోజన విద్య, అక్షరదీపిక, దీపం పథకాలెన్ని వచ్చినా పాలకుల చిత్తశుద్ధి కొరవడటంతో అక్షరాస్యత గగన కుసుమమే అయింది. ఈనేపథ్యంలో 0-14 ఏండ్ల వయస్సున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రశ్నార్థకమే అవుతున్నది.

# కార్మికుల పక్షమా? పాలకుల పక్షమా?



**ఆర్. సుధాభాస్కర్**

'ఊరందరిదీ ఒక దారైతే ఉలిపికట్టెదొకదారి' అన్న సామెత తెలియని తెలుగు వారుండరు. అదే ప్రమాదం ముంచుకొస్తున్న వేళ ఉలిపికట్టె మరో దార్లో నడిస్తే కార్మికుల ఐక్యతకు నష్టం. బీఎంఎస్ నాయకత్వం పక్కా రాజకీయ కారణాలతో 2015 సెప్టెంబర్ 2 సమ్మెకు మూడు, నాలుగు రోజుల ముందు భారతదేశ ఐక్య కార్మికోద్యమానికి తూట్లు పొడిచిన విషయం మనకు తెలుసు. ఆ రాజకీయ కారణంతోనే 2016 సెప్టెంబర్ 2 సమ్మెలోనూ, 2019 జనవరి 8,9 సమ్మెలోనూ పాల్గోలేదు. జనవరి 8న జరిగే సమ్మెలో కూడా పాల్గొనడంలేదు. పైగా జనవరి 3న అన్ని

**"మోడీ ప్రభుత్వాన్ని మేల్కొల్పడం కోసం" బీఎంఎస్ ఉద్యమం (జనవరి 3న) చేస్తున్నామని చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. అసలు ఈ ప్రభుత్వం నిద్రపోతే కదా బీఎంఎస్ మేల్కొల్పడానికి! బీజేపీ కండ్లు తెరుచుకుని పెట్టుబడిదార్ల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. నిద్రబోతుందనుకోవడమే ఒక మోసం దాన్ని లేపడానికి పోరాడుతున్నామని చెప్పడం దారుణమైన మోసం! ఈ విషయాన్ని సాధారణ బీఎంఎస్ సభ్యులు సానుభూతి పరులు అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాం.**

జిల్లాల్లో ప్రదర్శనలు చేస్తున్నట్టు బీఎంఎస్ ప్రకటన రెండు రోజుల క్రితం ఎకనామిక్స్ టైమ్స్‌లో వచ్చింది. అటు నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని, ఇటు బీఎంఎస్‌నూ ఆరెస్సెస్సే కంట్రోల్ చేస్తుండటం వల్ల వారి రాజకీయ అగత్యాన్ని మనం అర్థం చేసుకోగలం. కానీ జనవరి 3న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలకు బీఎంఎస్ ఇచ్చిన పిలుపు ప్రమాదకరమైంది. మోసకారితనంతో కూడుకున్నది. ఈ విషయాలు తర్వాత చూద్దాం. ముందు దీని నేపథ్యాన్ని చూద్దాం.

**నేపథ్యం**

1991లో పివి నర్సింహారావు - మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో అధికారయుతంగా సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన సంగతి మనకు తెలుసు. దాని పునాది 1985 రాజీవ్‌గాంధీ పాలనలోనే పడ్డ విషయం గమనార్హం. ప్రభుత్వరంగానికి సంబంధించినంత వరకు డాక్టర్ అర్జున్‌సేన్ గుప్తా నివేదిక దానికి పునాది. ప్రభుత్వరంగం 'తెల్ల ఏనుగ'ని "దాన్లో డబ్బు కుమ్మరించడమే తప్ప దేశానికి ఏ ఉపయోగం లేద"నే డైలాగులు రాజీవ్ ప్రభుత్వకాలంలో చిన్నగా, సన్నగా ప్రారంభమైనాయి.

దేశం దివాళా అంచుకు చేరింది కాబట్టి ఐఎంఎఫ్ నుంచి అప్పు తెచ్చుకోవడంతో ఈ దశ ప్రారంభమైంది. ప్రభుత్వరంగ ప్రయివేటీకరణ, కార్మికహక్కుల హననం, దేశ సార్వభౌమత్వం తాకట్టు ఒక దాని వెంట ఒకటి దొర్లుకుంటూ మనకు సంప్రాప్తిస్తాయని అర్థమైన సీఐటీయూ అన్ని కార్మిక సంఘాలతో చర్చను ప్రారంభించింది. అప్పటికి కల్సివచ్చిన వామపక్ష కార్మిక సంఘాలు, బ్యాంకు, ఇన్సూరెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘాలు వంటివి ఒక్కతాటిమీదకొచ్చి 1991 నవంబర్ 29న దేశవ్యాపిత మొట్టమొదటి సమ్మెకు శ్రీకారం చుట్టాయి. మొదటి పదేండ్లూ ఈ విధానాల ప్రభావం పెద్దగా బయటపడలేదు. కానీ సీఐటీయూ వంటి వామపక్ష కార్మిక సంఘాల క్యాంపెయిన్ కార్మికుల్ని అప్రమత్తుల్ని చేయడానికి ఉపయోగపడింది.


ఆనాడు ఈ విధానం ఇక్కడికి దారితీస్తుందని భావించలేదో ఏమోగానీ బీఎంఎస్ ఐక్య ఉద్యమంలో పాల్గొనలేదు. 2016 నుంచి చేస్తున్నట్టు విడిగా ఉద్యమమూ చేయలేదు. ఎందుకో బీఎంఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. నూతన శతాబ్దిలో అసలు రూపం కనపడటం ప్రారంభమైంది. 2009-10 నుంచి ముదిరిపాకాన పడింది. అప్పటి వరకు ఐక్యకార్మికోద్యమంలో లేని రెండు ప్రధాన కార్మిక సంఘాలు - ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్‌లు దేశవ్యాపిత ఉద్యమంలోకి వచ్చాయి. దాంతో 2010, 2012, 2013లలో జరిగిన దేశవ్యాపిత ఉద్యమంలో సంపూర్ణంగా దేశ కార్మికోద్యమం పాల్గొంది. ప్రభుత్వాలు అవలం బిస్తున్న నిర్దిష్ట సమస్యలపై దేశ కార్మికోద్యమంలో సాధారణ ఐక్యత నెలకొన్న సమయమిది.

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు కారణం ప్రభుత్వ విధానాలేనని, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగానికి, కార్మిక చట్టాల విధ్వంసానికి కూడా ప్రభుత్వాలే కారణమని నమ్మిన చీమూ నెత్తురు ఉన్న కార్మిక సంఘాలన్నీ ఏకమైనాయి. రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు కూడా దీన్లో భాగమైనాయి.

పెట్టుబడిదారులకిచ్చిన వాగ్దానాలు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం సరిగా అమలు చేయలేకపోతోందని, దానికి విధానపరమైన పక్షవాతం (పాలసీ పెరాలిసిస్) వచ్చిందని, '56 అంగుళాల ఛాతి' ఉన్న తానైతే చెంగు చెంగుమని ఎగురుతూ ఆ విధానాలన్నింటిని అమలు చేస్తానని 2013, 2014లో మోడీ చెప్తే చాలామంది కార్మికులకు అర్థం కాలేదు.

మోడీ సింహాసనాధీసుడు కాగానే ప్రభుత్వరంగ సంస్థల వాటాల అమ్మకం జోరందుకుంది. 2018-19లో వాటాల అమ్మకం లక్ష్యం రూ.80,000కోట్లు, వాస్తవంలో రూ.85వేల కోట్లు అందుకున్నారని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2019-2020కి లక్ష్యం రూ.1.05లక్షల కోట్లు. ఎంత చేరుకున్నారో తదుపరి బడ్జెట్ అంకెలొస్తే తెలుస్తుంది. నరేంద్రమోడీ సర్కార్ ప్రత్యేకతేమంటే 51శాతం కంటే షేర్లు అమ్మే ప్రక్రియ. అంటే వ్యూహాత్మక అమ్మకాలు పెరిగాయి. మన్మోహన్‌సింగ్ ఐడీపీఎల్ వంటి నష్టాల్లో ఉన్న వాటిని ప్రభుత్వం ఎందుకు మోయాలంటే తలాడించిన కొందరు బుద్ధిజీవులు నేడు వేలకోట్ల రూపాయల లాభాలార్జించే బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లను మోడీ తెగనమ్ముతుంటే ఏమంటారు?

కాంగ్రెస్ హయాంలో కంటే నేటి బీజేపీ పాలనలో ప్రభుత్వరంగం భద్రంగా ఉందని బీఎంఎస్ వారు భావిస్తున్నారా? మరి 2012, 2013సమ్మెల్లో పాల్గొన్న బీఎంఎస్ ఇప్పుడెందుకు ఐక్య ఉద్యమం నుంచి తప్పుకుందో ప్రభుత్వరంగంలోని ప్రతి బీఎంఎస్ కార్యకర్త ఆలోచించాలి. ప్రభుత్వరంగ పరిశ్రమలు వాటంతట అవే ప్రయివేటువాడి చేతుల్లోకి పోవు. ప్రభుత్వరంగం రావాలన్నా, చావాలన్నా ఆ క్రియకు 'కర్త' ఉండాలి కదా! ఆ కర్తే ప్రభుత్వం! అంటే ఆనాటి ప్రజల ఆకాంక్ష, పెట్టుబడిదార్ల అవసరాల నిమిత్తం 1954-55లో ప్రభుత్వరంగం వచ్చింది. నేటి ఉదారవాద విధానాల పర్యవసానంగా అది చచ్చిపోతోంది. ఇంకా కరెక్ట్‌గా చెప్పాలంటే 'చంపి'వేయబడుతోంది. నేటి ఫైనాన్స్ పెట్టుబడికి ప్రభుత్వ పాత్ర అంటే ప్రభుత్వరంగం గిట్టదు. ఇది ప్రపంచ అనుభవం. గత 30ఏండ్ల భారతదేశ అనుభవం. ఈ విషయాన్ని బీఎంఎస్ నాయకులూ కార్యకర్తలూ అర్థం చేసుకోవాలి.



కార్మిక పోరాటాలతో పాటు పెట్టుబడిదార్ల అవసరాలు తోడై 1945-75 మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ విధాన 'స్వర్ణయుగం' నడిచింది. అదో పాతిక, ముప్పయి యేండ్లకాలం. 1985-2020 మధ్య ఫైనాన్స్ పెట్టుబడి కోరలు సాచి, ఇంతకాలం దేన్నైతే ఘనంగా చెప్పుకున్నారో వాటన్నింటిని మింగుతున్న పాతిక, ముప్పయి యేండ్ల కాలంలో ఉన్నాం. ఈ విషయం బీఎంఎస్ కార్యర్తలకు ఎవరూ చెప్పడం లేదా?

నేడు కార్మిక చట్టాలు నాశనం కావడం వెనుకున్న విషయం పెట్టుబడిదార్ల ప్రయోజనం. దేశంలోని కార్మిక చట్టాలన్నింటినీ నాలుగు కోడ్‌లుగా చేయడాన్ని స్వాగతించిన బీఎంఎస్, ఆ కోడ్‌లలో కార్మికులకు నష్టం చేసేవిగా చాలా అంశాలు ఉన్నాయని మొసలి కన్నీరు కారిస్తే ఉపయోగం ఏమిటి?

కాంట్రాక్టు, క్యాజువల్ ఎంప్లాయిమెంట్ విచ్చలవిడిగా ఎందుకు పెరుగుతోంది? 12గంటల పనిదినం అనేక పరిశ్రమల్లో సర్వసాధారణంగా ఎందుకు మారుతోంది? ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ఎందుకొచ్చింది? వీటన్నిటి వల్ల ఎవరికి లాభం కలుగుతోంది? ఈ విషయాన్ని బీఎంఎస్ నాయకత్వం దాచిపెట్టినా ఫీల్డులోని బీఎంఎస్ కార్యకర్తలూ సభ్యులూ తేలిగ్గానే అర్థం చేసుకోగలరు కదా!

ఇక అసలు ప్రశ్న. విడిగా ఉద్యమం చేయడం. అదే దేశవ్యాపిత సమ్మెకు నాలుగురోజులకు ఇటో అటో పిలుపులివ్వడం తన అనుయాయి లెవరూ జారిపోకుండా చూసుకోడానికేనా?! "కుందేళ్ళతో పాటు పరిగెత్తుతూ కుక్కలతో పాటు వేటాడటం సాధ్యం" కాదని బీఎంఎస్ నాయకులు అర్థం చేసుకోవాలి.

మోడీ స్పీడు చూస్తే తర్వాతి నాలుగేండ్లలో ప్రభుత్వరంగం మిగలదని ఏ సాధారణ కార్మికుడికైనా అర్థమవుతున్నది. 2020లోపు మొత్తం కార్మికచట్టాలన్నీ నాశనం చేయాలనే ప్రయత్నం కనపడుతోంది. కార్మిక సంఘాలనే నిర్వీర్యం చేసే పరిస్థితి ఉన్నది. కార్మికోద్యమం నిలబడాలనుకునే వారు, ప్రభుత్వరంగ పరిశ్రమలుండాలనుకునే వారు మోడీ ప్రభుత్వంతో తలపడక తప్పదు. అందుకు జనవరి 8 దేశవ్యాపిత సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలి.

"మోడీ ప్రభుత్వాన్ని మేల్కొల్పడం కోసం" బీఎంఎస్ ఉద్యమం (జనవరి 3న) చేస్తున్నామని చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. అసలు ఈ ప్రభుత్వం నిద్రపోతే కదా బీఎంఎస్ మేల్కొల్పడానికి! బీజేపీ కండ్లు తెరుచుకుని పెట్టుబడిదార్ల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. నిద్రబోతుందనుకోవడమే ఒక మోసం దాన్ని లేపడానికి పోరాడుతున్నామని చెప్పడం దారుణమైన మోసం! ఈ విషయాన్ని సాధారణ బీఎంఎస్ సభ్యులు సానుభూతి పరులు అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాం. ■



**నాగటి నారాయణ**

# బీజేపీని ఓడించిన జార్ఖండ్ గిరిజనం

జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో ఓటమితో బీజేపీ అదరగొండితనంకి అడ్డుకట్ట పడుతోంది. హర్యానాలో జననాయక్ జనతా పార్టీ సాయంతో అధికారం దక్కించుకున్నా సొంత బలం కోల్పోయి పరాన్న జీవిగా మారింది. మహారాష్ట్రలో అధికారం కోసం సైద్ధాంతిక భావసారూప్యత గల శివసేన పార్టీనీ సహించలేక భంగపడింది. మొన్న లోక్‌సభ ఎన్నికల్లో తన గెలుపునకు తోడ్పడిన ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) పార్టీని వదిలేసి అసెంబ్లీ ఎన్నికల్లో అభాసుపాలైంది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యపై సుప్రీంకోర్టు తీర్పు, పౌరసత్వ సవరణ చట్టం పరిణామాల ప్రతికూల ప్రభావంతో పాటు జార్ఖండ్‌లో బీజేపీ ఓటమిని సామాజిక కోణం నుంచి కూడా పరిశీలించాలి.


అడవుల రాష్ట్రంగా, గిరిజన రాష్ట్రంగా చెప్పుకునే జార్ఖండ్ జనాభా 3.29 కోట్లమంది. అక్షరాస్యత 67.63శాతం. గిరిజనులు 24శాతం కాగా షెడ్యూల్డ్ కులాల ప్రజలు 12శాతం. 67.8శాతం మంది హిందూ, 14.5శాతం మంది ఇస్లాం, 4.3శాతం మంది క్రిస్టియన్, 12.8శాతం మంది స్థానిక సర్ణయిజం మతస్తులుగా 2011 సెన్సెస్ భోగట్టా. దీని ప్రకారం లోక్‌సభ ఎన్నికల గెలుపు నేపథ్యంలో తామే గెలుస్తామనే బీజేపీ నేతల ధీమా దివాళా తీసింది. ముఖ్యంగా గిరిజనులకు రిజర్వ్ చేయబడిన 28అసెంబ్లీ స్థానాల్లో గతం (2014)లో 18స్థానాలు గెలుచుకోగా ఈసారి రెండు మాత్రమే గెలిచింది. ఆ రాష్ట్రంలో అధికారం కోల్పోవడానికి ఇదో ప్రధాన కారణం. అందులో రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, గిరిజనుల జీవనాధారమైన భూమిని బీజేపీ ప్రభుత్వం అన్యాక్రాంతం చేస్తుందనే ఆందోళన. రెండు, తమని హిందూమతం లెక్కల్లో చూపుతూ తమ స్థానిక మతారాధనల అస్తిత్వాన్ని దెబ్బతిస్తున్నారనే భయం.

ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2016లో "చోట నాగపూర్ టెనెన్సీ యాక్ట్ 1908", "సంథాల్ పరిగణ టెనెన్సీ యాక్ట్ 1949"లను సవరించడానికి 2016లోనే అసెంబ్లీలో బిల్లులు పాస్ చేసింది. అవి అమల్లోకి వస్తే భూమిపై గిరిజనులకు గల హక్కును కోల్పోతారు. అభివృద్ధి పేరుతో గిరిజనుల భూములను గిరిజనేతర పెట్టుబడిదారులు కబళించే అవకాశం కలుగుతుంది. గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఆ బిల్లులను గవర్నర్ ద్రౌపది ముర్మ ఆమోదించకుండా పెండింగులో పెట్టారు. ఆర్టికల్ 370, 65ఏలను కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చెరబట్టి కాశ్మీర్ ప్రజల స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసిన నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే ఆ రెండు బిల్లులు చట్టాలుగా మారి తమ బతుకులను బుగ్గి చేస్తాయనే భయం జార్ఖండ్ గిరిజనుల్లో పెరిగింది.

గిరిజనులు ప్రకృతి ప్రేమికులు. ప్రకృతినే ఆరాధిస్తారు. జార్ఖండ్ గిరిజనులు ప్రకృతిలో భాగమైన సూర్యుని దైవంగా పూజిస్తారు. సర్ణ ధర్మాన్ని పాటిస్తారు. సర్ణ మాతను దేవతగా కొలుస్తారు. కానీ బీజేపీ గిరిజనులను హిందువుల ఖాతాలో ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు క్రిస్టియన్ మత ప్రభావం కూడా గణనీయంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో తమ స్వంత మతారాధన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదల జార్ఖండ్‌తో పాటు యితర రాష్ట్రాల్లోని ఆదివాసీ గిరిజనుల్లోనూ పెరిగింది. 19రాష్ట్రాల్లోని గిరిజన తెగల ప్రతినిధులు గత ఏప్రిల్ నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ధర్నా చేసారు. దేశంలోని 12కోట్లమంది గిరిజనులకు ఒక ప్రత్యేక "రెలిజియస్ కోడ్" ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఆ ధోరణి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అంతర్లీనంగా పనిచేసింది. ఢిల్లీ పాలకుల బానిసగా పనిచేస్తూ గిరిజన ప్రయోజనాలను దెబ్బతీసే ముఖ్యమంత్రి గిరిజనుడైనా అక్కర్లేదనే చైతన్యం పెరిగింది. హిందూ పేర్లను తలపించే 'కుమార్, కుమారి' తోక పేర్లను తొలగించుకోవాలనే చర్చ కూడా జరిగింది.

ఇప్పుడు జరగబోయే 2021 జనాభా లెక్కల కోసం సేకరించే సమాచార పత్రంలో మతం గురించిన కాలంలోని ఆప్షన్‌లో "హిందూ, ముస్లిం, క్రిష్టియన్, బుద్దిస్ట్, జైన్, సిక్కు" అనే ఆరు మతాల జాబితానే ఉన్నదని, గత జనాభా లెక్కల సేకరణల్లోని 7వ అంశం "ఇతరములు" అనేది లేదని, అందువలన మేము హిందూగా చెప్పుకోవాలా అని సోషల్ యాక్టివిస్ట్ లక్ష్మి కుమారి ప్రశ్నించారు. ఇలా గిరిజనుల్లో పెరిగిన అస్తిత్వ భావన, హిందూత్వ వ్యతిరేకత జార్ఖండ్ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి ముఖ్యమైన సామాజిక కారణంగా తెలుస్తోంది.

**సెల్: 9490300577**



**కొండూరి వీరయ్య**

# నవభారతం కోసం ఎగసిన యువతరంగం

శరీరం గడ్డకట్టేంత చలిని కూడా దేశ రాజధానిలో యువతను ఆటంకపర్చలేక పోయింది. ఒంట్లోకి దూసుకొస్తున్న తూటాలు.. కండ్లను నిప్పుగోళాల్లా మారుస్తున్న భాష్పవాయు గోళాలు.. బుల్లెట్‌కంటే గట్టిగా తగులుతున్న ప్లాస్టిక్ తూటాలు.. ఏవీ ముందడుగేస్తున్న యువతను అడ్డుకోలేకపోయాయి. గత నెలరోజులుగా ప్రత్యేకించి దేశమంతా యువతరం, విద్యార్థులు ఊహించని రీతుల్లో సవరించిన పౌరసత్వ చట్టానికి, జాతీయ పౌర జాబితా రూపకల్పన ప్రయత్నాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు మున్నెన్నడూ లేని స్థాయిలో ప్రతిఘటన పోరాట శిశిరం మేలుకొంటోంది.. నవ భారతం కోసం యువతరంగం ఉవ్వెత్తున ఎగసిపడుతోంది.

ఈ ఆందోళనలో యువత గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ ప్రదర్శించని సామాజిక చైతన్యాన్ని ప్రదర్శిస్తోంది. వందలాది విశ్వ విఖ్యాత విద్యా సంస్థల నుంచి విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. ఈ ప్రతిఘటనోద్యమాన్ని ఉద్దేశించి "విద్యార్థులు ఈ విధంగా రోడ్డు మీదకు రావటాన్ని ప్రధాని అంగీకరించరు" అని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి పోఖ్రియాల్ పేలవంగా స్పందించారు. జనం భాష అర్థం చేసుకోలేని మోడీ మన్ కీ బాత్‌లో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సైనిక దళాల ప్రధానాధికారి బిపిన్ రావత్ ప్రతిఘటన నాయకత్వ లక్షణం కాదని నాయకత్వ లక్షణం అంటే దేశాన్ని ముందుకు నడిపించే సామర్థ్యమని అన్యాపదేశంగా మోడీ-అమిత్ షాల నాయకత్వ లక్షణాలను కొనియాడారు. రావత్‌కంటే అర్హులు, సీనియర్ అధికారులు ఉన్నా రావత్‌ను సైనిక దళాల ప్రధానాధికారిగా నియమించేటప్పుడు పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. వీటికి సమాధానంగా ప్రభుత్వం నుంచి వచ్చిన వివరణ "రావత్ ఆలోచన ప్రభుత్వం ఆలోచనతో సరిపోతుంది కాబట్టే ఆయన్ను ఎంపిక చేశాం." అని కేంద్ర మంత్రిగా ఉన్న మరో సైనిక దళాల మాజీ సర్వ సైన్యాధికారి వికె సింగ్ బహిరంగంగా ఆరెస్సెస్ యూనిఫారం ధరించారు. ఈ పరిణామాలన్నీ ఓ వైపున రాజ్యాంగయంత్రంలో పెరుగుతున్న ఆరెస్సెస్ పాత్రా ప్రభావాన్నీ తెలియచేస్తుంటే మరోవైపున పెరుగుతున్న ప్రతిఘటన ఆరెస్సెస్ ప్రాపంచిక దృష్టికి నవభారతం పెంపొందించుకుంటున్న ప్రాపంచిక దృష్టికి మధ్య ఉన్న వైరాన్ని వెలుగులోకి తెస్తోంది.

సవరించిన పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల్లో మొదలైన ప్రతిఘటనోద్యమం విశాల భారతావనికి విస్తరించింది. స్వాతంత్ర్యోద్యమ సేనాని రాంప్రసాద్ బిస్మిల్‌ని స్మరించుకుంటూ డిశంబరు 19న ఈ ప్రతిఘటనలన్నీ ఏకతాటి మీదకు వచ్చాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రతిఘటనోద్యమానికి 2019కి వీడ్కోలు, నవ వసంతానికి స్వాగతం చెప్తూ నేడు జరుగుతున్న ప్రతిఘటనోద్యమానికి మౌలికమైన తేడా ఉంది. గతంలో జరిగిన ఉద్యమాలు ఏదో ఒక ప్రాంతానికి, ఒక సమస్యకు, ఒక సామాజిక ఆర్థిక తరగతికి పరిమితమై జరిగిన ఉద్యమాలు. 2010 దశాబ్దంలో ఢిల్లీని అల్లకల్లోలం చేసిన అవినీతి వ్యతిరేక ఉద్యమం కూడా కొన్ని ప్రయోజనాలు ఆశించి రాజకీయ సామాజిక శక్తులు నిర్మించిన ఉద్యమమే. దీనికి భిన్నమైనది నేడు జరుగుతున్న ఉద్యమం. ఈ ఉద్యమం పరిధి ఓ ప్రాంతానికో, వర్గానికో, సామాజిక తరగతికో, నిర్దిష్ట లక్షణాలున్న జన సమూహానికో పరిమితైనది కాదు. విశాల భారతావనికి విస్తరించింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో ప్రకటిత రాజకీయ లక్ష్యాలతో సాగుతున్న ఉద్యమం కాదిది. రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమం. రాజ్యాంగ పరిరక్షణ అన్న ఏకైక లక్ష్యం చుట్టూనే ఈ ఉద్యమం



నిర్మితమవుతూ వస్తోంది కనుకనే నాయకత్వ సమస్య కూడా లేకుండా ఎక్కడికక్కడ ఈ ప్రతిఘటనోద్యమం వికేంద్రీకృత రూపం తీసుకొంటోంది. ఈ ఉద్యమం నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఒకటి ఉంది. ఏకీకృత లక్ష్యంతో వికేంద్రీకృత నిర్మాణంతో సాగే ఉద్యమం మరింత ప్రజాతంత్ర స్వభావాన్ని సంతరించుకుంటుందన్నది ఈ పాఠం. భవిష్యత్ ఉద్యమ నిర్మాణాలకు విలువైన పాఠం ఇది.

ఎన్నార్సీ వ్యతిరేక ఉద్యమానికి ఉన్న ఈ స్వభావాన్ని, దాని గాఢతను గ్రహించింది కాబట్టే పాలకవర్గం తొందరగా మేలుకొంది. ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపచేయటంలో ఇంటర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ముందుగా ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో జరిగే నిరసలను, ఉద్యమాలు, ఆందోళనల గురించిన వార్తలు మిగిలిన దేశానికి చేరకుండా ఆయా రాష్ట్రాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. దేశ రాజధాని నగరంలో నిరసనకారులు జంతర్‌మంతర్‌కు చేరుకోకుండా మెట్రో సేవలు నిలిపివేసింది. దేశంలో కాంగ్రెస్ అన్నింటికన్నా నిరంకుశ రాజకీయ విధానాలు అనుసరించిన పార్టీగా రికార్డు సృష్టించింది. అయినా కాంగ్రెస్ హయాంలో ఏనాడూ ప్రజలు పరస్పరం మాట్లాడుకోకుండా ఇంటర్నెట్ సేవలు బంద్ చేసిన సందర్భం లేదు. ఆందోళనకారులు స్వచ్ఛందంగా హాజరుకాకూడదన్న లక్ష్యంతో ప్రజా రవాణా వ్యవస్థను పదే పదే నిలిపిసిన సందర్భాలూ లేవు. ఈ పోలిక తెస్తోంది కాంగ్రెస్‌కున్న ప్రజాస్వామిక స్వభావం గురించి చర్చించటం కోసం కాదు. పాలక పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు నిన్న మొన్నటి దాకా అండదండలందించిన కార్పొరేట్ వర్గాన్ని బీజేపీ లాగేసుకున్నట్టే నిఖార్సయిన పాలకవర్గ లక్షణాలు కూడా బీజేపీ సంతరించుకోవటానికి ఎక్కువ కాలం పట్టలేదు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ నేతృత్వంలోని పాలకవర్గం నిరంకుశపోకడల్లో ఆరితేరటానికి కనీసం మూడు దశాబ్దాలు పట్టింది. ఎమర్జెన్సీ వరకు అటువంటి నిర్బంధాన్ని కాంగ్రెస్ ప్రయోగించలేదు. కానీ నిఖార్సయిన పాలకవర్గ దమననీతిని నేర్చుకోవటానికి, ఆచరణలో పెట్టటానికి బీజేపీకి దాని వెన్నంటి ఉన్న పాలకవర్గ కూటమికి పదేండ్లు కూడా పట్టలేదు. ఈ తేడాను మనం గమనించాలి.

తాజాగా జరుగుతున్న ఉద్యమంలో ఇప్పటికే కనీసం 30మంది వరకు చనిపోయారన్న వార్తలు వస్తున్నాయి. ప్రధానంగా ఈ అధికారిక హత్యలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయి. దాదాపు ఏడాదిగా హాంగ్‌కాంగ్‌లో జరుగుతున్న ఆందోళనల్లో సైతం ఇంతమంది చనిపోలేదు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేయలేదు. అయినా చైనాను కమ్యూనిస్టు నియంతృత్వం అనీ, భారతదేశాన్ని ప్రజాస్వామ్యం అనీ చదువుకోవటం వింతనిపించక మానదు. విశ్వవిద్యాలయాలు డిటెన్షన్ క్యాంపులుగా మారుతున్నాయి. గాంధీ, అంబేద్కర్‌ల చిత్రపటాలతో శాంతియుగతంగా సాగే నిరసన ప్రదర్శనలకు కూడా ప్రభుత్వం అనుమతివ్వటం లేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి బరితెగించి ఓ సామాజిక తరగతికి చెందిన ప్రజలు లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాలని బహిరంగంగా పిలుపునివ్వటం బీజేపీ పాలనలో ప్రజాస్వామిక సాంప్రదాయానికి గోరీ కట్టడానికి బీజేపీ ఏ మాత్రం వెనకాడటం లేదన్నది సుస్పష్టం.

నవభారతం కోసం పోరాడుతున్న యువతరానికి రాజ్యాంగమే దిక్సూచిగా మారింది. రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన మార్గం నుంచి భారతదేశం వైదొలగటాన్ని ఈ యువతరం ప్రశ్నిస్తోంది. నవభారతం నిర్మిస్తామని ఎన్నికల్లో రెండోసారి నెగ్గిన మోడీ ఆధునిక భారతదేశాన్ని అంధకారయుగాల మతోన్మాద భారతంగా మార్చటానికి వ్యతిరేకంగా యువతరంగం సాగిస్తున్న ఈ పోరాటం నవశకానికి ఆరంభం కావాలి. ఈ పోరాటంలో పాల్గొన్న యువతరం అనుసరిస్తున్న పోరాట రూపాలు కూడా స్వతంత్ర భారతంలో ఎన్నడూ చూడని పోరాట రూపాలు. పోరాటం అంటే కేవలం ధర్నాలకో, ప్రదర్శనలకో, ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసనలకో పరిమితం కాలేదు. సాంప్రదాయక పోరాట రూపాలకు ఓ నిర్దిష్ట లక్ష్యం ఉంటుంది. ఈ నిర్దిష్ట లక్ష్యానికి ప్రాతినిధ్యం వహించే చిహ్నం ముందు నిరసనలు జరుగతాయి. ఈ చిహ్నం ప్రభుత్వ కార్యాలయం కావచ్చు. ప్రయివేటు కంపెనీ యాజమాన్యం కావచ్చు. కానీ నేడు కండ్లముందు ఆవిష్కృతమవుతున్న ప్రజాతంత్ర పోరాటానికి పతనమవుతున్న సామాజిక విలువలే శతృవులు. ఆ సామాజిక విలువలకు ప్రాతినిధ్యం వహించే శక్తులే శతృవులు.. అందుకే గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఉద్యమం ప్రత్యామ్నాయ ఉద్యమ భాషను, నుడికారాన్ని, ఉద్యమ రూపాలను ముందుకు తెస్తోంది. ఎక్కడికక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు, చరిత్రలో మరుగునపడ్డారనుకుంటున్న విప్లవ ప్రజాతంత్ర సాహిత్యకారులు, వారి రచనలు యువతరం నోటినుంచి జాలువారుతున్నాయి.

సమాజంలో ఉన్న వైవిధ్యాన్ని తాజా ఉద్యమం ప్రతిబింబిస్తోంది. ఈ వైవిధ్యానికి హిందూరాష్ట్ర దృక్పథానికి ఉన్న వైరుధ్యమే ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న ఇంధనం. జీవితాలు రాజకీయాలకు, సామాజిక మార్పుకు అంకితం చేశామని చెప్పే వాళ్లకంటే గత మూడు దశాబ్దాల్లో రాజకీయాలనీడ కూడా తాకకుండా ఆధునిక విద్యనందుకున్న ఈ తరానికి హిందూత్వ, హిందూరాష్ట్ర, ఆరెస్సెస్ ప్రమాదం మరింత స్పష్టంగా అర్థమయ్యిందన్న వాస్తవాన్ని నవభారతం కోసం ఎగసిపడుతున్న యువతరంగం రుజువు చేస్తోంది. ఈ ప్రజాతంత్ర చైతాన్యన్ని పెంచి పోషించి పరిరక్షించటానికి జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గం.

**సెల్: 9871794037**

## మున్సిపల్ షెడ్యూల్‌పై హైకోర్టులో ఉత్తమ్ పిల్..


**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లను నిర్ధారణ చేయకుండానే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ షెడ్యూల్‌ను విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ టీపీసీసీ అధ్య క్షులు, నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వాజ్యం (పిల్) దాఖలు చేశారు. 120 మున్సిపాల్టీల్లో 2,727 వార్డులు, 10 కార్పొ రేషన్లలో 385 వార్డులుండగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయకుండానే షెడ్యూల్ విడుదల చేశారని పిల్‌లో పేర్కొన్నారు. జనవరి 22న పోలింగ్ నిర్వహిస్తామం టూ ప్రకటించారనీ వివరించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత ఒక్క రోజు లోనే ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లను కోరడం అన్యాయమని తెలిపారు. ప్రకటన తర్వాత ఆయా కేటగిరీల అభ్యర్థులు కుల సర్టిఫికెట్ తీసుకునే గడువు కూడా తగినంత ఉండేలా చూడాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ డిసెం బర్ 23న ఇచ్చిన షెడ్యూల్ చెల్లదనీ, దానిని తిరిగి ప్రకటించేలా ఆదేశించాలి. అంతకంటే ముందుగా మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల చైర్మెన్లు, వార్డు మెంబర్ల పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. చట్ట ప్రకారం అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సమయమివ్వాలి. ఎన్నికల షెడ్యూల్ హడా వుడిగా విడుదల చేయడం రాజ్యాంగ వ్యతిరేకం. ఇది తేలే వరకూ ఎలక్షన్ షెడ్యూ ల్ అమలును నిలిపేయాలని ఉత్తమ్ తన పిల్‌లో హైకోర్టును కోరారు. ఇందులో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి/సంచాలకులు, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌లను ప్రతివాదులుగా చేర్చారు.

**ప్రయివేటు నుంచి ఏ మేరకు సాయం తీసుకున్నారు..?**

స్వైన్‌ఫ్లూ, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్ర సర్కార్ ప్రయివేటు ఆస్పత్రుల నుంచి ఏ మేరకు సాయం పొందిందో చెప్పాలని హైకోర్టు కోరింది. ఇందులో ఆయా ఆస్పత్రులను ఏ మేరకు భాగస్వామ్యం చేశామనే విషయాన్ని కౌంటర్ ద్వారా తమకు తెలిపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. రాష్ట్రంలో ల్యాబులు ఉంటే రోగాన్ని గుర్తించి సత్వరమే వైద్యం అందించేందుకు వీలుంటుందంటూ సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి కోర్టుకు సూచన చేశారు. దీంతో న్యాయస్థానం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

# తాగేశారు



**(మొదటిపేజీ తరువాయి)**

వంద కోట్లు మాత్రమే ఖజానాకు చేరితే...ఆ మరుసటి ఏడాది (2018లో) రూ.230 కోట్లు అధికంగా వసూలైంది. తాజాగా 436 కోట్లు డిసెంబరు 31తోపాటు నూతన సంవత్సరం మొదటి రోజునే విక్రయించారు. ఈ లెక్కన గతేడాది కంటే సుమారు వంద కోట్లు అదనంగా ఖజానాకు ఆదాయం వచ్చి చేరింది. మద్యం అమ్మకాలే కాకుండా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లోనూ ప్రభుత్వానికి కలిసొచ్చింది. మూడు వేల మందిపై సంబంధిత కేసులు పెట్టింది. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో 3,148 మంది వాహనదారులకు పోలీసులు చలానాలు పంపించారు.

### 3049 మంది మందుబాబులపై కేసులు

**(మొదటిపేజీ తరువాయి)**

873 కేసులతో సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉండగా.. 280 కేసులతో రాచకొండ పోలీసు కమిషనరేట్ నిలిచింది. ఇక మిగతా జిల్లాల్లో 100 నుంచి 150 కేసుల వరకు మద్యం కేసులను నమోదు చేశారు. వరంగల్, సిద్దిపేట్ కమిషనరేట్ పరిధులలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

**అర్థరాత్రి ఒంటిగంట వరకూ..**

కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో డిసెంబరు 31 అర్థరాత్రి ఒంటిగంట వరకు అమ్మకాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది మద్యం ప్రియులకు మరింతగా ఉపయోగపడింది. రెండు వారాల క్రితం ప్రభుత్వం 10 శాతం మేర మద్యం ధరలు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో సుమారు రూ. 300 కోట్ల నుంచి రూ. 400 కోట్ల ఆదాయం వస్తుందని ఎక్సైజ్ శాఖ అంచనా. తాజాగా పెంచిన ధరల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 20 వేల కోట్ల ఆదాయాన్ని సర్కారు ఆశిస్తున్నది.

**అపరిమిత అమ్మకాలపై ప్రతిపక్షాల గుర్రు**

రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించకుండా అపరిమితంగా విక్రయించడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. అమ్మకాల వేళలను పొడిగించడం ద్వారా ప్రజలను టీఆర్ఎస్ ప్రభుత్వం మద్యానికి బానిసలుగా మారుస్తున్నదని విమర్శిస్తున్నాయి. ఇటీవల రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. మద్యం అమ్మకాలను నియంత్రించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో రిలే నిరహారదీక్ష చేపట్టిన విషయం విదితమే. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడానికి ప్రజలను పీడించడం, మద్యానికి బానిసలుగా చేయడం సరికాదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కె.ఎన్.ఆశాలత, కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. సర్కారు మద్యం విధానం ప్రజల ఆరోగ్యాలను దెబ్బ తీసేదిగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పోతే మద్యం సేవించి మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. మద్యం అమ్మకాలను ప్రోత్సహించడం ద్వారా లైంగికదాడులను సర్కారే ప్రోత్సహిస్తున్నట్టుగా భావించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. అలాగే మాజీ మంత్రి డి.కె. అరుణ సైతం మద్యానికి వ్యతిరేకంగా నిరసనదీక్ష సైతం చేశారు.

## రాజ్‌భవన్, ప్రగతిభవన్‌లో కొత్త యేడాది సందడి...

- గవర్నర్‌కు సీఎం శుభాకాంక్షలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ నివాసమైన రాజ్‌భవన్‌లో బుధవారం సందడి నెలకొంది. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ నివాసమైన ప్రగతి భవన్‌లో సైతం కొత్త యేడాది జోష్ కనిపించింది. మండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్‌తోపాటు మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మెన్ పల్లా రాజేశ్వరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు జోగినేపల్లి సంతోశ్‌కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సీఎం కేసీఆర్.. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కామన్ సింబల్ గడువు జనవరి 4

- రాష్ట్ర ఎన్నికల సంఘం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికల్లో కామన్ సింబల్ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో సింబల్స్ లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు కామన్ సింబల్ కోసం జనవరి నాలుగవ తేదీలోపు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువు. రూ.10 వేల డీడీని కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం పేరుతో సమర్పించాలి. కమిషన్ సూచించిన అందుబాటులో ఉన్న గుర్తుల్లో నుంచి ఏవేనీ 10 చిహ్నాలను ప్రాధాన్యతాక్రమంలో పేర్కొనాలి. మొత్తం స్థానాల్లో కనీసం 10 శాతం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనున్నట్టు ప్రమాణపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకసారి కేటాయించిన గుర్తు ఐదేండ్లపాటు ఉంటుంది. ఒకవేళ వరస ఎన్నికల్లో పోటీ చేయని పక్షంలో ఆ గుర్తును రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘం అధికారులకు ఉంటుంది. ఒకే గుర్తును ఒకటికి మించి పార్టీలు కోరుకుంటే లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. పార్టీ కోరుకున్న గుర్తులు కేటాయించలేని పక్షంలో సదరు పార్టీ ప్రతినిధులతో చర్చించి ఇతర గుర్తులను కేటాయిస్తారు.

## దేశానికే ఆదర్శం

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. అతి తక్కువ సమయంలో విద్యుత్ లోటును అధిగమించి, మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఆవిర్భవించిందని చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా విద్యుత్‌సౌధ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు, తర్వాత బేరీజు వేసుకుంటే విద్యుత్‌రంగంలో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. అందరి సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌జెన్‌కో డైరెక్టర్ (హెచ్‌ఆర్) అశోక్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ (హెచ్‌ఆర్) ఫసియుద్దీన్ ఫిరోజ్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

### డైరీ ఆవిష్కరణలో మంత్రి వేముల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రోడ్లు, భవనాలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు బుధవారం మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ల అసోసియేషన్ డైరీని, 2020 ఏడాది క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రోడ్లు,భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్, రోడ్లు,భవనాల శాఖ ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఆర్‌అండ్‌బి (రాష్ట్ర రహదారులు)ఈఎన్‌సీ రవీందర్‌రావు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) డైరెక్టర్ జనరల్ భిక్షపతి, టీజీవో నేతలు క్రిష్ణ యాదవ్, సత్యనారాయణ తదితరులున్నారు.

## టీఆర్‌ఎస్‌ను ఎండగడతాం: ఉత్తమ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల విషయంలో టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళతామని టీపీసీసీ అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గాంధీభవన్ లో బుధవారం మాజీమంత్రి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌కు చెందిన పలువురు టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతు రుణమాఫీ, రైతుబంధు తదితర హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని విమర్శించారు. గతంలో టీఆర్ఎస్‌లో ఉండి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారు కాంగ్రెస్ లోకి తిరిగి రావాలని ఆహ్వానించారు. బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుంటే టీఆర్ఎస్ కుటుంబపార్టీగా ఉందన్నారు. మున్సిపల్ రిజర్వేషన్లు ముగిశాక నామినేషన్లకు వారం రోజుల గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ మతరాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా త్వరలో జైల్ భరో నిర్వహించనున్నట్టు తెలిపారు.

## గ్యాస్ బాదుడు

**(మొదటిపేజీ తరువాయి)**

పెరిగాయి. ప్రభుత్వం ఒక ఏడాదిలో ఒక్కో కుటుంబానికి 12 సిలిండర్లను సబ్సిడీ మీద అందిస్తున్నది. పరిమితి దాటితే మార్కెట్ ధరల ప్రకారం గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇచ్చే సబ్సిడీ ప్రతీనెల మారుతూ ఉంటుంది. దీనితో పాటు వాణిజ్య పరమైన 19 కేజీల సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1241కి చేరుకున్నది. కోల్‌కతాలో రూ.1,308, ముంబయిలో రూ.1,190, చెన్నైలో రూ.1,363గా ఉన్నది.

**భారాలు తగదు: ఏచూరి**

ధరల పెంపుపై సీపీఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల జీవితాలతో మోడీ సర్కార్ చెలగాటమాడుతున్నదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మోడీ ప్రభుత్వం కొత్త సంవత్సరంలో ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నదని చెప్పిన ఏచూరి... ఇప్పటికే ఉద్యోగాల కల్పనలో విఫలమైందనీ, నిత్యావసర ధరలు పెరిగాయని గుర్తుచేశారు. మోడీ సర్కారు గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపాదన లేకుండా చేసిందని దుయ్యబట్టారు. రైల్వే టికెట్ ధరల పెంపు మోడీ ప్రభుత్వం ఇచ్చిన న్యూఇయర్ గిఫ్ట్ అంటూ ఆయన ట్వీట్ చేశారు.

## చిన్నారిపై లైంగికదాడి

**(మొదటిపేజీ తరువాయి)**

కోణంపేటలో బుధవారం జరిగింది. మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ బోనాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కోణంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ నాలుగేండ్ల కుమార్తెను పక్కలో వేసుకుని డిసెంబర్ 31న రాత్రి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మెలకువ వచ్చి చూస్తే పక్కలో చిన్నారి కనిపించలేదు. కుటుంబీకులంతా రాత్రి మొత్తం వెతికారు. తెల్లవారుజామున సమీపంలో ఉన్న పత్తి చేనులో నుంచి చిన్నారి ఏడుస్తూ బయటకొచ్చింది. లైంగిక దాడికి గురై ఒళ్లంతా గాయాలతో ఉన్న చిన్నారిని చూసి వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని బాలికను ఆస్పత్రికి తరలించారు. చిన్నారి చెప్పిన వివరాల మేరకు కుటుంబీకులు మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో రాస కొమరయ్యపై ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. అతనిది భూపాలపల్లి మండలం నాగారం గ్రామం. నిందితుడి ఆచూకీ కోసం నాలుగు క్లూస్ టీంలను ఏర్పాటు చేసి గాలింపు ముమ్మరం చేశారు.

# ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే...!

**(మొదటిపేజీ తరువాయి)**

సమర్థిస్తున్నామంటూ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు లేఖ రాసిన సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ ఇప్పుడు 'ఓటు బ్యాంకు రాజకీయాల' కోసం వైఖరి మార్చుకున్నారని చేసిన విమర్శలను సీపీఐ(ఎం) ఈ పుస్తకంలో ప్రస్తావించింది. గతంలో కరత్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని వక్రీకరించారని, ఆయన చెప్పిన పది పెద్ద అబద్ధాలలో ఇదొకటని పార్టీ విమర్శించింది. బడుగు వర్గాల హక్కులపై వ్యక్తం చేసిన ఆందోళనను, ఒక వర్గం వారిని వెలివేసే విషపూరిత విధానాలతో వక్రీకరించిన మోడీ సర్కారు దానికి తప్పుడు భాష్యం చెబుతున్నదని సీపీఐ(ఎం) విమర్శించింది. మతం ప్రాతిపదికన పౌరసత్వ అర్హతను నిర్దేశించటాన్ని సీపీఐ(ఎం) మొదటి నుంచి వ్యతిరేకించిందని ఈ పుస్తకం గుర్తు చేసింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శరణార్థులను 'నమశూద్ర దళితు'లుగా గుర్తించి వారిని షెడ్యూల్డు కులాల వారిగా ప్రకటించినప్పటికీ, యూపీ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో వారికి ఆ హోదా కల్పించలేదని గుర్తు చేసింది. సీఏఏకు ఎన్నార్సీకి సంబంధం లేదని ప్రధాని మరో పెద్ద అబద్ధం చెబుతున్నారని సీపీఐ(ఎం) ధ్వజమెత్తుతూ, శరణార్థులను, అక్రమ చొరబాటుదారులను వేరు చేసేందుకే ఈ ప్రక్రియలు చేపడుతున్నామంటున్నారని, వీరి మధ్య తేడా ఏమిటో చెప్పాలని నిలదీసింది. సీఏఏ కింద శరణార్థులుగా పౌరసత్వానికి అర్హత పొందని ముస్లింలను అక్రమ చొరబాటుదారులుగా పేర్కొంటున్నారని చెబుతోందంటూ, హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్ వెలుపల చేసిన ప్రసంగాలను ఉటంకించింది. ఎన్పీఆర్‌కు, ఎన్నార్సీకి ఎటువంటి సంబంధమూ లేదనటం పెద్ద తప్పిదమని సీపీఐ(ఎం) స్పష్టం చేసింది. 2018-19 సంవత్సరానికి సంబంధించిన హోం శాఖ నివేదికను ప్రస్తావించిన సీపీఐ(ఎం) భారతీయ పౌరుల జాతీయ జాబితా (ఎన్ఆర్ఐసి)ని ఏర్పాటు చేసే ప్రక్రియలో తొలి అడుగే ఎన్పీఆర్ అని పేర్కొనటాన్ని ప్రశ్నించింది. ఇందులో హోం మంత్రా? హోం మంత్రిత్వశాఖా? ఎవరు అబద్ధాలు చెబుతున్నారో తేల్చాలని డిమాండ్ చేసింది.

# నా చిన్నప్పటి నుంచి బీజేపీ అలాగే...

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రధాన పోటీ ఉంటుందనీ, అది ఎంతో చరిత్ర ఉన్న పార్టీ అని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్.. విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణకు పదేండ్లు తానే సీఎంగా ఉంటానంటూ కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారని చెప్పారు. అలాంటప్పుడు సీఎం పదవిపై ఊహాగానాలు దేనికని ప్రశ్నించారు. మున్సిపల్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయటమే తన ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పారు. ఎలాంటి నోటీసూ లేకుండా అక్రమ నిర్మాణాలను కూల్చేసే అధికారం ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి వస్తుందని అన్నారు. దీని వల్ల ప్రజలకు కూడా చాలా ప్రయోజనాలున్నాయని కేటీఆర్ వివరించారు.

'పార్టీలకు అతీతంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వారందరికీ శిక్షణా తరగతులుంటాయి.. మున్సిపల్ చట్టంలోని ప్రతీ నిబంధనను పోటీ చేసే అభ్యర్థులు తెలుసుకుంటే మంచిది.. మున్సిపల్ ఎన్నికల్లో సింహభాగం స్థానాలను గెలుస్తాం. ఓవైపు పల్లె ప్రగతి, మరోవైపు పట్టణ ప్రగతి, రెండు సమాంతరంగా అమలైతే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం భావిస్తున్నారు. చాలా విషయాల్లో దేశంలోనే మన రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉంది. అక్షరాస్యత విషయంలో మాత్రం మనం వెనుకబడి ఉన్నాం. ఈ అంశంపై సీఎం దృష్టి సారించారు. రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయి. ఎంపీ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు రాలేదు. కానీ ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమే విజయం సాధించాం. ఆర్టీసీ కార్మికులు కేసీఆర్‌కు జేజేలు పలుకుతున్నారు. అవకాశాలను అనుకూలంగా మలుచుకోవటంలో కేసీఆర్‌కు మించిన వారు లేరు. ఎన్పీఆర్, ఎన్నార్సీ విషయంలో పార్టీ నిర్ణయం కంటే ప్రభుత్వ నిర్ణయమే ముఖ్యం. అందరితో మాట్లాడి సీఎం ఓ నిర్ణయం తీసుకుంటారు. నీటి సమస్యల పరిష్కారం కోసమే పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు నెరుపుతున్నాం. కేవలం జగన్‌తోనే కాదు చంద్రబాబు ఉన్నప్పుడు కూడా సత్సంబంధాలు కొనసాగాయి. మేము యాగం చేసినప్పుడు కూడా ఆయన్ను పిలిచాం. రాజధాని శంకుస్థాపకు ఆయన మమ్మల్ని పిలిచారు. గోదావరి నీటిని ఏపీ, తెలంగాణ కలిసి కృష్ణా బేసిన్‌కు తరలించాలనే ఆలోచన ఉన్నప్పటికీ దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్‌కు ఉత్తమ్ అధ్యక్షుడిగా కొనసాగుతాడా? లేదా? అన్నది ఆయన వ్యక్తిగత నిర్ణయం. అయితే ఆయన ఒక ఐపీఎస్ ఆఫీసర్‌ను దూషించటం సరైంది కాదు. ఎల్లుండి ముంబయిలో జరిగే ఫార్మా మీటింగ్‌కు అటెండ్ కాబోతున్న. మాకు రాజకీయాల్లో శాశ్వత శత్రువులు లేరు, శాశ్వత మిత్రులు లేరు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు రెండూ మాకు సమానమే. ఎంఐఎంతో గతంలో కలిసి పోటీ చేయలేదు. ఇప్పుడూ పోటీ చేయబోం. మిత్రపక్షమైనంత మాత్రాన కలిసి పోటీ చేయాలని లేదు. 2020 టీఆర్ఎస్ నామ సంవత్సరం. ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే...' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కార్పొరేట్లు అంతేగా...

**(మొదటిపేజీ తరువాయి)**

కార్పొరేట్ పన్నులను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. అయినా గతేడాది నవంబర్‌కు సంబంధించి పన్ను వసూళ్లు 2018తో పోల్చితే 25 శాతం తగ్గడం గమనార్హం. నవంబర్‌లో కార్పొరేట్ పన్నులు రూ. 15,846 కోట్లు వసూలయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2018లో ఇవి రూ. 20,864 కోట్లు వసూలయ్యాయి. ఇదే సమయంలో 2018 ఏప్రిల్-నవంబర్‌కు సంబంధించి రూ. 2,91,254 కోట్లు వసూలుకాగా, గతేడాది ఇదే సమయానికి రూ. 2,88,602 కోట్లు (రూ. 2,632 కోట్ల తేడా) మాత్రమే వసూలయ్యాయి.

గతేడాది ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కార్పొరేట్లది కీలక పాత్ర అనీ, మందగమన నేపథ్యంలో వారికి మరింత ఊతమిచ్చేందుకు కార్పొరేట్ ట్యాక్స్‌లను తగ్గిస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే 30 శాతం ఉన్న పన్నులను 22 శాతానికి, అలాగే కొత్త తయారీ సంస్థలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ. 1.45 లక్షల కోట్ల నష్టం వాటిల్లినా కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 16.5 లక్షల కోట్ల కార్పొరేట్ పన్నులను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇవి నవంబర్ నాటికి రూ.7.5 లక్షల కోట్లు (45.5 శాతం) మాత్రమే వసూలు చేసింది. ఇదే సమయంలో 2018-19లో నవంబర్ నాటికి రూ. 9.83 లక్షల కోట్లు (మొత్తం లక్ష్యం రూ. 19.62 లక్షల కోట్లు) వసూలయ్యాయి.

# ధాన్యం బస్తాలకు నిప్పు

**(మొదటిపేజీ తరువాయి)**



రకం ధాన్యం కొనాలని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో సీపీఐ(ఎం), కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు 163వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మహేంద్ర కుమార్ అక్కడకు చేరుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ ముద్రబోయిన రాములుతో చర్చించారు. రాస్తారోకో విరమించాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు విరమించేది లేదని రైతులు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వివాదం జరిగింది. చివరకు మేడారం జాతరకు సందర్శకులు వస్తున్నారని, వారికి ఇబ్బందులు కలిగించొద్దని కోరగా రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1075 రకం ధాన్యాన్ని తీసుకొచ్చి నెల రోజులు అవుతున్నా పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేయలేదన్నారు. ఈ ధాన్యం బియ్యానికి పనికిరాకపోతే, ఈ విత్తనాలను రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు సరఫరా చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సీపీఐ(ఎం) నాయకులు అంబాల కోశాలు, వెంకన్న, చిట్టిబాబు, సామ చంద్రారెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

**టోకెన్లిచ్చి తూకాలకు నిరాకరణ**

పత్తి మిల్లులో టోకెన్లిచ్చి తూకాలకు నిరాకరించడంతో వికారాబాద్ జిల్లాలో రైతులు ఆందోళన చేశారు. పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కొడంగల్- తాండూర్ రోడ్డుపై బైటాయించారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం...

యాలాల మండలం దౌలాపూర్ పంచాయతీ పరిధిలోని శుభం పత్తి మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు 50 మందికిపైగా రైతులకు టోకెన్లిచ్చారు. బుధవారం ఉదయం తూకాలు చేయాల్సి ఉండగా, సెలవు ఉందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. డీసీఎం, ట్రాక్టర్లు, ఆటోలకు రోజురోజుకూ అద్దె పెరగడంతో భారంగా మారిందని రైతులు ఆందోళనకు గురయ్యారు. దాంతో న్యాయం చేయాలని రోడ్డుపై బైటాయించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. పత్తి కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వం సెలవు ప్రకటించడంతోపాటు కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేయడం లేదని నిర్వాహకులు చెప్పారు. గురువారం ఉదయం తప్పనిసరిగా పత్తి కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

# సీఏఏతో దేశ సమగ్రతకే ప్రమాదం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రసంగాలతోనూ, తప్పుడు లెక్కలతోనూ, మత, కుల, ప్రాంతాల విభజనతోనూ, ప్రజాపోరాటాలను అణచివేస్తూ ముందుకెళుతున్నదని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, లౌకిక విలువలను కాపాడుకోవటం కోసం దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రజాపోరాటాలను నిర్మించాలనీ, అందులో ఏఐఏడబ్ల్యూయూ కీలకపాత్ర పోషించాలనీ పిలుపునిచ్చారు.


కేరళ రాష్ట్రంలోని కన్నూర్‌లోని ఈకే నయనార్ అకాడమీలో గల పీకే కుంచన్‌నగర్‌లో జరుగుతున్న ఏఐఏడబ్ల్యూయూ 9వ మహాసభలో బుధవారం నాడు పిళ్లై పారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోడీ అధికారంలోకి రాకమునుపు రైతులు, వ్యవసాయ కార్మికుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పి...నేడు అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్నే దెబ్బతీసే విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధిభద్రత కరువైందనీ, వ్యవసాయం తప్ప మరో ఆదాయ వనరు లేక వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారనీ, వారిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన సామాజికవర్గాల వారే ఉన్నారని వివరించారు. కూలీలకు కేరళలో సగటున రూ.718 రోజువారీ కూలి దక్కుతున్నదనీ, ఇది దేశంలోనే అత్యధికమని తెలిపారు. అదే సమయంలో మరే రాష్ట్రంలోనూ కూలీలకు కనీస దినసరి కూలి దక్కట్లేదనీ, దేశంలోని మెజార్టీ రాష్ట్రాల్లో కూలి రూ.200 కూడా పడట్లేదన్న విషయాన్ని ఉదాహరణలతో వివరించారు. దేశవ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తున్నాయనీ,

ఫలితంగా పంట దిగుబడులపైనా తీవ్రప్రభావం పడుతున్నదన్నారు. అదే సందర్భంలో వచ్చిన పంటకూ పాలకులు కనీస మద్దతు ధర ఇవ్వటం లేదన్నారు. దీంతో అనివార్యంగా రైతులు వ్యవసాయ నుంచి తప్పుకుని వేరే పనులకు వెళ్తున్నారనీ, ఈ దుష్పరిణామాలన్నింటికీ మోడీ అనురిస్తున్న విధానాలే కారణమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు అండగా నిలు స్తూ వస్తున్న ఉపాధి హామీ చట్టాన్నీ క్రమంగా కేంద్రం నిర్వీ ర్యం చేస్తున్న తీరును తెలిపారు. మోడీ ప్రభుత్వం కావాలనే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. గ్లోబల్ వార్మింగ్ జీడీపీపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని తెలిపారు. 2104-15లో జీడీపీ 7.2 ఉంటే ప్రస్తుతం అది 4.5 శాతానికి పడిపోయిందని వివరించారు. భవిష్యత్‌లో అది ఇంకా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ రంగం తర్వాత అత్యంత కీలకమైన పారిశ్రామిక రంగం కూడా కుదేలు అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా ఆటోమొబైల్ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందనీ, ఫలితంగా లక్షలాదిమంది కార్మికులు రోడ్డున పాలయ్యారని తెలిపారు.

**కీలుబొమ్మలుగా గవర్నర్లు...**
**ఐటీ,ఈడీ,సీబీఐ,సీవీసీలతో బెదిరింపులు**

దేశంలో హిందూత్వ ముసుగులో దళితులపైనా, మైనార్టీలపైనా భౌతిక దాడులు జరుగుతున్నాయనీ, మహిళలకు రక్షణ లేకుండాపోతున్నదనీ, పసిబిడ్డలపైనా లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయనీ, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని రామచంద్రన్ పిళ్లై ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగ రేటు రోజురోజుకీ పెరిగిపోతున్నదనీ, గడిచిన 45 ఏండ్లల్లో అత్యంత గరిష్టానికి పెరిగిందనీ, మోడీ విధానాలతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రోజురోజుకీ నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కిపోతున్నాయనీ, ఫలితంగా ప్రజల కొనుగోలు స్థాయి తీవ్రంగా పడిపోయిందని వివరించారు. ఇట్లాంటి సమయంలో ప్రజల పక్షాల నిలవాల్సిన పాలకులు...తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ కార్పొరేట్లకు వత్తాసుపలుకుతూ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్యలపై ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కూలీలు రోడ్డెక్కుతున్నారన్నారు. దీన్నీ పాలకులు సహించక ఎక్కడికక్కడ అణచివేస్తున్నారని తెలిపారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించే వారిని భయపెడుతున్నారనీ, ఎమ్మెల్యేలను, ఎంపీలను, రాజకీయ నేతలను ఐటీ, ఈడీ, సీబీఐ, సీవీసీలను ప్రయోగించి లోబర్చుకుంటున్నారనీ వివరించారు. చివరకు న్యాయవ్యవస్థపైనా నమ్మకం కోల్పోయే పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయని పలు తీర్పులను ఉదహరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు జడ్జీలు కూడా రాజ్యాంగం, న్యాయసూత్రాలకు విరుద్ధంగా మెజార్టీ ప్రజల మనోభావాల ఆధారంగా తీర్పులు ఇవ్వడం దారుణమన్నారు. ఇక గవర్నర్లు కేంద్రం గుప్పిల్లో కీలుబొమ్మలుగా మారారంటూ జమ్మూకాశ్మీర్ విభజన, మహారాష్ట్రలో ఎన్నికల అనంతరం సీఎం ఎన్నిక సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. చివరకు క్యాబినెట్ సబ్‌కమిటీలు కూడా నిరుపయోగంగా మారాయనీ, అంతా మోడీ, అమిత్‌షాలు చెప్పిందే వేదమవుతున్న తీరును పలు ఉదహరణలతో చెప్పారు. మోడీనే కాదు..అమెరికా, బ్రిటన్, టర్కీ, ఇజ్రాయిల్, జపాన్, ఫిలిప్పైన్స్, తదితర దేశాల్లోనూ పెట్టుబడిదారులకే సంక్షేమం కోసమే అన్నట్టు పాలన సాగుతున్నదని అందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పక్కదోవ పట్టించేందుకే మోడీ... సీఏఏ, ఎన్నార్సీలను తెరపైకి తెచ్చారనీ, భావోద్వేగాలతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారనీ, కులం, మతం, ప్రాంతం, చివరకు డ్రెస్‌కోడ్ ఆధారంగా ప్రజలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనిని తిప్పికొట్టేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ప్రజా ఐక్యత కోసం విశాల ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.

**సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన బి.వెంకట్**



ఏఐఏడబ్ల్యూయూ మహాసభలో ఆ సంఘం ఉపా ధ్యక్షులు బి.వెంకట్ సంతాప తీర్మానాన్ని బుధవారం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా అమరులను స్మరించుకుంటూ ప్రతినిధులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఇటీవల కాలంలో మరణించిన క్యూబా పోరాట యోధులు ఫెడల్ కాస్ట్రో, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు నేత, స్వాతంత్ర్య పోరాట యోధులు అహ్మద్ కత్రాడ, వరల్డ్ పీస్ కౌన్సిల్ పూర్వ అధ్యక్షులు రమేష్‌చంద్ర, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు నిరుపమ్ సేన్, నేతలు సుభోద్ మెహతా, విజయ్‌కాంత్ టక్కర్, హషీమ్ అబ్దుల్ హలీమ్, మాజీ ఎమ్మెల్యే బినాయ్ కోనార్, మాజీ ఎంపీ నూరుల్ హుడా, ఐద్వా మాజీ అధ్యక్షులు శ్యామలీ గుప్తా, సీపీఐ(ఎం) రాజస్థాన్ మాజీ కార్యదర్శి హరిరామ్ చౌహాన్, కేఎస్‌కేటీయూ మాజీ కార్యదర్శి కె.కీలప్పన్, ఏఐఏడబ్ల్యూయూ మెంబ్ బాబుల్ భద్ర, ప్రతాప్‌చంద్ర, రమాకాంత్‌పాల్, వాసుదేవ్ జమ్షేర్, జడ్.సిద్ధిఖి, సామాజికవేత్తలు గిరీశ్ కర్నాడ్, ప్రొఫెసర్ జావేద్ ఆలమ్, తెలంగాణ, ఏపీలకు చెందిన ఎన్.రాఘవరెడ్డి, సింహాద్రి శివారెడ్డి, రామలింగారెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బానురాజు(వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీస్ బేరర్), టి.చెంచయ్య, టి.సుబ్బమ్మ, పుల్లయ్య, అల్లూరి సత్యనారాయణ రాజు, పద్మ, టి.నర్సింహ్మయ్య, ఇటీవల మృతిచెందిన చెందిన వ్యవసాయ కార్మిక సంఘాల నేతలకు, సీపీఐ(ఎం)నేతలకు, సామాజికవేత్తలకు, ప్రొఫెసర్లు, మేధావులను మహాసభ స్మరించుకున్నది.

**ఆకట్టుకున్న 'చారడు గుత్తికోల్‌కాలి'**

మహాసభల ప్రాంగణంలో కేరళ సాంస్కృతిక కళారూపమైన 'చారడు గుత్తికోల్ కాలి' ప్రదర్శించారు. 9 మంది మహిళలు, 9 మంది పురుషులతో కూడిన కళా బృందం కోలాట చిర్రలతో ఏడెనిమిది రకాల ప్రదర్శనలు ఇచ్చారు. ఓ స్తంభానికి కట్టిన తాళ్లను చేతికి చుట్టుకుని లయబద్ధంగా అడుగులు వేస్తూ ఒక వలను అల్లి...మళ్లీ రివర్స్‌లో వలను కోలాటం ఆడుతూ విప్పేసి యథాస్థానానికి వచ్చేశారు. బృంద నాయకుడు శివకుమార్ లయబద్ధంగా పాటపాడుతుండగా కళాకారులు ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ కళారూపాన్ని ప్రతినిధులు మొదటి నుంచి చివర వరకు కళ్లార్పకుండా చూశారు. వారి ప్రదర్శనలను చూసి మంత్రముగ్ధులయ్యారు.

**మహాసభల కమిటీలివే...**

మహాసభల నిర్వహణకు ఏడుగురు సభ్యులతో కూడిన అధ్యక్ష వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష వర్గంలో ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్షులు తిరునవక్కరసు, ఉపాధ్యక్షులు బి.వెంకట్, భానూలాల్‌షా, బి.రాఘవన్, గురుమేష్‌సింగ్, అమియా పత్రా, లలితాబాలన్ ఉన్నారు. స్టీరింగ్ కమిటీలో పాటూరి రామయ్య, ఎమ్‌వీ గోవిందన్ మాష్టారు, ఏ.విజయరాఘవన్, సునీత్ చోప్రా, కె.కోమలాకుమారి ఉన్నారు. తీర్మానాల కమిటీ చైర్మెన్‌గా వి.వెంకటేశ్వర్లు(ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి), సీబీ దేవర్శన్, బ్రిజ్‌లాల్‌భారతి, నిత్యానందన్‌స్వామి, ఎన్ఆర్ బాలన్, వి.అమిత్రలింగం ఉన్నారు. అర్హతపత్రాల కమిటీలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, పద్మ(తెలంగాణ), విక్రమ్‌సింగ్, బోలాప్రసాద్ దివాకర్, పవన్ దుగ్గల్, రామ్‌కుమార్ ఉన్నారు. మినిట్స్ కమిటీలో ప్రకాశ్‌చౌదరీ, సిస్రీయా, సిరిని, తుషార్‌ఘోష్, నాగరాజు(తెలంగాణ) ఉన్నారు.

## మహాసభల ప్రాంగణంలో అరుణపతాకాన్ని ఆవిష్కరించిన తిరునవక్కరసు

మహాసభల ప్రాంగణంలో ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్షులు తిరునవక్కరసు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. వున్నప్రవాయిలర్ పోరాట అమరవీరుల గుర్తుగా అక్కడ నుంచి అరుణ పతాకాన్ని తీసుకొచ్చారు. అరుణ పతాకను పట్టుకుని చిన్నారులు, పెద్దలతో కూడిన బృందం కన్నూర్ వీధుల్లో పరుగెత్తుకుంటూ మహాసభల ప్రాంగణానికి తీసుకొచ్చింది. ఆ పతాకాన్ని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ నేతలకు అందజేసింది. అనంతరం అరుణపతాకాన్ని ఎగురవేశారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.విజయరాఘవన్ ఈకే నయనార్ విగ్రహం ఎదుట పూలబోకేను ఉంచి నివాళి అర్పించారు. అమరవీరులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన స్తూపానికి ఆ సంఘం జాతీయ నేతలు, ప్రతినిధులు పూలు జల్లి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల ప్రతినిధులు ఇంక్విలాబ్ జిందాబాద్...వర్కర్స్ యూనిటీ జిందాబాద్...'సేవ్ ఇండియా...సేవ్ కాన్‌స్టిట్యూషన్' అంటూ నినదించారు. ఈ కార్యక్రమలో ఏఐఏడబ్ల్యూయూ మాజీ అధ్యక్షులు పాటూరు రామయ్య, ఉపాధ్యక్షులు బి.వెంకట్, ఎమ్‌వీ గోవిందన్ మాష్టారు, సహాయ కార్యదర్శి సునీత్ చోప్రా, కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రసాద్, ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కొండమడుగు నర్సింహ్మా, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, కేఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వీఆర్.బాలన్, తదితరులు పాల్గొన్నారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సెన్సెక్స్ ▲ 52 41,306 | నిఫ్టీ ▲ 14 12,182 | డాలరుకు రూపాయి విలువ 71.20 | బంగారం(10.గ్రా) రూ. 39,073 | వెండి (కేజీ) రూ. 46,660 | కోడి గుడ్లు (వందకి) హైదరాబాద్ 392, ఒక్కగుడ్డుకు 4.70, వరంగల్ 381, విజయవాడ 380, చెన్నై 382, ముంబయి 385 |






## రూ.700 కోట్ల పెట్టుబడుల నిలిపివేత!

- 'ఫేమ్-2'తో అమ్మకాలు పడిపోయాయి..
- కొత్త పెట్టుబడులతో లాభం లేదు: హీరో




**న్యూఢిల్లీ:** ప్రభుత్వం విద్యుత్ వాహనాల సబ్సిడీ విషయంలో స్పష్టమైన నిర్ణయాలను ప్రకటించలేక పోతుడడంతో.. అతిపెద్ద విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో ఎలక్ట్రిక్ తన కొత్త పెట్టుబడులను నిలిపివేసింది. దేశంలోని విద్యుత్ వాహనాల తయారీ నిమిత్తం సంస్థ సమీప భవిష్యత్తుకు దాదాపు రూ.700 కోట్ల మేర పెట్టుబడులను ప్రకటించింది. అయితే సర్కారు ఇటీవల అమలులోకి తెచ్చిన ఫేమ్-2 విధానం వల్ల విద్యుత్ వాహనాల తయారీ అంత లాభదాయకం కాదన్న విషయం తెలుస్తోందని హీరో ఎలక్ట్రికల్ తెలిపింది. ఇదే భావనతో సంస్థ తన ప్రతిపాదిత కొత్త పెట్టుబడులను నిలిపివేస్తున్నట్టుగా తెలిపింది. సర్కారు కొత్త విధానం విద్యుత్ వాహనాలను ప్రోత్సహించలేకపోతోందని కంపెనీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫేమ్-2 విధానాన్ని మొత్తం ప్రక్షాళన చేయాల్సి అవసరం ఎంతైనా ఉందన్నది తమ కంపెనీ అభిప్రాయంగా ఆయన తెలిపారు. గతంలో సర్కారు అమలులోకి తెచ్చిన ఫేమ్-1 విధానంలో గంటకు 25 కి.మీ.లు అంతకంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే ద్విచక్ర వాహనాలకు రూ.17,000 నుంచి రూ.20,000 వరకు సర్కారు సబ్సిడీ లభించేది. ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఫేమ్-2 విధానంలో కనీసం ఒక్కసారి చార్జింగ్ చేస్తే 80 కి.మీ. వరకు ప్రయాణించే వాహనాలు, గంటకు 40 కి.మీ. ప్రయాణించే వాహనాలకు మాత్రమే రూ.20,000 వరకు సబ్సిడీ ఇస్తున్నారని ఆయన అన్నారు. దీని వల్ల విద్యుత్ వాహనాల కొనుగోళ్లు దారుణంగా పడిపోయినట్టుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పరిశ్రమ గణాంకాలను బట్టి చూస్తే ఫేమ్-2 విధానం అమలులోకి వచ్చాక విద్యుత్తు వాహనాల అమ్మకాలు.. తగిన సబ్సిడీ లభించక దారుణంగా పడిపోయాయని తెలుస్తోంది. ఫేమ్-1 విధానం అమలులో ఉన్న ఏడాదిలో దేశ వ్యాప్తంగా దాదాపు 49 వేల విద్యుత్ వాహనాల విక్రయాలు జరిగాయని.. తాజాగా ఈ అమ్మకాలు మూడు వేల యూనిట్లకు పడిపోయినట్టుగా "సొసైటీ ఆఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్" (ఎస్ఎంఈవీ) తెలిపింది. దేశంలో విద్యుత్తు వాహనాల వినియోగం విస్తృతమవ్వాలంటే తక్కువ సామర్థ్యం కలిగిన వాహనాలకు కూడా సబ్సిడీని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంస్థ అధికారి అభిప్రాయపడ్డారు. ఇలా చేయకుంటే విద్యుత్ వాహనాలను కొనేందుకు ఎక్కువగా జనాలు ముందుకు రారని.. దీంతె భారీగా వీటిని ఉత్పత్తి చేయలేమని ఆయన అన్నారు.


## 'ఎన్‌క్లాట్' తీర్పుపై సుప్రీంకు టాటా

**ముంబయి:** టాటా గ్రూపునకు ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా సైరస్ మిస్త్రీని తిరిగి నియమించాలన్న నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌క్లాట్) తీర్పును సవాల్ చేస్తూ టాటా సన్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఎన్‌క్లాట్ తీర్పును సవాల్ చేస్తూ మధ్యంతర స్టే ఇవ్వాలని టాటా సన్స్ కోరనున్నట్లు సంస్థ నుంచి సమాచారం అందుతోంది. దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో దీనిపై తక్షణమే స్టే తెచ్చుకోవాలని టాటా సన్స్ నిర్ణయించినట్లు రిపోర్టులు వస్తున్నాయి. జనవరి 9న టీసీఎస్ బోర్డు సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా 2019 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ఆ కంపెనీ విడుదల చేయనుంది.

# మోడీ సర్కారు చర్యలు సరిపోవు..!

## ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాలి..

- దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడం ప్రస్తుతం అత్యవసర కార్యక్రమం
- రాజకీయ ఏకాభిప్రాయం లేక దేశంలో ఇన్వెస్ట్‌మెంట్స్ రావట్లేదు...
- పెట్టుబడులు లేకుండా కొలువులు రావు: మారుతీ సంస్థ చైర్మెన్ ఆర్.సి.భార్గవ




**న్యూఢిల్లీ:** దేశంలో రాజకీయ ఏకాభిప్రాయం కొరవడిన కారణంగానే.. ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితులు మరింత తీవ్రతరం అవుతున్నాయని ప్రముఖ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సంస్థ చైర్మెన్ ఆర్.సి.భార్గవ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పరిస్థితులు తీవ్రతరం అవుతున్నప్పటికీ .. కేంద్రం సర్కారు, ప్రధాన ప్రతిపక్షాలు తమతమ స్వప్రయోజనాలపై దృష్టి సారించి సమస్య పరిష్కారం దిశగా కలిసి ముందుకు సాగలేకపోతున్నాయని అన్నారు. ఎవరికి వారే అన్నరీతిలో సాగుతుండడం వల్లే ఆర్థిక వ్యవస్థ పరిస్థితి తీవ్ర మందగమనంలోకి కూరుకుపోతోందని ఆయన అన్నారు. దేశంలో రాజకీయ ఏకాభిప్రాయం లేకపోవడం .. కంపెనీలు భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాకుండా చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా దేశంలో కొత్త పెట్టుబడులు రాక ఉద్యోగాల సృష్టి కూడా జరగడం లేదని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత ప్రతికూల వాతావారణంలో పరిశ్రమల వృద్ధికి దీర్ఘకాలిక వ్యూహాలతో సర్కారు ముందుకు సాగాల్సి ఉంటుందని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం సర్కారు ఆలోచన తీరు స్వల్పకాలికంగా సమస్య పరిష్కారం చుట్టూనే తిరుగుతున్నాయని తెలిపారు. తయారీ రంగంలో వృద్ధి, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎక్కువగా ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని పారిశ్రామిక ప్రగతి కునారిల్లుతోందని, తయారీ రంగం మూలన పడిందని, వాహన రంగం తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటి ఫలితంగా మందగమనం తీవ్రమై వృద్ధిరేటు పడిపోతూ వస్తోందన్నారు.

**చాలా బిల్లులు పార్లమెంట్‌లో నిలిచిపోయాయి...**

దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా పలు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాత్మక బిల్లులు పార్లమెంట్ ఆమోదం లభించక చట్ట సభల్లో నిలిచిపోయి ఉన్నాయని భార్గవ తెలిపారు. ఫలితంగా ప్రతికూల ఫలితాలు ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్నాయని ఆయన వివరించారు. దేశ ప్రజల సమిష్టి ప్రయోజనాల రీత్యా దేశంలోని అన్ని పారీలూ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని.. ఆర్థిక వ్యవస్థ కష్ట కాలంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఇది చాలా అవసరమని ఆయన అన్నారు. అన్ని పార్టీలూ ఒక అంగీకారంతో దేశాన్ని ఆర్థికంగా ఎలా ముందుకు తీసుకుపోవాలనే విషయమై ఆలోచన చేయాలని ఆయన సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడమనేది రాజకీయాంశం కాదని.. ఇది దేశంలోని ప్రతి ఒక్కరి ప్రయోజనాలను కాపాడే బృహత్తర కార్యమని ఆయన అన్నారు. దేశం స్వాతంత్ర్యం పొంది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దేశాభివృద్ధిని గణించేందుకు ఎలాంటి విధానాన్ని అవలంభించాలనే అంశంపై ఇప్పటి వరకు సరైన స్పష్టత లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### లోతుగా ఆలోచించేందుకు ఇదో అవకాశం..

**ప్రస్తుతం ఏర్పడిన మందగమన పరిస్థితులు సమస్యకు గల కారణాలను గురించి లోతుగా ఆలోచన చేసేందుకు వచ్చిన మంచి అవకాశమని భార్గవ అన్నారు. వృద్ధిరేటు పెరిగేంత వరకు దేశంలోకి కొత్తగా పెట్టుబడులు వచ్చి చేరవని ఆయన అన్నారు. వృద్ధిని పెంచకుండా కంపెనీలు కొత్త పెట్టుబడులతో ముందుకు రావని.. ఈ నేపథ్యంలో కొత్త కొలువులు కూడా అందుబాటులోకి రావని ఆయన విశ్లేషించారు. మన సామర్థ్యం మేరకు మన ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగడం లేదని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం దేశంలోని నరేంద్ర మోడీ సర్కారు వృద్ధిని గాడిలో పెట్టేందుకు గాను తగిన ప్రణాళికలను వేస్తున్నప్పటికీ వాటి పట్ల భార్గవ సంతృప్తి వ్యక్తం చేయలేదు. మోడీ సర్కారు ప్రకటిస్తున్న స్వల్పకాలిక ఉపశమనాలతో ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం మేలు జరగదని, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇవి సరిపోవని ఆయన అన్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఆసన్నమైందని ఆయన వివరించారు. ఈ సమయంలో సూక్ష్మ స్థాయి, దీర్ఘకాలిక ప్రణాళిక ఎంతైనా అవసరమని సర్కారుకు సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి ఆర్థిక వ్యవస్థకు సర్కారు మార్గనిర్దేశనం చేస్తే.. వాటిని దేశంలోని పరిశ్రమలు ముందుకు తీసుకు పోగలవని ఆయన అన్నారు. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా ఉన్న తమ సంస్థకు దీర్ఘకాలికంగా ఎలాంటి వ్యూహాలతో ముందుకు పోవాలో తెలియని పరిస్థితి ఉందంటే.. మిగతా సంస్థల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఈ దిశగా సర్కారు ఆలోచనా తీరు ఉండాలని ఆయన సూచించారు.**

## ఆశాజనకంగా జీఎస్టీ పన్ను వసూళ్లు..!

**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు గడిచిన ఏడాది చివరి మాసంలో కొంత ఆశాజనకంగా నమోదయ్యాయి. డిసెంబర్‌లో వస్తు సేవల పన్ను వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లుగా నమోదైనట్టుగా సర్కారు వెల్లడించింది. కొత్త పన్ను వసూళ్లు ఈ స్థాయిలో నమోదు కావడం ఇది మూడో సారి. నవంబర్‌లో రూ.1,03,492 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. ఇంతక్రితం రూ.లక్ష కోట్ల మార్కును గతేడాది జులైలో.. రూ. 1.02 లక్షల కోట్లుగా నమోదు అయ్యాయి. కాగా 2018 డిసెంబర్‌లో కూడా జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల మార్కునకు దిగువకు జారి రూ.94,726 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో పోల్చితే గడిచిన నెల వసూళ్లలో దాదాపు 6 శాతం వద్ధి కనిపించినట్టయింది. గత నెలలో వసూళ్లయిన రూ.1,03,184 కోట్లలో సీజీఎస్టీ కింద రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.26,792 కోట్లకు, ఐజీఎస్టీ వసూళ్లు రూ.48,099 కోట్లుగా నమోదయ్యాయని సర్కారు గణాంకాలు చెబుతున్నాయి. రూ.8,331 కోట్ల సొమ్ము సెస్ వసూళ్లయ్యింది. ఈ నెలలో అరుణాచల్ ప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు రెట్టింపైయ్యాయి.

## లాభాలతో కొత్త ఏడాదికి స్వాగతం!

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త ఏడాదిని లాభాలతో శుభారంభం చేశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ సంస్థల షేర్లు రాణించడంతో స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో నిలిచాయి. అమ్మకాల ఒత్తిడి కనిపించినప్పటికీ సెక్టర్ నిర్దేశిత ప్రధాన స్టాక్స్ రాణించడంతో మార్కెట్లు కొత్త ఏడాది 2020 తొలి రోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. బుధవారం బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 52 పాయింట్లు (0.13 శాతం) పెరిగి 41,306 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 14 పాయింట్లు రాణించి 12,183 వద్ద ముగిసింది. దీంతో కొత్త ఏడాది తొలి రోజు మార్కెట్లకు లాభాలతో స్వాగతం పలికినట్లయ్యింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 41,443 - 41,251 మధ్య కదలాడింది. నిఫ్టీ సూచీ కూడా 12,222-12165 మధ్య డోలాయానం చేసింది. సెన్సెక్స్‌లో 10 స్టాక్స్ నష్టాలలో నిలువగా.. 20 సూచీలు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీలో ఐటీ 0.54 శాతం, ఎఫ్ఎంసీజీ 0.34 శాతం, విత్త సేవలు రంగం సూచీ 0.17 శాతం, ఫార్మా 0.14 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు మద్దతును ఇచ్చాయి. మరోవైపు ఆటో సూచీ 0.47 శాతం, బ్యాంకింగ్ 0.09 శాతం, లోహ సూచీ 0.14 శాతం, రియాల్టీ 0.32 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. మార్కెట్ విస్తృతి బలహీనంగానే కనిపించింది. కొత్త ఏడాది సెంటిమెంట్ ట్రేడింగ్‌లో ప్రతిబింబించినడం వల్లే మార్కెట్లలో స్వల్పలాభాలు నమోదు అయినట్టుగా ట్రేడర్లు తెలిపారు.

**అంతర్జాతీయం**

## ఇఫ్లూ సర్క్యులర్‌ను ఉపసంహరించాలి : ఎస్ఎఫ్ఐ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరసన తెలపకుండా విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సర్క్యులర్ ప్రకారం శీతాకాలం సెలవులను పెంచి విద్యార్థులు హాస్టళ్లను ఖాళీ చేయాలని బలవంతం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యల ద్వారా విద్యార్థులు వర్సిటీ ప్రాంగణంలోకి రాకుండా నిరసనలు జరగకుండా చేయొచ్చని వర్సిటీ అధిఆరులు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఇఫ్లూలో ఇలాంటి అణచివేత విద్యార్థులపై చాలాకాలం నుంచి కనిపిస్తున్నదని తెలిపారు. నిరసన తెలపకుండా కనీసం వర్సిటీలోని సమస్యలను అడగకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ ప్రశ్నిస్తే షిల్లాంగ్‌లో ఉన్న ప్రాంగణానికి బదిలీ చేస్తామంటూ విద్యార్థులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఇనుప కంచెల ద్వారా వర్సిటీల్లో ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యతిరేకమైన సీఏఏపై ఇఫ్లూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని, లౌకిక విలువల రక్షణకు విద్యార్థులు పోరాటాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి నిరసనలను అడ్డుకునేందుకు హాస్టల్ ఆధునీకరణ పేరుతో సర్క్యులర్ జారీ చేశారని విమర్శించారు. సెలవులు ప్రకటిస్తూ ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## యువకులపై పోలీసుల దాడి


- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఘటన..
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

**నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్**

నూతన సంవత్సర వేడుకల్లో మంగళవారం రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మద్యం తాగిన యువకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే కారణంగా వారిపై దాడి చేశారు. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని యువకులు అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్డుపై వెళ్తుండగా పోలీసులు పట్టుకెళ్లి ఇష్టమొచ్చినట్టు బాదారు. కడుపులో తన్నుతుండగా వీడియో తీసి పలువురు యువకులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ విషయంపై సిరిసిల్ల పట్టణ సీఐ వెంకటనర్సయ్యను వివరణ కోరగా.. పట్టణంలోని పలువురు యువకులు గొడవ పడుతూ ఇనుప రాడ్లతో పరస్పరం దాడి చేసుకున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడ యువకులు బీరు సీసాలు పగులగొట్టి, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుండగా వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశామే తప్ప ఎవరినీ కొట్టలేదని చెప్పారు.

## త్వరలో మున్సిపోల్స్‌పై సీఎం సమావేశం

- కేటీఆర్ వెల్లడి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్.. త్వరలోనే ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేకం గా సమావేశమవుతారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, సీనియర్ నేతలతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకుని వివరాలు సేకరించాలంటూ సూచించారు.

# శాంతి స్థాపన, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

## మయన్మార్ అధ్యక్షుడి పిలుపు



**యాంగాన్:** శాంతి స్థాపన, ప్రజాస్వామ్య పటిష్టత, అభివృద్ధి వంటి అంశాలలో ప్రజలు భాగస్వాములు కావాలని మయన్మార్ అధ్యక్షుడు యు విన్‌మింట్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఇక్కడ జరిగిన నూతన సంవత్సర వేడుకల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్యం, న్యాయం, నిజాయితీ, పారదర్శకత వంటి అంశాలతో ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల, క్లిష్ట పరిస్థితులను సులభంగా అధిగమించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

అందరికీ సమాన హక్కులతోపాటు శాంతి, అభివృద్ధికి హామీ ఇచ్చే ప్రజాతంత్ర ఫెడరల్ యూనియన్ రాజ్యాంగ నిర్మాణానికి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. ప్రజలకు సంతోషకరమైన, ప్రగతిదాయకమైన జీవితాన్ని అందించేందుకు వీలుగా శాంతి, ప్రగతి, అభివృద్ధి సాధన లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తొలి ఉపాధ్యక్షుడు యుమింట్ స్వే మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవిస్తూ ప్రగతి బాటలో పయనించాలని ఆకాంక్షించారు. మరో ఉపాధ్యక్షుడు యుహెన్రీ వాన్ థియో మాట్లాడుతూ దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను, సామరస్యతను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# లిబియాలో విదేశీ జోక్యాన్ని ఖండించిన అరబ్‌లీగ్



**కెయిరో:** ఉత్తరాఫ్రికాలోని లిబియా అంతర్గత వ్యవహారాలలో విదేశీ జోక్యాన్ని ఏ రూపంలోనూ తాము ఆమోదించబోమని అరబ్‌లీగ్ స్పష్టం చేసింది. మంగళవారం ఇక్కడ భేటీ అయిన అరబ్‌లీగ్ లిబియాలో పరిస్థితిపై చర్చించింది. లిబియాలో రాజకీయ ప్రక్రియ కొనసాగింపును సమర్థిస్తున్నట్టు చెప్పిన లీగ్ శాశ్వత ప్రతినిధులు, అక్కడ 2015 నాటి స్ఖిరాత్ ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయటం ద్వారా రాజకీయ ప్రక్రియను పరిపూర్ణం చేయాలని సూచించారు. లిబియన్లు ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అంతర్జాతీయ సహకారంలో భాగంగా పొరుగుదేశాలు భాగస్వామ్యం వహించాలని లీగ్ పిలుపునిచ్చింది.

లిబియాలో సైనిక దాడులతో పరిస్థితి నానాటికీ దిగజారుతుండటం పట్ల లీగ్ ఆందోళన వ్యక్తంచేసింది. లిబియాలో కొనసాగుతున్న అస్థిరత, సంక్షోభ పరిస్థితులు పొరుగుదేశాలతో పాటు మధ్యప్రాచ్యం, మధ్యధరా సముద్ర ప్రాంతానికి కూడా చేటు చేస్తాయని హెచ్చరించింది. లిబియాలో సైనిక ఘర్షణలకు వెంటనే తెరదించాలని లీగ్ శాశ్వత ప్రతినిధులు పిలుపునిచ్చారు. అక్కడ శాంతి సుస్థిరతలను నెలకొల్పడం, ఉగ్రవాదాన్ని నిర్మూలించడం రాజకీయ పరిష్కారంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఐరాస మద్దతుతో కొనసాగుతున్న లిబియా ప్రభుత్వం వినతి మేరకు అక్కడికి తమ సైన్యాలను పంపనున్నట్లు టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ ప్రకటించిన నేపథ్యంలో అరబ్‌లీగ్ అత్యవసరంగా భేటీ అయి పరిస్థితిని సమీక్షించింది.

## స్వీయ నిషేధానికి కట్టుబడి ఉండబోం : కిమ్

**సియోల్:** క్షిపణి, అణు ప్రయోగాలపై తమకు తాముగా విధించుకున్న స్వీయ నిషేధానికి ఇకపై కట్టుబడి ఉండబోమని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. త్వరలోనే మరో కొత్త వ్యూహాత్మక ప్రయోగాన్ని చేపట్టబోతున్నట్టు ఆయన వెల్లడించారు. అమెరికా తమ దేశంపై శతృత్వ వైఖరిని అవలంభించటం ఆపేంత వరకూ తాము ఆయుధాల రూపకల్పనను కొనసాగిస్తామని కిమ్ స్పష్టం చేశారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా సెంట్రల్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన ఇటీవల ప్రసంగించారు. ఇరుదేశాల మధ్య సాగుతున్న ద్వైపాక్షిక చర్చలను తన రాజకీయ ప్రయోజనాల కోసమే అమెరికా అపివేసిందని కిమ్ తెలిపారు. శాంతి భద్రతల స్థాపనకు ఇరుదేశాల నేతలు జూన్ 2018నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు సమావేశమైనప్పటికీ చెప్పుకోదగిన ఫలితాలు లభించలేదు. అమెరికా తమపై విధించిన ఆంక్షలను సడలించాలని డిమాండ్ చేస్తూ 2019 చివరి నాటికి గడువు విధించింది ఉత్తర కొరియా ప్రభుత్వం. అయితే అమెరికా దీనిపై ఎలాంటి జవాబివ్వని కారణంగానే కిమ్ ఈ నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇండోనేసియాలో పోటెత్తిన వరదలు


- 9 మంది మృతి, వేలాది మంది గల్లంతు



**జకార్తా:** ఇండోనేషియాలో భారీ వర్షాల కారణంగా అక్కడి నదులు వరదలతో పోటెత్తాయి. ఆ దేశ ప్రజలందరూ కొత్త సంవత్సర వేడుకల్లో ఉన్న వేళ విరుచుకుపడిన ఈ వరదల్లో 9 మంది మృతి చెందారు. అనేక మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. వరదల కారణంగా వేలాది మంది నిర్వాసితులు కాగా, జకార్తా విమానాశ్రయంలోకి నీరు ప్రవేశించటంతో తాత్కాలికంగా మూసివేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చేందుకు సిద్ధమవుతున్న జకార్తా వాసులు ఈ ఆకస్మిక కుంభవృష్టితో తడిసి ముద్దయ్యారు. బుధవారం ముంచెత్తిన ఈ వరదలతో దాదాపు 90 నైబర్‌హుడ్‌లు నీట మునిగాయని, జకార్తా నగర సరిహద్దుల్లోని దెపోక్ ప్రాంతంలో కొండచరియలు విరిగి పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ప్రతినిధి అగస్ విబోవో చెప్పారు. విద్యుద్ఘాతంతో 16 ఏండ్ల విద్యార్థి కూడా మృతి చెందాడని ఆయన వివరించారు. అనేక ప్రాంతాలలో వరదనీరు మూడు మీటర్ల పై ఎత్తు రావటంతో, 19 వేల మందికి పైగా ప్రజలను తాత్కాలిక సహాయ శిబిరాలకు తరలించామన్నారు.

# మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాపై అవినీతి విచారణ

## త్వరలో ప్రారంభమవుతుందన్న దక్షిణాఫ్రికా సర్కారు



**జోహెన్నెస్‌బర్గ్:** అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాపై త్వరలో విచారణ ప్రారంభం అవుతుందని దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రకటించింది.

ఈ అవినీతి విచారణపై శాశ్వత స్టే ఇచ్చేందుకు దక్షిణాఫ్రికా హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగంగా కొనసాగించేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. 2009 నుంచి 2018 వరకూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జుమాపై మోసం, రాకెటీరింగ్, మనీ లాండరింగ్ వంటి అవినీతి ఆరోపణలతో పాటు ఆయుధ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో మొత్తం 16 కేసులు నమోదయ్యాయి. ఈ ఆరోపణలన్నీ ఆధార రహితమైనవని, అందువల్ల వాటిని కొట్టివేయాలని జుమా కోర్టుకు అప్పీలు చేసుకున్నారు. ఇందులో ఆయుధ కొనుగోళ్ల వ్యవహారం సైనిక దళాల కోసం ఐరోపా దేశాల నుండి ఆయుధ కొనుగోళ్లకు ప్రయత్నించిన 90వ దశకం నాటి వ్యవహారానికి సంబంధించినది. దాదాపు దశాబ్ద కాలం పాటు అధికారం చెలాయించిన జుమా గత ఏడాది పార్టీలో అంతర్గత విభేదాలతో ఉద్వాసనకు గురయ్యారు. ఆయన వారసుడిగా గద్దెనెక్కిన సిరిల్ రమఫోసా దేశంలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. వాస్తవానికి జుమాపై నమోదయిన ఈ అవినీతి ఆరోపణలు 2009 నాటివి అయినప్పటికీ 2009లో ఆయన దేశాధ్యక్షుడిగా ఎన్నికవటంతో నేషనల్ ప్రాసిక్యూటింగ్ అథారిటీ వాటిని పక్కన పెట్టింది. దేశాధ్యక్షుడిగా జుమా ఎన్నిక అనంతరం ఈ అవినీతిపై ప్రతిపక్షాలు సుదీర్ఘ పోరాటం చేశాయి. 2016లో కోర్టు విచారణకు చేపట్టేందుకు నిర్ణయించటంతో వీరి పోరాటం సఫలీకృతమైంది. ఇటీవల జరిగిన తొలి విచారణలో ఆయన తాను నిర్దోషినని, తనపై నమోదయిన ఆరోపణలన్నీ ఆధార రహితమైనవని వాదించారు.

అయితే వీటిని కొట్టివేసేందుకు కోర్టు నిరాకరించటంతో త్వరలో ఆయన కోర్టు బోనెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# భారతదేశం నా మాతృభూమి



షేక్ బషీరుద్దీన్

సర్వ సత్తాక గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య దేశంలో జీవిస్తున్నాము. ఈ దేశంలో పుట్టినందుకు గర్వపడుతున్నాము.

భారతదేశము నా మాతృభూమి
భారతీయులంతా నా సహోదరులు
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను....

సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వ కారణం. అని కుల, మతాలకతీతంగా ప్రతిజ్ఞ చేస్తూ ఈ దేశాన్ని నిర్మించుకున్నాము. కానీ ఇప్పుడు కొందరికే ఇది మాతృభూమి. ఎందరో ఇది తను మాతృ భూమి అని కొత్తగా నిరూపించుకోవాలట..! సర్టిఫికెట్స్ ద్వారా నిరూపించుకుంటే సరిపోతుందా? లేక నిజంగా ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఈ దేశ నిజమైన వారసులుగా మనస్ఫూర్తిగా జీవిస్తే సరిపోతుందా? ఇదే ఇప్పుడు మన సమస్య. దేశమంతా ఉద్యమ బాట పట్టించిన సమస్య జామియా మిలియా ముస్లిం విశ్వవిద్యాలయం నుండి మొదలై, మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వవిద్యాలయం వరకు. బెనారస్ విశ్వవిద్యాలయం నుండి బెంగుళూరు విశ్వవిద్యాలయం వరకు దేశంలోని విద్యార్థిలోకమే కాదు. ఉత్తర, దక్షిణాలన్న తేడా లేకుండా యావద్భారతం భగ్గుమంటోంది.

హిందూ – ముస్లిం భాయ్ భాయ్
సారే జహాసే అచ్చా – హిందుస్తాన్ హమారా
సేవ్ ఇండియా ... భారత్ బచావో
లౌకికతత్వం వర్ధిల్లాలి, సేవ్ డెమోక్రసి

అంటూ అట్టుడుకుతుంది. అసలు ఏం జరిగింది? లౌకిక స్ఫూర్తితో అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన పౌరసత్వ బిల్లుకు మార్పు చేస్తూ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సవరణ బిల్లును ప్రవేశపెట్టాడు. ఈ మసాయిదాకు లోక్‌సభలో 311 మంది సభ్యులు అనుకూలంగా, 80 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. 9 డిసెంబర్, 2019న రాజ్యసభలో అనుకూలంగా 125, వ్యతిరేకంగా 80 ఓట్లతో ఆమోదించబడి, బిల్లు నెగ్గింది. డిసెంబర్ 12న రాష్ట్రపతి ఆమోదంతో ఈ పౌరసత్వ సవరణచట్టం (సీఏఏ) అమలులోకి వచ్చింది.

అనేక కీర్తి కిరీటాలు కలిగిన భారతమాత శిరస్సులో "లౌకికత" అనేది కలికితురాయి. ఈ బిల్లు ఆమోదంతో ఆ లౌకికతకు ముప్పు వాటిల్లింది. ఇప్పటి వరకూ దేశంలో అన్ని మతాలను సమానంగా చూడాలని, అన్ని మతాలకు ప్రభుత్వం సమాన దూరంలో ఉండాలని చెప్పిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21, 30లకు తూట్లు పొడుస్తూ దేశంలో పెద్ద గందరగోళానికి తెరలేపింది. నిన్నటి వరకు ఈ దేశాన్ని తమ మాతృభూమిగా ప్రేమించినవారు, ఈరోజు నుండి నేను ఏ దేశానికి చెందినవాడిని అనే ప్రశ్నతో ఆందోళన చెందుతున్నారు! భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలు, సంస్కృతులు, భాషలున్నా అందరం కలిసి మనమంతా భారతీయులం అని అనుకున్నాం. అలాంటి దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వమంటే కాళ్లకింద నేల కరిగిపోతున్నట్లనిపిస్తోంది. ఏం చెబుతుంది ఈ సవరణ చట్టం? ప్రధానంగా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మత పీడనకు, దోపిడీకి గురైన అల్ప సంఖ్యాక ముస్లిమేతరులు 31 డిసెంబర్ 2014 నాటికి భారతదేశం వచ్చిన వారిని భారత పౌరులుగా పరిగణించి, భారత పౌరసత్వం కల్పించబడుతుంది. వీరు ఇక్కడి వారేనని ఒక సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. టిబెట్ బౌద్ధులకు, మయన్మార్ రోహింగ్యా ముస్లిములకు, శ్రీలంక హిందూ, ముస్లింలకు పౌరసత్వం ఇవ్వకుండా కేవలం పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌లలోని ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం కల్పించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం.

నాటి రాచరిక వ్యవస్థ నుండి నేటి రాజ్యాంగ వ్యవస్థ వరకూ భారత భూమిపై ఆధిపత్య పోరు నడుస్తుంది. ఇండో, గ్రీకు, బ్రిటిష్ విదేశీ దండయాత్రలు మొదలు నేటి ప్రపంచీకరణ దాడి వరకూ ఈ దేశ సంపద దోపిడీకి గురవుతూనే ఉన్నది. క్రీ.పూ. 150 నుండి క్రీ.శ. 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్యం వరకు ప్రత్యక్షంగా, ఇప్పుడు పరోక్షంగా దోచుకుంటున్నారు. సంపదను దోచుకొంటున్నవాళ్లు మన సంస్కృతిని మాత్రం మార్చలేకపోయారు. అనేక శతాబ్దాలుగా దండయాత్రలు, వలస పాలనలతో తగిలిన గాయాలను, గేయంగా మార్చుకొని, వలస పాలనలో వచ్చిన మతాలను, భాషలను, సంస్కృతులను మమతానురాగాలతో మదిలో నింపుకొని మాతృ ప్రేమతో అందరిని తన సొంత బిడ్డల్లాగా ప్రేమను పంచిపెడుతుంది భారతమాత. ఈ దేశం ఒక దేశంగా లేనప్పుడు విభిన్న మతాల రాజులు, రాచరికపు వ్యవస్థలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు, ప్రాంతాలుగా వుండి వారి వారి పద్ధతులను వారు పాటించారు. ఈ మొత్తం పద్ధతులను కలిపి స్వాతంత్ర్యం అనంతరం




ఏర్పడిన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అవతరించి సుసంపన్న, లౌకిక సంస్కృతిని సంపాదించుకున్నది. దేశ విదేశాలలోని మేధావులు, అనేక మతాల పెద్దలు భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో ఒక గొప్ప లౌకికదేశంగా కీర్తించారు. కానీ ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్న పాలకులు చేస్తున్న ద్వేష రాజకీయాలలో భాగంగా తరతరాలుగా వచ్చిన లౌకికవాదానికి గండిపెట్టి మత రాజ్యంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. హిందూ అజెండాను భుజానికెత్తుకొని, లౌకికవాదాన్ని తుంగలో తొక్కి రాజకీయ లబ్ది కోసం అన్నదమ్ముల మధ్య చిచ్చు పెడుతున్నారు. భారతదేశ పవిత్ర గ్రంథంగా భావిస్తున్న రాజ్యాంగంలో పొందుపర్చిన మౌలిక సూత్రాలను తమకు అనుకూలంగా మారుస్తూ, అధికారులను, చట్టాలను, మీడియాను, కోర్టులను సైతం తమ కబంధ హస్తాలలో బంధించి ముందుకుపోతున్నారు. ఎవరో కొందరు ముస్లింలు ఛాందసవాదంతో చేస్తున్న ఉగ్రవాదాన్ని, దాయాది దేశమైన పాకిస్తాన్‌ను బూచిగా చూపెడుతూ, కాశ్మీర్ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చి మెజార్టీలుగా ఉన్న హిందువుల ఓటు బ్యాంకును దోచుకునేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఈ దేశం లౌకిక దేశం. బహువిధమైన, సుసంపన్నమైన వారసత్వం కలిగిన దేశం. అనేక గాయాలను తమ గుండెల్లో దాచి భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశం. ఈ దేశంలో వేరువేరు మతాలున్నా, మనుషులంతా ఒక్కటే. ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలు, చట్టాల సవరణలు ఎన్ని తెచ్చినా, మతోన్మాదంతో రెచ్చగొట్టి వేరు చేయాలని చూసినా, మేం భారతీయులం. అందరం అన్నదమ్ముల్లా ఉంటాం. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి ఈ దేశంలో ఉండే హక్కు ఉందని అంటూ, ఈ దేశం నా మాతృభూమి అని నినదిస్తాం.

సెల్ : 9704816603

# ప్రయాణమెప్పుడూ ప్రగతి వైపే!



కె. ఆనందాచారి

మార్క్స్ మార్గం 39

వస్తువులలో, క్రమాలలో, సమాజంలో, ఆలోచనలలో వైరుధ్యాలుంటాయనీ, ఈ వైరుధ్యాలు పరిష్కారం కావటమే గుణాత్మక మార్పు అనీ, ఇది అంతర్గత ఘర్షణ వలన పాతదాని స్థానంలో కొత్తది వస్తూ మారుతుందనీ గత వ్యాసాలలో చర్చించాము. మనం అర్థం చేసుకోవటానికి వేరు వేరు అంశాలుగా చర్చించినా, అన్నీ కలిసి కొనసాగే అంశాలే ఇవి. రెండు విరుద్ధ శక్తుల మధ్య ఐక్యత, ఘర్షణ, పరిమాణాత్మక మార్పులకు లోనై గుణాత్మక మార్పు చెందుతుంది. అంటే కొత్తది ఏర్పడుతుంది. విత్తనం మొక్క రూపమెత్తుతుంది. గొంగళి పురుగు సీతాకోక చిలుక అవుతుంది. గుడ్డు కోడి పిల్ల అవుతుంది. అనగా పాతది పోయి, కొత్తది వస్తుంది. ఈ కొత్తది కూడా పాతదైపోయి మరో కొత్తది వస్తుంది. మొక్క పెరిగి అనేక గింజలిచ్చి మొక్క అంతరిస్తుంది. దీనినే అభావం చెందడం అంటారు. గతితార్కిక నియమాల్లో ఇది మూడోది.

కాయ నుండి పండు, పండు నుండి మళ్లీ విత్తనం, విత్తనం తిరిగి మొలక ఇలా ఈ క్రమం నిరంతరం. అంతర్గత వైరుధ్యాలు పరిష్కారమవుతూ నూతన దశ వస్తూ, దాన్నుండి మళ్లీ కొత్త వైరుధ్యాలు ఏర్పడి, మళ్లీ పరిష్కారమవుతూ సాగుతూనే ఉంటుంది. వైరుధ్యం పరిష్కారమవుతుంటే గుణాత్మక మార్పు ఇదే అభివృద్ధికి పునాది. అంతర్గత వైరుధ్యాలు ఉన్నాయంటేనే ఒకదాన్ని ఒకటి రద్దు చేసుకునే ధోరణిలో ఉంటున్నాయని అర్థం. పాతది పోయి కొత్తది రావడం అంటే అర్థం పాతది సమూలంగా పోవడం కాదు. పాత దాని నుండే కొత్తది వస్తుంది. పాతది ఏది అభావం (లేకుండా పోవడం) చెందుతుంది? కొత్తది దేన్ని అభావం చెందించి వస్తుంది? అనే విషయాలను చర్చించేదే అభావం. అభావం చెందడమనే నియమం (Nagation of nagation).

పాతది పోయి కొత్తది వచ్చి సమాజం అభివృద్ధి చెందుతూ ఉందన్న విషయాన్ని భావవాదులు కూడా ఒప్పుకుంటారు. అయితే వాళ్లు చెప్పేది వేరే. సమాజం ఒక అభివృద్ధి దశకు చేరుకున్నాక మళ్లీ కిందికి పడిపోతుంది అంటారు. కృషి, స్థితి, లయ అనే దృక్పథం అదే చెబుతుంది. అంటే బ్రహ్మ సృష్టిస్తున్నాడు. విష్ణు నిలబెడుతున్నాడు. శివుడు లయం చేస్తున్నాడు అంటారు. కానీ నిరంతర అభివృద్ధి క్రమం అనేది ఒక దాన్నుండి ఒకటి సంబంధంలో కొనసాగుతుంది. తుది తీర్పుగా అంతం అనేది ఉండదు. ఉనికిలోకి వచ్చిన ప్రతిదీ నశిస్తుంది. మార్పు ఒక్కటే నిరంతరంగా ఉంటుంది. ఒకటి నశిస్తుందంటే కొత్త దానికి పురుడు పోసే పాతది అంతరిస్తుంది. నశించినది తిరిగి జనించదు. అభావం చెందడమంటే పాతదాని స్థానంలో కొత్తది ప్రవేశించడం. ఒక అభివృద్ధి దశ స్థానంలోకి మరో అభివృద్ధి దశ ప్రవేశించడం. పాతది అభావం చెంది కొత్తది ఉద్భవించిందంటే పాతది నశించిపోగా కొత్తది ఎక్కడి నుండో ఊడిపడిందని కాదు. పాతదాని నుండే కొత్తది ఉద్భవించిందనీ, అలా కొత్తది ఉద్భవించే క్రమంలోనే పాతది అభావం చెందిందనీ అర్థం. ప్రకృతిలో, సమాజంలో, ఆలోచనా క్రమంలో సర్వత్రా అభివృద్ధి క్రమం అభావం అభావం చెందే క్రమంలోనే జరుగుతుంది. అభావం అనేది వస్తువులోని విరుద్ధాంశాల ఐక్యత, ఘర్షణలో ఇమిడి ఉంటుంది. వస్తువులోని అంతర్గత వైరుధ్య పరిష్కారమే అభావం. వస్తువు అంతర్గత వైరుధ్యంలోని పాతదాన్ని ప్రగతి నిరోధకమైనదాన్ని కొత్తది ప్రగతిశీలమైనది జయించి బలపడటమే అభావం. ఈ అభావం అభావం చెందడం ద్వారా జరిగే అభివృద్ధిని మనం ప్రతి చోటా గమనించగలం.

బార్లీ గింజ అభివృద్ధిని ఏంగెల్స్ ఇలా వివరించాడు. అనుకూల పరిస్థితులలో గింజ విత్తినట్టయితే గింజ మొలకెత్తి మొక్కగా మారుతుంది. ధాన్యం గింజ మొలకెత్తిందీ అంటే ఇక గింజ లేకుండా పోయిందనీ అభావం చెందిందనీ అర్థం. ఇక మొక్క పెరిగి పెద్దదై కంకులు వేస్తుంది అటు పిమ్మట మొక్క ఎండిపోయి అంతరిస్తుంది. ఇప్పుడిక్కడ మొక్క అభావం చెందింది. ఈ రెండో అభావాన్ని, అభావం అభావం చెందడమంటాము. అయితే ఈ రెండు అభావాలూ గింజ పరిణామ క్రమానికి సంబంధించిన రెండు దశలని గుర్తుంచుకోవాలి. అభావం అంటే కేవలం నశించిపోవడం కాదు. నూతన అభివృద్ధి దశకు చేరుకోవడం. అలా నూతన దశకు చేరుకునే క్రమంలో పాత రూపాన్ని విసర్జించి కొత్త రూపాన్ని ధరించడం అని అర్థం. మనం నిత్యమూ ఆహారంగా ఉపయోగిస్తున్న ధాన్యమూ, గుడ్లు, పండ్లు వగైరా మనం తినడం వలన అంతరించిపోతున్నాయి. కానీ అభావం చెందడం మొక్కగా అభివృద్ధి చెందే క్రమంలో అంతరించిపోయే గింజ. పిల్లగా మారే క్రమం లో అంతరించిపోయే గుడ్డు అభావం చెందుతున్నాయని గుర్తుంచుకోవాలి. దీన్ని బట్టి అభావం అభావం చెందడమనే నియమం వస్తువు అభివృద్ధి క్రమంలోని వివిధ దశల మధ్య పరివర్తనను వివరించే నియమమని అర్థం చేసుకోవాలి. అభివృద్ధి అంటేనే పాతది నిరంతరం అభావం చెందుతూ కొత్తది ఆ స్థానంలో ప్రవేశించే క్రమమే. అందువల్ల అభివృద్ధి అంటే అభావం అభావం చెందే క్రమం. మనం గింజను ఒక బండ మీద వేసామనుకోండి, కొంత కాలానికి అది నశిస్తుంది. గుడ్డును పొదగకుండా దానికి కావలసిన వేడిని కావలసిన కాలంలో అందించకుండా ఉన్నామనుకోండి గుడ్డు నశిస్తుంది. కానీ గింజ మొలకెత్తదు. గుడ్డు పిల్ల కాదు. ఆ సరైన అనుకూల వాతావరణాన్ని కల్పించినట్టయితేనే అభివృద్ధి చెందుతుంది. సమాజమూ అంతే. అయితే సమాజంలో ఆలోచనలూ, ఆచరణ క్రమం ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యం ఘర్షణకు లోనవుతుంది. ఇది దాని అంతర్గత లక్షణం. అది పరిమాణాత్మక మార్పులతో గుణాత్మక మార్పు దశకు వస్తుంది. అయితే ఈ దశలో వ్యవస్థ కొత్త రూపును పొందే క్రమంలో అంటే విప్లవం వచ్చే క్రమంలో కమ్యూనిస్టు పార్టీ ఉత్పత్తి శక్తులకు నాయకత్వం వహించి పాత వ్యవస్థను కూలదోసి కొత్త సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావానికి తోడ్పడుతుంది. లేదంటే ఆ గుణాత్మక మార్పు మరో రూపంగానూ ఉండొచ్చు. అభావం చెందడమంటే పాతది పూర్తిగా నశించి పోవడమని అర్థం కాదు. గతితార్కిక అభావం పాత దానిలోని మేలైన ఆరోగ్యకరమైన ప్రగతిశీలమైన అంశా లన్నింటినీ, గత అభివృద్ధి దశలో సాధించిన దాన్నంతటినీ తనలో జీర్ణించుకుని ఉంటుంది. సోషలిస్టు విప్లవం పెట్టుబడిదారీ సంబంధాలను నాశనం చేస్తుంది. అయితే అదే సందర్భంలో ఉత్పత్తి శక్తులనూ, పెట్టుబడిదారీ సమాజపు శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక రంగాలలోని విలువైన అంశాలన్నింటినీ తనలో ఇముడ్చుకు ఉంటుంది. అభావం చెందడమనేది పూర్తిగా శుద్ధమైన రూపంలో జరుగదు. అంటే కొత్త దానిలో ఇమిడి ఉండేదంతా ప్రగతిశీలమైనదే కానవసరం లేదు. పాత సమాజానికి సంబంధించిన ప్రతికూల అంశాలు కూడా కొన్ని కొత్త దానిలో కొనసాగే అవకాశం ఉంది. విప్లవం విజయవంతం కాగానే పాత సమాజపు భావజాలాలన్నీ, కులం, మతం, సంప్రదాయాలు, సంస్కృతి అదృశ్యమైపోవు. అవన్నీ మారడానికి సాంస్కృతిక విప్లవమూ అవసరమవుతుంది.

ఇక అభావం అభావం చెందే క్రమంలో పరిణామ క్రమంలోని వస్తువు తన మొదటి దశకు తిరిగి వచ్చినట్టు కనపడటం మనం గమనించవచ్చు. ధాన్యం గింజ అభావం చెందే క్రమంలో తిరిగి ధాన్యం గింజ దర్శనమిస్తుంది. అంటే గింజ మొక్కగా మారి తిరిగి గింజలు సృష్టిస్తుంది. దీన్ని తిరిగి మొదటి స్థానానికి రావడంగా, పునరావృతం కావడంగా భావించరాదు. మొదటి అభావం చెందింది ఒక గింజ. ఆ అభావం అభావం చెందగా తిరిగి వచ్చిన గింజలు కొన్ని వందలు. అంటే అభావం అభావం చెందడం ద్వారా తిరిగి అభివృద్ధి క్రమం వర్తులాకార చలనంగా అనిపిస్తుందే కానీ కాదు. అది మునుపటికన్నా అభివృద్ధికరమైన ఉన్నత దశ. ఈ అభివృద్ధి క్రమాన్ని శంఖావర్త క్రమం అంటాము. సమష్టి ఆస్తి ప్రాతిపదికగా గల ఆదిమ కమ్యూనిజం అభావం చెంది వ్యక్తిగత ఆస్తి ప్రాతిపదికగా కలిగిన వర్గ సమాజం ఆవిర్భవించింది. వ్యక్తిఆస్తి, దానిపై ఆధారపడిన వర్గ సమాజమూ అభావం చెంది సమష్టి ఆస్తి ప్రాతిపదికపైన ఆధునిక కమ్యూనిస్టు సమాజం వస్తుంది. అయితే రానున్న కమ్యూనిజం స్వంత ఆస్తిలేని వర్గరహిత సమాజంగా ఉన్న ఆదిమ కమ్యూనిజాన్ని పోలిఉండే మాట వాస్తవం. కానీ ఈ పునరావృతి అత్యంత ఉన్నత స్థాయిలో జరుగుతుంది. శాస్త్రసాంకేతిక ప్రగతి, అత్యున్నతసంస్కృతి కలిగిన సమాజంగా ఇది ఉంటుంది. మానవ జాతి చరిత్రలో మానవ శ్రమ ఆలోచన సాధించిన విజయాలు తర్వాతితరాలకు అది వాటిఆధారంగా పురోగతి సాగింది. ఇదంతా శంఖావర్త క్రమంలో అభావం అభావం చెందుతూ సాగింది. రెండో దశ మొదటి దశ కంటే ఎప్పుడూ పరిణితి చెందిన దశగానే ఉంది. ఇది వరకే అన్నీ ఉన్నాయి. అన్నీ వేదాల్లోనే ఉన్నాయిఅనడం అసత్యమైనది. అన్నీ వేదాల్లోనే ఉంటే అభివృద్ధి అంతా ఆనాడే, ఇప్పుడున్నట్టు ఉండాలికదా! కాబట్టి పాతది అంతా బాగా ఉందనే వాళ్లు అభివృద్ధి క్రమాన్ని విస్మరిస్తున్నారని అర్థం. అభివృద్ధి ఎప్పుడూ ముందుకే సాగుతుంది. గతితార్కిక నియమాలు దాన్ని అవగాహన చేసుకునేందుకు ఉపయోగపడతాయి.


అభావం అభావం చెందడంలోని ఒక ముఖ్య విషయమేమంటే, ముందుకు సాగే క్రమాన్ని వెనక్కు మరలించలేము. అంటే అభివృద్ధిఅనేది ఒకసాధారణ క్రమంగా ముందుకు సాగుతూనే ఉంటుంది. "ఇవ్వాళ మళ్లీ అలాగ ఎలాగ రాయగలను నేస్తం? ఇరువయ్యే ఏడు నాకు మళ్లీ ఎలా వస్తుంది చెప్పు?" అని శ్రీశ్రీ ప్రశ్నిస్తాడు. కాబట్టిగతాన్ని తలకెత్తుకోలేం. "మంచి గతమున కొంచెమేనోయ్, మందగించక ముందుకడుగేయ్" అన్నాడు గురజాడ. అలాగని ఈ అనంత విశ్వంలో అభివృద్ధి అంతా ఏకాఏకీ ఒకే గీతలో సాగుతుందని చెప్పడమూ సరికాదు. విడివిడిగా దేనికదిగా, దాని దశలవారీ అభివృద్ధి ఉంటుంది. సామాజిక వ్యవస్థలకు సంబంధించి ఆయా దేశ కాలమాన పరిస్థితులను బట్టి సాగుతుంది. అన్నింటినీ ఒకే గాటున కట్టడం తప్పు. ఒక్కో సందర్భంలో అభివృద్ధితోపాటు తిరుగమనమూ ఉండొచ్చు. లాంగ్‌జంప్ చేసేవాడు వెనక్కంటా వెళ్లి పరుగు అందుకుంటాడే అలా. కానీ అంతిమంగా ప్రతి అభివృద్ధీ పైకి సాగేటట్టుగానే ఉంటుంది. సోషలిస్టు వ్యవస్థ పతనాన్ని కూడా ఈ విధంగానే అర్థం చేసుకోవాలి. సోవియట్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందని స్థితిలోంచి సోషలిస్టు విప్లవాన్ని పొందింది. సోషలిస్టు వ్యవస్థగా పురోగమన దశలో వైరుధ్య శక్తుల్లో మార్పులు జరిగాయి. ఈ వైరుధ్య ఘర్షణలో పురోగామి శక్తులు బలహీనపడి వెనుకపట్టు పట్టారు. అయితే ఇప్పుడా వ్యవస్థ 1917కు ముందు నాటి వ్యవస్థగా తిరోగమించలేదా? ఆ స్థితిలోకి వెళ్లలేదు. స్వంత ఆస్థి లేని కమ్యూనిస్టు వ్యవస్థ మారే క్రమంలో జరిగే ఒక ఆటంకంగా మాత్రమే మనం భావించాలి. గతితార్కిక భౌతికవాద నియమాలని గతితార్కికంగా అవగాహన చేసుకుని అన్వయించాలి. మన ప్రమేయం లేకుండా వాటికవే ఈ నియమాలు అమలు జరిగేటప్పుడు, మనం వాటిని తెలుసుకోవటం ఎందుకు? అని అనుమానం రావచ్చు. కానీ ఆ అమలు జరిగే తీరుని మానవ వికాసానికి దోహదపడే రీతి లో చేసుకోవడానికి అవగాహన అవసరం. మనిషి పశు పక్షాదులలా కాదు. మనిషి తనకు తాను ప్రకృతిని అర్థం చేసుకుని, మార్చుకుంటూ తనూ మారుతూ చరిత్రని నిర్మించుకున్నాడు. ఈ గతితార్కిక నియమాల అవగాహనతోనే చైతన్యయుతంగా సమాజాన్ని అశేష ప్రజలకనుకూలంగా మార్చుకోగలుగుతాడు.

సెల్ : 9948787660

అభావం అభావం చెందడంలోని ఒక ముఖ్య విషయమేమంటే, ముందుకు సాగే క్రమాన్ని వెనక్కు మరలించలేము. అంటే అభివృద్ధి అనేది ఒక సాధారణ క్రమంగా ముందుకు సాగుతూనే ఉంటుంది. "ఇవ్వాళ మళ్లీ అలాగ ఎలాగ రాయగలను నేస్తం? ఇరువయ్యే ఏడు నాకు మళ్లీ ఎలా వస్తుంది చెప్పు?" అని శ్రీశ్రీ ప్రశ్నిస్తాడు. కాబట్టి గతాన్ని తలకెత్తుకోలేం. "మంచి గతమున కొంచెమేనోయ్, మందగించక ముందు కడుగేయ్" అన్నాడు గురజాడ. అలాగని ఈ అనంత విశ్వంలో అభివృద్ధి అంతా ఏకాఏకీ ఒకే గీతలో సాగుతుందని చెప్పడమూ సరికాదు. విడివిడిగా దేనికదిగా, దాని దశలవారీ అభివృద్ధి ఉంటుంది. సామాజిక వ్యవస్థలకు సంబంధించి ఆయా దేశ కాలమాన పరిస్థితులను బట్టి సాగు తుంది. అన్నింటినీ ఒకే గాటున కట్టడం తప్పు. ఒక్కో సందర్భంలో అభివృద్ధితోపాటు తిరుగమనమూ ఉండొచ్చు. లాంగ్‌జంప్ చేసేవాడు వెనక్కంటా వెళ్లి పరుగు అందుకుంటాడే అలా. కానీ అంతిమంగా ప్రతి అభివృద్ధీ పైకి సాగేటట్టుగానే ఉంటుంది. సోషలిస్టు వ్యవస్థ పత నాన్ని కూడా ఈ విధంగానే అర్థం చేసుకోవాలి. సోవియట్‌లో పెట్టుబడి దారీ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందని స్థితిలోంచి సోషలిస్టు విప్లవాన్ని పొందింది. సోషలిస్టు వ్యవస్థగా పురోగమన దశలో వైరుధ్య శక్తుల్లో మార్పులు జరిగాయి. ఈ వైరు ధ్య ఘర్షణలో పురోగామి శక్తులు బలహీనపడి వెను కపట్టు పట్టారు. అయితే ఇప్పుడా వ్యవస్థ 1917కు ముందు నాటి వ్యవస్థగా తిరోగమించలేదా? ఆ స్థితిలోకి వెళ్లలేదు. స్వంత ఆస్థి లేని కమ్యూనిస్టు వ్యవస్థ మారే క్రమంలో జరిగే ఒక ఆటంకంగా మాత్రమే మనం భావించాలి.

## కవితా కాంతి


పదార్థాన్ని విడగొడితే
అణుశక్తి నీడలు
కలాన్ని కరిగిస్తే
కమ్యూనిజం జాడలు





– స్ఫూర్తి,
9490098694

# మహిళా ఉద్యమ మణిపూసలు



యం. రాంప్రదీప్

భారతదేశంలో ముస్లింలకు ఆధునిక విద్యను అందించిన ఆద్యుడిగా సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817 – 1898) పేరు పొందారు. ముస్లింలు ప్రగతి సాధించడం, ప్రభుత్వ ఉద్యోగాలలో పెద్ద వాటా పొందడం ఆధునిక విద్యతో మాత్రమే సాధ్యమవుతుందని ఆయన భావించారు. 1864లో సర్ సయ్యద్ ఒక విజ్ఞాన శాస్త్ర సంఘాన్ని ఏర్పాటుచేయడమే కాకుండా, 1875లో అలీగఢ్‌లో మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాలను స్థాపించారు.

రచయిత్రి సయ్యద్ నస్రీన్ పరిశోధనల ప్రకారం అహ్మద్ ఖాన్ కంటే ముందే షేక్ ఫాతిమా బేగం దేశంలో ముస్లింలకు ఆధునిక విద్య అందించడానికి పునాదులు వేశారు. ఫాతిమా ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేతో కలిసి పని చేశారు. పూలే దంపతులు 1848లో పూనేలో వివక్షకు గురైన బాలికల కోసం ఒక పాఠశాలను స్థాపించారు. 200 సంవత్సరాల క్రితం మన దేశ పరిస్థితులు భిన్నంగా ఉండేవి. చాలా మంది పిల్లలకు ఐదు, ఆరు సంవత్సరాలకే పెండ్లిలు జరిగిపోయేవి. కొన్ని ప్రాంతాలలో ఉన్నత కుల కుటుంబాలలో సతీ సహగమనం వంటి దురాచారాలుండగా, నిమ్న కులాల వారు అంటరానితనానికి గురయ్యేవారు. పూలే దంపతులు ఆనాటి పరిస్థితులకు ఎదురొడ్డి తమ సేవా కార్యక్రమాలను కొనసాగించారు. వారు మత పెద్దల ఆగ్రహానికి గురై సంఘ బహిష్కరణకు గురికాబడ్డారు. వారికి పూలే మిత్రుడు షేక్ ఉస్మాన్ ఆశ్రయం కల్పించాడు. అక్కడ ఉస్మాన్ సోదరి ఫాతిమాతో సావిత్రికి పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఉస్మాన్ గృహంలోనే బాలికల కోసం మరో పాఠశాలను ప్రారంభించారు. షేక్ ఉస్మాన్ ప్రోత్సాహంతో ఫాతిమా ఉన్నత విద్యను అభ్యసించింది. అప్పట్లో సామాన్యులకు పాఠశాలలు ఉండేవి కావు. క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లోనే ఫాతిమా చదువుకున్నారు. భర్త ప్రోత్సాహంతో సావిత్రి, అన్న సహకారంతో ఫాతిమా చదువుకొని మనదేశంలో తొలితరం మహిళా ఉపాధ్యాయినిలుగా పేరు పొందారు. ఫాతిమా భావాలు చాలా విశాలమైనవి. సయ్యద్ నస్రీన్ ఫాతిమాపై పుస్తకాన్ని రాశారు. సావిత్రిబాయి పలు రచనలు చేసినందువల్ల ఆమె గురించి వివరాలు సేకరించేందుకు చరిత్రకారులకు వీలు పడింది. "ఫాతిమా నాకు బాగా సహకరించారు. ఆమె సహకారంతో నేను సేవ కార్యక్రమాలను కొనసాగించగలిగాను" అంటూ సావిత్రి తన భర్తకు రాసిన లేఖలో పేర్కొంది. ఫాతిమా సేవా కార్యక్రమాలపై పెట్టినంతగా సాహిత్యంపై దృష్టిపెట్టలేదు. ఆ రోజుల్లో సనాతన ముస్లింలు స్త్రీ విద్యను నిరసించినప్పటికీ ఆమె పట్టుదల అంతా ముస్లిం బాలికలకు చదువు నేర్పడం. 1825– 27 మధ్యకాలంలో జనవరి 9న ఫాతిమా జన్మించినట్టు చాలామంది చరిత్రకారులు భావిస్తున్నారు. నస్రీన్ ప్రకారం ఫాతిమా ఉర్దూలో పద్యాలు రాశారు. కులం లేని సమాజం కోసం ఆమె పరితపించారు. సావిత్రిబాయి, ఫాతిమాబేగంలు కలిసి బాలికా విద్యపై ఎనలేని కృషి చేశారు. బహుజనులు, ముస్లింల ఐక్యతా ఉద్యమాలకు వారు ఆనాడే బీజం వేశారు. 1856 తర్వాత ఫాతిమా ఎక్కడ నివసించారనే విషయంపై వివరాలు దొరకడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠ్యపుస్తకాలలో ఆమె గురించి ప్రచురించింది. ఫాతిమా బేగం స్ఫూర్తితో పాట్నా, కలకత్తాలలో ముస్లిం బాలికలకు బేగం రోకియా సఖావత్ హుస్సేన్ పాఠశాలలను ప్రారంభించారు. ఈ సంఘసంస్కర్తల కృషి ఫలితంగా బాలికల కోసం పాఠశాలలు, కళాశాలలు దేశ వ్యాప్తంగా స్థాపించబడ్డాయి. చరిత్రకారులు దృష్టి పెట్టి ఫాతిమా సమాజానికి చేసిన సేవలు మరింత వెలుగులోకి తీసుకోరావాల్సి ఉంది.

సెల్ :9492712836



కొంపెల్లి రాజు

ఇప్పుడు నడుస్తున్న చరిత్ర రాజ్యం కనుసనుల్లో వక్రీకరించబడిన చరిత్ర. అవాస్తవాలని వాస్తవాలుగా, వాస్తవాలను అసలే లేని వాటిగా మార్చి రాయబడిన చరిత్ర. పీడితుల పక్షాన పోరాడిన ఎందరో మహానుభావుల త్యాగాలను కాలగర్భంలో పాతరేసిన చరిత్ర. పూడ్చబడిన చరిత్రను తవ్వి తీయ పలకా, బలపాలనే ఆయుధాలుగా మార్చి అక్షరానికి వారి ఆయుస్సు పోసి లక్షల అక్షరాలను మనకు అందించిన "పూలే దంపతులే" నిజమైన ఉపాధ్యాయులు. అందుకే సావిత్రీభాయ్ జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వమే జరపాలి.

మహాసాధ్వి సవిత్రిభాయిపూలే 3 జనవరి 1831న మహారాష్ట్రలోని సతారా జిల్లా, నాయిగాం గ్రామంలో మాలి కుటుంబంలో జన్మించారు. మనువాద మూఢాచారం మధ్య ముక్కుపచ్చలారని 9 ఏండ్ల బాల్యంలోనే 12 ఏండ్ల జ్యోతిరావు పూలేతో వివాహం జరిపించారు. సనాతన ధర్మ శాస్త్రం దేశమంతా స్త్రీ జాతిని వంటింటికి పరిమితం చేసి భర్తలకు బానిసలుగా చేసిన రోజుల్లో స్వేచ్ఛ సమానత్వం, స్త్రీ జాతి విముక్తికి మహాత్మపూలే సావిత్రిబాయి పూలేకు గురువయ్యాడు. పూలే అడుగుజాడల్లో అక్షరాలు నేర్చి,శూద్ర, అతిశూద్ర, మహిళా అక్షరాస్యత కోసం 1840 లో వారు మొదటి పాఠశాలను స్థాపించారు. వారి విద్యా ఉద్యమం 1852 సంవత్సరం నాటికి 18 పాఠశాలల స్థాపనకు విస్త రించింది. చరిత్రలో ఇది ఒక మహోన్నత విద్యా విప్లవం.

అభ్యుదయ భావాలను విశ్వసించని మూఢ విశ్వాసాల సమాజం మొత్తం స్త్రీ జాతికి, అణిచివేయబడ్డ సమాజానికి విద్యనేర్పటం శాస్త్రం విరుద్ధం అంటూ.. పెత్తందార్లు, తోటి మహిళలు పేడ నీళ్లు, బురద నీళ్ల బకిట్లతో తనపై చల్లినా, రాళ్లతో కొట్టి అవమానించినా విద్యా ఉద్యమంలో వెనుదిరిగి చూడకుండా నడిచిన ధీశాలి సావిత్రీభాయిపూలే. బాల్య వి వాహాలను వ్యతిరేకిస్తూ, వితంతు వివాహాలను ప్రోత్సహి స్తూ బాలిక, శిశు మహిళ అభ్యున్నతికి అనేక సేవా కార్యక్ర మాలు సావిత్రిబాయి పూలే చేశారు. 1873లో సత్యశోధక్ సమాజ్ స్థాపించిన్నప్పటి నుండి అనేక సంఘసేవ కార్యక్ర మలలో కూడా సావిత్రిబాయి పూలే పాలుపంచుకున్నారు .1890లో మహాత్మా జ్యోతిరావు పూలే మరణం తర్వాత కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ 1897లో పూనేలో ప్రబలిన ప్లేగు వ్యాధి ని వారణ కార్యక్రమలలో పాల్గొంటూ తానూ అదే వ్యాధికి గురై మరణించి ంది. ఆ తల్లి పోరాట త్యాగ ఫలితమే నేటి మన యావత్తూ పీడిత సమా జానికి అందించిన విద్య అనే "మహా ఖడ్గం". నిరంతరం బడుగు జీవుల అభ్యున్నతికి కృషి చేసిన మహా పురుషుల త్యాగాలను కాలరాసిన కులతత్వం, మూఢ విశ్వాసాలను, రాజకీయ క్రీడలను తరిమికొట్టాలి. సంఘాలకతీతంగా కుల, మత, భాష, లింగ, ప్రాంత భేదాభిప్రాయాల ను వదిలి మూకుమ్మడిగా సావిత్రిబాయి పూలే జయంతిని వాడావాడల జరుపుకోవాలి. పూలే దంపతుల జయంతులను జాతీయ ఉపాధ్యాయ, మహిళ ఉపాధ్యాయ దినోత్సవాలుగా ప్రకటించి ప్రభుత్వమే అధికారికంగా ఉత్సవాలు జరపాలి. ఆ దంపతులకు భారతరత్న ఇచ్చి వారు చేసిన త్యాగాలకు గుర్తింపునివ్వాలి.

సెల్ : 9177780013

# సమాజమంతా స్మరించే తల్లి సావిత్రీబాయి

త్యాగం, సేవ, క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరుగా నిలిచిన మొట్టమొదటి భారతీయ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే. సమాజంలో కులతత్వ, పురుషాధిక్య ధోరణులు కలిగిన పండిత మేధావులందరికీ ఆమె కేవలం జ్యోతిబాపూలే భార్యగానే తెలుసు. కానీ ఆమె పీడిత ప్రజలు, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి తుదిశ్వాస వరకూ అవిశ్రాంత కృషి చేసిన అసామాన్య ఉద్యమకారిణి. గొప్ప రచయిత్రి, మంచి వక్త. కులం, పితృస్వామ్యంపై కలంతో యుద్ధం నడిపిన కవయిత్రి. యుక్త వయస్సులోనే తన సౌఖ్యాలను వదులుకొని శూద్రులకు, దళితులకు ఆధిపత్య కులాల్లోని మహిళలకు సైతం విద్యాభ్యాసం నేర్పిన గొప్ప మానవి. స్త్రీలకు, పురుషులకు, కుల మతాలకతీతంగా విద్య నేర్చుకోవడం సహజమైన హక్కుగా ఉంటుందనీ, అందుకు అందరూ చదవాలనీ, అందరూ అసమానతలు లేకుండా బతకాలనీ పరితపించిన వీరనారి సావిత్రిబాయిపూలే.

1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నయాగామ్ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో సావిత్రిబాయి జన్మించింది. తొమ్మిదేండ్ల వయస్సులోనే జ్యోతిరావు పూలేను వివాహమాడింది. నిరక్షరాస్యురాలైన సావిత్రిబాయి పూలేకు తన భర్త జోతిబాపూలే మొదటి గురువుగా విద్యా, జ్ఞానం నేర్పి సామాజికోద్యమ కారిణిగా తీర్చిదిద్దారు. 1847 నాటికి తన భర్త తో కలిసి శూద్ర కులాల బాలికల కోసం పూనేలో మొదటి పాఠశాలను ప్రా రంభించారు. న్యాయం, ప్రజాస్వామ్యం, స్త్రీ, పురుష సమానత్వం అనే ఆదర్శాలు సావిత్రీ బాయి పూలే జీవితంలో సహజ గుణాలుగా నిలిచిపోయిన గొప్ప లక్షణాలు. 19వ శతాబ్దంలో కుల వ్యతిరేక, పురుషాధిక్య వ్యవస్థపై జరిగిన పోరాటాల్లో సావిత్రిబాయి ప్రత్యక్షంగా పాల్గొన్నది. నాటి సామాజికోద్యమాలలో మహిళా ఉద్యమకారిణిగా కనిపించే ఏకైక వ్యక్తి సావిత్రిబాయి. ఆధిపత్య వర్గాల చేతుల్లోనే ఉన్న ఉద్యమాలకు ప్రత్యామ్నాయంగా సాగిన పోరాటాల్లో పీడితుల పక్షాన ఆమె అగ్రభాగాన నిలిచారు. 1852లోనే మహిళా సేవా మండల్ పేరిట మహిళా సంఘాన్ని స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష, అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడారు. అనాథ బాలలు, శూద్ర బాలికలు అందరూ తన బిడ్డలని అక్కున చేర్చుకున్నారు. 1874లో ఓ బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తత తీసుకొని పెంచి పోషించారు. 1873లో సత్యశోద క్ సమాజ్ మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు జరిపించారు. భార్యను కోల్పోయిన ఓ యువకుడిని చేరదీసి తన స్నేహితురాలి బిడ్డతో మాట్లాడి పెండ్లి చేసారు. పురోహితులై పైసా ఖర్చు లేకుండా వివాహం జరిపించారు.



తన భర్తకు తోడు నీడగా నడవడం మాత్రమే గాక, స్వయంగానే ఆమె ఓ సామాజిక విప్లవానికి ఓ మహిళగా సారథ్యం వహించింది. 19వ శతాబ్దంలో ఆమె సాగించిన కృషి... కులం, వర్గం, లింగ వివక్ష వంటి శక్తులన్నీ తల వంచక తప్పని పరిస్థితికి తెచ్చింది. వితంతువులెందరికో వివాహాలు జరిపించింది. సత్యశోదక్ సమాజ్ పేరిట ఆమె అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నడిపింది. 1896–97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జన జీవనాన్ని అతలాకుతలం చేసినప్పుడు దళితులు, పేదల కోసం ఆమె జోలె పట్టి విరాళాలు సేకరించి వారికి అందించింది. ప్లేగు వ్యాధి బాధితులందరికీ దగ్గరుండి సేవలందించింది. 1848లో మొట్టమొదటిసారిగా కేవలం 9మంది విద్యార్థినులతో ఒక బాలికా పాఠశాలను ఒక పేద వ్యక్తి ఇంట్లో పూలే ప్రారంభించారు. సావిత్రిబాయి తన స్నేహితురాలు ఫాతిమా షేక్ ఇరువురు కలిపి ఆ పాఠశాలను చాలా సమర్థవంతంగా నడిపారు. శూద్రులు అందులోనూ మహిళలు చదవడం అపచారమంటూ ఆనాటి ఆధిపత్య శక్తులు అనేక ఆటం కాలు సృష్టించారు. ఆమె రోజు పాఠశాలకు వెళ్లే దారిలో అటకాయించి మట్టి, పేడ, రాళ్లు విసిరేవారు. వేధింపులకు గురి చేయడమే కాక, నానా బూతులు తిట్టేవారు. అయినప్పటికీ ఓ పాత చీర కట్టుకొని మరో చీర సంచిలో పెట్టుకుని పోయి మరీ చదువు నేర్పిన సాహసి ఆమె.

సావిత్రిబాయి పూలే గొప్ప కవయిత్రి, రచయిత్రి. నిష్కల్మషమైన మనస్సు, త్యాగం, సేవ, నిబద్ధతల కలబోత. 1854లో మొట్టమొదటిసారిగా కావ్య పూలే అనే ఒక కవితా సంపుటిని ఆమె రచించారు. అభంగ్ అనే రచన ఆనాటి పీష్వాల పరిపాలనపై యుద్ధం ప్రకటిస్తూ నాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా రాసింది. సూటిగా, సరళంగా ప్రకృతి వర్ణన, జానపద కళలు ప్రతిబింబించే కావ్య రచనలు చేసింది. 1891లో ప్యాన్ కాషీ సుబోధ రత్నాకర్ పేరిట 11 సంపుటాలను ఆమె రచించారు. పండుగలు, పబ్బాలు, వివాహాలు వంటి వాటి కోసం ఆర్భాటంగా శక్తికి మించిన ఖర్చులు పెట్టవద్దని, అప్పుల పాలు కావొద్దని కర్జ్ అనే వ్యాసం ఆమె రాశారు. మూఢ విశ్వాసాలు నమ్మినంత కాలం ప్రజల జీవితాల్లో మార్పులుండవని, ప్రతిదానిని హేతుబద్ధంగా ఆలోచించాలని ఆమె సూచించారు. 1890 నవంబర్ 28న జ్యోతిబాపూలే మరణించగా సావిత్రీ తన భర్త చితికి నిప్పంటించారు. అనంతరం సత్యశోదక్ సమాజ్ మొత్తం బాధ్యతలన్నింటినీ ఆమే స్వయంగా నిర్వహించారు. ఎస్వాడ్‌లో ఒక సంస్థ తరఫున ఒక సభ నిర్వహించారు. 1896లో కరువు సంభవించినప్పుడు ప్రభుత్వంతో పోరాడి బాధితుల కోసం నిధులు మంజూరు చేయించారు. ప్లేగు వ్యాధి సోకిన బాధితులకు ప్రత్యక్షంగా సేవలందిస్తున్న సమయంలో ఆమె కూడా ప్లేగు వ్యాధికి గురయ్యారు. చివరికి 1897 మార్చి 10న ఆమె కన్ను మూశారు. కుమారుడు యశ్వంత్ ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.



టి. స్కైలాబ్‌బాబు

విద్య, వైద్యం, సమాన అవకాశాలు, ప్రకృతి వనరులు ప్రజలందరికీ అందాలని సావిత్రిబాయి జీవితాంతం కృషి చేసింది. కానీ ఆమె ఆశయాలకు తిలోదకాలిస్తున్న నేటి పాలకులు విద్యను సంతలో సరుకులా అమ్ముకుంటున్నారు. యూనివర్శిటీలను ప్రైవేటుపరం చేస్తూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో సంపూర్ణంగా ఛాందస భావాలను నింపుతోంది. దేశ సమైఖ్యత, సమగ్రతలకు భంగం కలిగిస్తూ ప్రజల మధ్య అనేక చిచ్చులు పెట్టి అగాధాన్ని సృష్టిస్తోంది. చరిత్ర, సామాజిక శాస్త్రాల ను సమాధి చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పాఠ్యాంశాలను రూపొందిస్తోంది. ఆర్థిక సంక్షోభంతో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఒక క్రమ పద్ధతిలో పక్కదోవ పట్టిస్తోంది. నిరుద్యోగం, ఉపాధి, వ్యవసాయ సంక్షోభం, కార్మికుల కనీస వేతనాలు, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం రద్దు వంటి అనేక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లిస్తూ శబరిమలై, అయోధ్య, కాశ్మీర్, 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వ సవరణ వంటి రాజ్యాంగ పునాదులను దెబ్బతీసే కుట్రలకు తెరలేపింది. రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య ఇస్తామని వాగ్దానం చేసి, నేడు 12వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించింది. 5 కి.మీ. దూరానికి పాఠశాల ఉండాలని విషమ షరతులు పెడుతున్న ప్రభుత్వం, బజారుకో బ్రాందీషాపున్నా ఫర్వాలేదని అంటోంది. సావిత్రీబాయి జీవిత లక్ష్యం సాధించాలనుకునే ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఆమె ఆచరణ, ఆమె స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి. అందరికీ కామన్ స్కూల్ ఉండే విధంగా, అందరికీ సమాన విద్య అందే విధంగా పోరాడాలి. ఆమె పుట్టిన రోజు జనవరి 3ను మహిళాఉపాధ్యాయ దినంగా, బాలికా అక్షరాస్యతా దినంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. ఆధునిక భారతదేశానికి ఆమె ఆదర్శంగానే నిలుస్తోంది.

సెల్ : 9177549646


# నవచిత్రం

## పీరియాడికల్ లవ్‌స్టోరీ


ప్రభాస్

'సాహెూ' తర్వాత ప్రభాస్ ఓ పీరియాడికల్ లవ్ స్టోరీలో నటిస్తున్నారు. రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని గోపీకృష్ణ మూవీస్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో మొదటిసారి ప్రభాస్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్ర షూటింగ్‌కి సంబంధించిన వార్తలు గత కొంత కాలంగా వినిపించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం స్పందించింది. ఈ వారంలోనే అన్నపూర్ణ స్టూడియోలో నెక్స్ట్ షెడ్యూల్‌ని జరుపనున్నట్టు పేర్కొంది. ప్రభాస్ నటిస్తున్న 20వ చిత్రం కావడం విశేషం. దీనికి 'జాన్' అనే పేరుని యూనిట్ పరిశీలిస్తున్నారట. 1980కి చెందిన పీరియాడికల్ ప్రేమ కథగా ఈ సినిమాని రూపొందిస్తున్నట్టు, ఇందులో ప్రభాస్ రెండు భిన్న షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. అంతేకాదు ఇందులో మరో హీరోయిన్‌గా కాజల్ నటించనున్నట్టు సమాచారం.

## న్యూ ఇయర్ న్యూ లుక్స్


'భీష్మ' చిత్రంలో రష్మిక మందన్నా, నితిన్


'ఆకాశం నీ హద్దురా' చిత్రంలో సూర్య

## అందుకే నో చెప్పలేకపోయా

'ఏడాదిలో 365 రోజులు పనిచేస్తూనే ఉంటాను. నేను ఖాళీగా ఉన్నానని వస్తున్న వదంతుల్లో నిజం లేదు' అని అంటోంది తమన్నా. మహేష్‌బాబు నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు'లో ఓ పాటలో మెరిశారు. 'డాంగ్ డాంగ్..' అంటూ సాగే పార్టీ సాంగ్ ఇటీవల విడుదలై విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈనేపథ్యంలో తమన్నాకి సినిమాలు లేకపోవడం వల్లే ఈ పాటలో నటించిందనే కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై తమన్నా స్పందిస్తూ, 'ఖాళీగా ఉండటం వల్లే 'సరిలేరు నీకెవ్వరు'లో పార్టీ సాంగ్‌లో నటించానని అంటున్నారు. ఆ వదంతులు నిజం కాదు. 'ఎఫ్ 2' వంటి బ్లాక్ బస్టర్ అందించిన అనిల్ రావిపూడి ఇందులో నటించాలన్నప్పుడు నో చెప్పలేకపోయాను. ఏడాదిలో మనం 20 సినిమాలు చేసినప్పటికీ చివరి సినిమా విజయమే మనల్ని సంతోషంగా ఉంచుతుంది. డేట్స్ దొరికినప్పుడల్లా పలు భాషల్లో నటిస్తూనే ఉన్నా' అని తెలిపింది. ప్రస్తుతం 'బోల్ చుడియన్', 'సీటీమార్' చిత్రాల్లో తమన్నా నటిస్తోంది.


తమన్నా

# భిన్న సినిమాలతో ఈ నెలంతా సందడే సందడి

ఫ్రెష్ కథలతో, సరికొత్త కాంబినేషన్లతో ఎంటర్‌టైన్ చేసేందుకు బోల్డెన్ని సినిమాలు ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇందులో భాగంగా ఈ జనవరిలో దాదాపు 20కిపైగా చిన్నా, పెద్దా చిత్రాలు అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. ఆడియెన్స్‌ని మెస్మరైజ్ చేసి కలెక్షన్లు కొల్లగొట్టేందుకు ఈ జనవరిలో రాబోతున్న సినిమాలేమిటో ఓసారి లుక్కేద్దాం..

జనవరి ఫస్ట్‌కి సినిమాలు విడుదలవ్వమనేది చాలా రేర్‌గా జరుగుతుంటుంది. అలాంటి రేర్ ఫీట్ ఈ జనవరి ఫస్ట్ జరిగింది. స్ట్రయిట్, డబ్బింగ్ చిత్రాలతో ఐదు సినిమాలు జనవరి ఫస్ట్‌కి విడుదలయ్యాయి. వాటిలో సత్యప్రకాష్ రూపొందించిన 'ఊల్లాల ఊల్లాల', రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన 'బ్యూటీఫుల్', రక్షిత్ శెట్టి 'అతడే శ్రీమన్నారాయణ', ధనుష్ 'తూటా', మమ్ముట్టి నటించిన 'రాజా నరసింహా' ప్రధానంగా ఉన్నాయి. విడుదలైన ఐదు చిత్రాలూ ప్రేక్షకుల్ని అలరించడంలో ఎంత వరకు సక్సెస్ అయ్యాయనేది మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

ఇక జనవరి 3(శుక్రవారం)న ఐదు చిన్న సినిమాలు రాబోతున్నాయి. అందులో శ్రీరామ్ నిమ్మల, కరోనా కల్రీన్ జంటగా తిరుపతి ఎస్.ఆర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన పల్లెటూరి ప్రేమ కథ 'ఉత్తర' ఉంది. దీంతోపాటు మరో విభిన్న ప్రేమ కథ 'హల్‌చల్' రాబోతుంది. రుద్రాక్ష్, ధన్యబాలకృష్ణ జంటగా నటించగా దీనికి శ్రీపతి కర్రి దర్శకత్వం వహించారు. ఈ రెండు చిత్రాలతోపాటు నూతన తారాగణంతో తెరకెక్కిన 'కళాకారుడు' కూడా ఈ శుక్రవారం విడుదల కాబోతుంది. శ్రీధర్ శ్రీమంతుల, దుర్గ జంటగా, కిరణ్ దర్శకత్వంలో ప్రేమ, కుటుంబ అంశాల మేళవింపుగా ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కింది. వీటితోపాటు బాలీవుడ్ దర్శక, నిర్మాత కె.సి.బొకాడియా రూపొందించిన 'నమస్తే నేస్తమా' చిత్రం కూడా జనవరి 3వ తేదీన రిలీజ్ అవుతోంది. అధర్వ మురళి నటించిన తమిళ చిత్రం 'బూమరాంగ్' ఈ నెల 3న తెలుగులో విడుదల కాబోతుంది. మేఘా ఆకాష్, ఇందూజ రవిచంద్రన్ హీరోహీరోయిన్లుగా ఆర్.కణ్ణన్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ చిత్రాన్ని శ్రీమతి జగన్మోహిని సమర్పణలో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత సీహెచ్ సతీష్‌కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు.

### సంక్రాంతి బరిలో భారీ సినిమాలు

ఇక ఈ నెలలో అత్యంత ప్రధానమైనది సంక్రాంతి పండుగ. ఈ పండగ నేపథ్యంలో విడుదలయ్యే సినిమాలపై అటు ప్రేక్షకులు, ఇటు ఆయా హీరోల అభిమానుల్లోనూ ఎన్నో అంచనాలుంటాయి. ఆ అంచనాలను అందుకుని సంక్రాంతి కలెక్షన్స్ కొల్లగొట్టడానికి ఈసారి పలు నాలుగు భారీ చిత్రాలు అమీతుమీ తేల్చుకునేందుకు బరిలోకి దిగుతున్నాయి. వీటిల్లో ముందుగా జనవరి 9న రజనీకాంత్ నటించిన అనువాద చిత్రం 'దర్బార్' రిలీజ్ కాబోతుంది. మొదటిసారి రజనీకాంత్, ఏ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో రజనీ మార్క్ స్టయిల్ డైలాగ్స్, నటనతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందింది.


'దర్బార్'లో రజనీకాంత్


'సరిలేరు నీకెవ్వరు'లో మహేష్‌బాబు


'అల..వైకుంఠపురములో' చిత్రంలో అల్లు అర్జున్

లైకా ప్రొడక్షన్స్ సంస్థపై తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీ సరసన నయనతార కథానాయకగా నటించింది. సునీల్ శెట్టి ప్రతి నాయకుడిగా నటించారు. తమిళంతోపాటు తెలుగు, మలయాళం, హిందీలో విడుదల కాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రజనీ చాలా రోజులు తర్వాత పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. 'దర్బార్'తోపాటు మూడు తెలుగు సినిమాలు 'సరిలేరు నీకెవ్వరు', 'అల వైకుంఠపురములో', 'ఎంత మంచివాడవురా' పోటీపడుతున్నాయి.

జనవరి 11న మహేష్, రష్మిక జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సరిలేరు నీకెవ్వరు' రిలీజ్ కానుంది. మొదటి సారి మహేష్, రష్మిక నటించడం, అలాగే ఫస్ట్‌టైమ్ మహేష్, అనిల్‌రావిపూడి కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కడం, చాలా రోజులు తర్వాత విజయశాంతి రీఎంట్రీ వంటి అనేక ప్రత్యేకతలతో, విశేషాలతో ఈ సినిమా రూపొందింది. దీంతో సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఒక్క రోజు గ్యాప్‌తో అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా 'అల వైకుంఠపురములో' విడుదల కానుంది. గతంలో వీరి కాంబినేషన్‌లోనే 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాలు వచ్చిన విషయం విదితమే. మంచి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా నటించింది. 'డీజే' తర్వాత బన్నీ, పూజా కలిసి నటించిన చిత్రమిది. దీంతోపాటు సుశాంత్, నివేదా పేతురాజ్, టబు, నవదీప్ వంటి భారీ తారాగణం ఇందులో ఉంది. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలోని పాటలకి ఇప్పటికే విశేష శ్రోతకాదరణ లభించింది.

మూడు రోజుల గ్యాప్‌తో కళ్యాణ్ రామ్ సంక్రాంతి బరికి సై అంటున్నారు. జనవరి 15న ఆయన నటించిన 'ఎంత మంచి వాడవురా' రిలీజ్ కానుంది. 'శతమానంభవతి' చిత్రంతో జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు సతీష్‌వేగేశ్న ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కళ్యాణ్ రామ్ సరసన మెహరీన్ నటిస్తోంది. ఈ చిత్రం ద్వారా ఆదిత్యా మ్యూజిక్ అధినేతలు ఉమేష్ గుప్తా, సుభాష్ గుప్తా నిర్మాతలుగా మారుతుండటం విశేషం. ఆద్యంతం కుటుంబ కథా చిత్రంగా ఇది రాబోతుంది.

ఇక రిపబ్లిక్ డేని పురస్కరించుకుని జనవరి 24న రవితేజ, వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో సైంటిఫిక్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'డిస్కోరాజా' విడుదల కానుంది. ఇందులో రవితేజ సరసన నభా నటేష్, పాయల్ రాజ్‌పుత్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పాటలకు మంచి ఆదరణ లభించింది. వరుస ఫ్లాప్‌ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై రవితేజ చాలా హోప్స్ పెట్టుకున్నారట.

ఈ నెలాఖరులో జనవరి 31న మూడు సినిమాలు పోటీపడుతున్నాయి. అందులో 'నిశ్శబ్దం', 'అశ్వత్థామ', 'రొమాంటిక్' ఉన్నాయి. దాదాపు రెండేండ్ల గ్యాప్ తర్వాత అనుష్క నుంచి వస్తున్న చిత్రం 'నిశ్శబ్దం'.


'డిస్కోరాజా'లో రవితేజ, 'నిశ్శబ్దం'లో అనుష్క, 'అశ్వత్థామ'లో నాగశౌర్య


'ఎంత మంచివాడవురా' చిత్రంలో కళ్యాణ్‌రామ్, మెహరీన్

హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాధవన్, అంజలి, షాలిని పాండే ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తెలుగుతోపాటు హిందీ, ఇంగ్లీష్, మలయాళం, తమిళ భాషల్లో ఈ సినిమా రూపొందుతుంది. టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సస్పెన్స్, హర్రర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో అనుష్క మూగ ఆర్టిస్టుగా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచుతుంది. దీంతోపాటు నాగశౌర్య 'అశ్వత్థామ' ఉంది. మెహరీన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి రమణ తేజ దర్శకత్వం వహిస్తుండగా, నాగశౌర్య కథ అందిస్తుండటం విశేషం. యదార్థ ఘటనల ఆధారంగా శౌర్య తన సొంత బ్యానర్‌లోనే ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వరుస ఫ్లాప్‌లతో ఉన్న శౌర్య సైతం దీనిపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ ఆకట్టుకుంటోంది. పూరీజగన్నాథ్ తనయుడు ఆకాష్‌పూరీ హీరోగా రూపొందుతున్న 'రొమాంటిక్' చిత్రం కూడా నెలాఖరులో విడుదలకు సిద్ధమవుతుంది. ఆకాష్ సరసన కేతిక శర్మ కథానాయికగా నటిస్తుంది. అనిల్ పాదూరి దర్శకత్వం వహిస్తున్నారు. దీనికి కథ అందించడంతోపాటు పూరీ జగన్నాథ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇదే జనవరిలోనే ప్రముఖ దర్శక, నిర్మాత రాజ్ కందుకూరి తనయుడు శివకందుకూరి నటించిన 'చూసి చూడంగానే' రాబోతుంది. ఇందులో వర్ష బొల్లమ్మ కథానాయికగా నటించగా, శేష సింధూరావు దర్శకత్వం వహిస్తున్నారు. దీంతోపాటు రక్షిత్, నక్షత్ర జంటగా, కరుణకుమార్ రూపొందించిన 'పలాస 1978' వంటి తదితర సినిమాలు సైతం విడుదల కానున్నట్టు తెలుస్తోంది.

## బాలీవుడ్‌లోనూ ఇదే తీరు


'చపాక్'లో దీపికా పదుకొనె

బాలీవుడ్‌లో తొలి వారం(జనవరి 3) 'సిమ్లా మిర్చి' విడుదల కానుంది. హేమామాలిని, రాజ్‌కుమార్ రావ్, రకుల్ ప్రీత్ సింగ్, శక్తి కపూర్ ప్రధాన పాత్రధారులుగా రమేష్ సిప్పీ దర్శకత్వంలో రూపొందింది. దీంతోపాటు అక్షయ్ ఖన్నా నటించిన 'సబ్ కుశల్ మంగల్', కొత్తతారాగణంతో తెరకెక్కిన 'భంగ్రా పా లే' చిత్రాలు విడుదల కాబోతున్నాయి. జనవరి 10న సంక్రాంతి కానుకగా దీపికా పదుకొనె 'ఛపాక్', అజయ్ దేవగన్ 'తానాజీ' చిత్రాలున్నాయి. ఢిల్లీ యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవితాన్ని అధారంగా చేసుకుని దర్శకురాలు మేఘనా గుల్జర్ రూపొందించిన 'ఛపాక్'లో దీపికా పదుకొనె ప్రధాన పాత్రలో నటించారు. యాసిడ్ దాడి బాధితురాలిగా దీపికా పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తీరుపట్ల ప్రశంసలు దక్కుతున్నాయి. ఇదే రోజు అజయ్ దేవగన్, సైఫ్ అలీ ఖాన్, కాజోల్ ప్రధాన పాత్రలు పోషించిన యాక్షన్ పీరియడ్ డ్రామా 'తానాజీ: ది అన్‌సంగ్ వారియర్' చిత్రం రాబోతుంది. ఓమ్ రాత్ దర్శకత్వం వహించారు. 17వ శతాబ్దానికి చెందిన శివాజీ మరాఠా సామ్రాజ్యానికి చెందిన సైనిక నాయకుడు తానాజీ మలుసరే జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. భారీ తారాగణంతో, పీరియడ్ చిత్రంగా రాబోతుండటంతో దీనిపై భారీ అంచనాలను నెలకొన్నాయి. రిపబ్లిక్ డేని పురస్కరించుకుని ఈ నెల 24న కంగనా 'పంగా', వరుణ్ ధావన్‌ల 'స్ట్రీట్ డాన్సర్ 3డీ' విడుదల కానున్నాయి. పెళ్ళి తర్వాత కబడ్డీలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచేందుకు ఓ ఇల్లాలు పడే స్ట్రగుల్ నేపథ్యంలో రూపొందిన స్పోర్ట్స్ ప్రధాన చిత్రం 'పంగా'పై సర్వత్రా ఆసక్తిని నెలకొంది. వరుణ్ ధావన్, శ్రద్ధా కపూర్ జంటగా, ప్రభుదేవా కీలక పాత్రలో నటించిన 'స్ట్రీట్ డాన్సర్' చిత్రం కూడా అందరిలోనూ భారీ అంచనాలున్నాయి.


'తానాజీ : ది అన్‌సంగ్ వారియర్' చిత్రంలో కాజోల్

మానవి
నవతెలంగాణ



అమ్మాయిలకు నేర్పించాల్సిన అతి ముఖ్యమైన విషయం నాయకత్వం. ఇది చాలాకాలంగా స్త్రీలలో లేదు. మన సమాజం మహిళలను అలా తయారు చేసింది. మహిళలే ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనవారని నేను నమ్ముతాను. అందుకే మహిళలకు ప్రతి అవకాశాన్నీ ఇవ్వాలనేది నా అభిప్రాయం. అదే నేటి తరం అమ్మాయిలకు నేర్పించాలి.

- జోజిబినీ తున్జే, మిస్ యూనివర్స్

# మేలైన అల్పాహారం

దక్షిణాది అల్పాహారాల్లో ఇడ్లీదే మొదటి స్థానం. నూనె అవసరం లేని, తేలికగా జీర్ణమయ్యే మేలైన పోషకాలుగల అల్పాహారం ఇడ్లీ. ప్రపంచంలోని మొదటి పది అత్యంత ఆరోగ్యవంతమైన వంటకాలలో ఇడ్లీ ఒకటి. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరైనా తీసుకోదగిన ఈ అల్పాహారాన్ని ఎన్నోరకాలుగా తయారుచేసుకోవచ్చు. వాటిల్లో కొన్ని....



## కార్న్‌మీల్ ఇడ్లీ

**కావలసిన పదార్థాలు:**
మొక్కజొన్న పిండి, పుల్లటి పెరుగు - రెండు కప్పులు, క్యారెట్ (తురుము) - ఒకటి, కొత్తిమీర (తరుగు)- గుప్పెడు, కరివేపాకు (సన్నగా తరిగి) - ఒక రెమ్మ, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర, ఆవాలు, పచ్చిశెనగపప్పు - ఒక్కో టీస్పూన్, బేకింగ్‌సోడా - చిటికెడు.

**తయారీ విధానం**
తాలింపు గిన్నెలో నూనె వేసి అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, పచ్చి శెనగపప్పులు వేసి వేగించాలి. ఇందులోనే మొక్కజొన్న పిండి కలిపి కొన్ని నిమిషాలు వేగించాలి. స్టవ్ ఆపేసి క్యారెట్ తురుము, కరివేపాకు, కొత్తిమీర తరుగు, పెరుగు, ఉప్పు వేసి బాగా కలిపి పావుగంట పక్కన పెట్టాలి. ఆ తరువాత నీళ్లు పోసి బేకింగ్ సోడా వేసి ఇడ్లీ పిండిలా కలిపి ఇడ్లీలు వేసుకోవాలి. కొబ్బరి లేదా పుదీనా చట్నీలతో వీటిని తినాలి.



## కంచి ఇడ్లీ

**కావలసిన పదార్థాలు:**
ముడిబియ్యం, ఇడ్లీ బియ్యం, మినప్పప్పు-1 కప్పు చొప్పున, మిరియాలపొడి- 2 చెంచాలు, జీలకర్ర, శొంఠిపొడి- ఒక్కోచెంచా చొప్పున, తాలింపుకోసం- 5 చెంచాల నువ్వులనూనె, 2 చెంచాల మినప్పప్పు, 1 చెంచా ఆవాలు, 2 రెబ్బల కరివేపాకు, 10 జీడిపప్పులు, పావు చెంచా ఇంగువ, ఉప్పు- రుచికి తగినంత,

**తయారీ విధానం**
రెండు రకాల బియ్యం ఒక గిన్నెలో, మినప్పప్పును మరోగిన్నెలో పోసి 3 గంటలపాటు నానబెట్టాలి. ఇప్పుడు ముందుగా మినప్పప్పు రుబ్బాలి. తర్వాత నానబెట్టిన బియ్యాన్ని కూడా మెత్తగా రుబ్బి మినప్పిండిలో వేసి, తగినంత ఉప్పు వేసి కలిపి సుమారు 6 గంటలపాటు పులియనివ్వాలి. మర్నాడు ఉదయం ఇడ్లీ వేసే 1 గంట ముందు ఆ పిండిలో శొంఠిపొడి, మిరియాలపొడి, జీలకర్ర వేసి కలపాలి. ఇప్పుడు చిన్న బాణలిలో నూనె వేసి ఆవాలు, కరివేపాకు, జీడిపప్పు, ఇంగువ, మినప్పప్పు వేసి వేయించి దాన్ని ఇడ్లీ పిండిలో కలపాలి. ఈ గంటె జారుడు ఇడ్లీ పిండిని నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేట్స్ లో వేసి ఆవిరిమీద 20 నిమిషాల పాటు ఉడికించి తీసి, కొబ్బరి, వేరుశెనగచట్నీ, నెయ్యితో వేడివేడిగా ఆరగించాలి.

## రాగి ఇడ్లీ

**కావలసిన పదార్థాలు:**
ఇడ్లీ రవ్వ- 1 కప్పు, రాగి పిండి- 2 కప్పులు, మినప పప్పు- అరకప్పు, మెంతులు- 1 చెంచా, ఉప్పు-రుచికి తగినంత,

**తయారీ విధానం**
ముందురోజు సాయంత్రం మినప పప్పు, మెంతులు కలిపి నానబెట్టుకొని మెత్తగా రుబ్బుకోవాలి. దీనికి రాగి పిండి, ఇడ్లిరవ్వ, ఉప్పు కలుపుకొని రాత్రంతా పులియబెట్టాలి. ఆ గిన్నెకు మూతగా ఒక గుడ్డకట్టి బయటే ఉంచాలి. ( ఫ్రిజ్ లో పెట్టొద్దు). ఈ పిండిని చేజారుగా కలిపి ఉదయాన్నే ఇడ్లీ పాత్రల్లో వేసుకొంటే వేడివేడి రాగిపిండి ఇడ్లీ సిద్ధమైనట్లే.



## బ్రౌన్‌రైస్ ఇడ్లీ



**కావలసిన పదార్థాలు:**
బ్రౌన్‌రైస్ - 400 గ్రాములు, ఉప్పు - రుచికి తగినంత, ఆవాలు - ఒక టీస్పూను, కరివేపాకు - రెండు రెబ్బలు, పచ్చిమిర్చి - 2, మెంతాకులు కొన్ని, పెరుగు - వంద గ్రాములు.

**తయారీ విధానం**
ఒక రాత్రంతా బియ్యాన్ని నానబెట్టాలి. ఉదయాన్నే నీరు వడకట్టి మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బేటప్పుడే పెరుగుని, ఉప్పుని కలిపి ఓ గంట నానబెట్టాలి. ఇడ్లీ కుక్కర్లో పెట్టేముందు కాసిన్ని మెంతి ఆకుల్ని కలపండి. ఆవిరి మీద 10నుండి 15 నిమిషాల పాటు ఉడికించండి. ఆవాలు, కరివేపాకు, మిర్చిలతో తాళింపు పెట్టి ఇడ్లీలపై చల్లండి. వీటిని వేడిగా కొబ్బరి చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి. మినపప్పు అవసరం లేన ఇడ్లీ ఇది.



## బార్లీ ఇడ్లీ

**కావలసిన పదార్థాలు:**
బార్లీ- 1/2 కప్పు, సగం ఉడికిన అన్నం - 1 కప్పు, మినపపప్పు (బద్దలుగా ఉన్నవి)-1/2 కప్పు, మెంతులు- 1/4 టీస్పూను, ఉప్పు- రుచికి సరిపడ, ఉడకబెట్టిన కూరగాయముక్కలు-1/2 కప్పు (కేరట్, ఫ్రెంచి బీన్స్).

**తయారీ విధానం**
మినపప్పు, సగం ఉడికిన బియ్యం, మెంతుల్ని బాగా కడిగి రెండు గంటలపాటు నీళ్లల్లో నాననివ్వాలి. తర్వాత వాటిని నీళ్లల్లోంచి తీసి వేరే గిన్నెలో వేయాలి. బార్లీ గింజల్ని విడిగా నీళ్లల్లో రెండు గంటలు నానబెట్టాలి. నానిన బార్లీ గింజల్ని వేరే గిన్నెలో ఉంచాలి. మెంతులు, మినపపప్పు, సగం ఉడికిన బియ్యం, నానిన బార్లీ గింజల్ని కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండిలో కొద్దిగా ఉప్పు కలిపి... మూత పెట్టి నాలుగు గంటలపాటు ఉంచితే పిండి ఊరుతుంది. ఊరిన పిండిని గరిటెతో కలపాలి. తర్వాత ఇడ్లీ ప్లేట్లలో నీళ్లతో కొద్దిగా తడిచేసి మూడు స్పూన్ల పిండిని వాటిల్లో వేయాలి. పిండిపైన ఉడికిన కూరగాయ ముక్కల్ని చల్లాలి. తర్వాత దాన్ని ఇడ్లీ కుక్కర్‌లో పెట్టి పొయ్యి మీద 12 నిమిషాలు ఉడికించాలి. మిగిలిన పిండిని కూడా ప్లేట్లలో వేసి ఇడ్లీ కుక్కర్‌లో ఉడికించాలి. వేడి వేడి బార్లీ ఇడ్లీలను సాంబారుతో తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

# నచ్చింది తింటూనే నాజూగ్గా...

పాత రోజుల్లో సన్నగా ఉన్నవారిని బాగా తినాలని పెద్దలు చెబుతుండేవారు. అదే ఇప్పుడైతే కాస్త బొద్దుగా కనిపిస్తే చాలు పెద్దలే డైటింగ్ చేయమని చెబుతున్నారు. చదువుకునే వారు, నిపుణుల మొదలు సామాన్యుల వరకు వీలున్నత మేర సన్నగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. అలాగే సన్నబడే ప్రయత్నంలో అనారోగ్యకర ఆహార, వ్యాయామ నియమాలను పాటించి లేనిపోని సమస్యలనూ కొని తెచ్చుకుంటున్నారు. అందుకే సన్నబడాలనుకునే వారు నచ్చింది తినటం మానుకోకుండానే నాజూగ్గా ఉండేందుకు దోహదపడే కొన్ని అంశాల మీద దృష్టి పెట్టాలి.

- చాలా మంది పొరబాటు పడుతున్నట్లు ఆహారానికి తగిన వ్యాయామం చేయాల్సిన పని లేదు . - శరీర పరిస్థితి, స్వభావం, బరువు తదితర అంశాల ప్రాతిపదికన కనీస స్థాయిలో వ్యాయామాలు చేస్తూ పోవాలి.
- ఒకేసారి సన్నబడాలని ఏమీ తినకుండా పొట్టను ఖాళీగా ఉంచితే గ్యాస్ ఏర్పడే ఇబ్బంది ఉన్నందున ప్రతి మూడు, నాలుగు గంటలకు కొంచెం కొంచెం ఆహారం తప్పక తీసుకోవాలి.
- తీసుకునే ఆహారంలో గింజలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలి. వాటిని



ఎప్పుడు ఎలా తినాలనే ప్రణాళిక ఉండాలి.
- ఎక్కువ సేపు శక్తిని నిలిపే ప్రోటీన్స్, పీచు అధికంగా ఉండే ఆహారం తీసుకోవటం మరచి పోవద్దు.
- చక్కెర తక్కువ ఉన్న పదార్థాలు తీసుకోవాలి. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరాలు, పటిక బెల్లం వంటివి వాడాలి.
- రోజుకి 10- 12 గ్లాసుల నీరు తాగాలి. 60 నుంచి 70 శాతం ఆహారం, మిగిలిన 30 నుంచి 40 శాతం నీటిని తీసుకోవాలి. పిజ్జా, బర్గర్స్ స్థానంలో గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి.
- మూడు నాలుగు వారాలకొకసారి మాత్రమే డైట్ ప్లాన్‌ను మార్చాలి. తరచూ మార్చడం వలన జీవప్రక్రియ దెబ్బతినే ప్రమాదముంది.
- అలాగే తెల్లవారుజామున కనీసం గంట పాటు చేసే వాకింగ్ ఆరోగ్యానికి చాలా మంచిది. దీనివల్ల శరీరం అంతా బాగా కదలి అన్ని అవయవాలూ చురుగ్గా పనిచేయటం మొదలవుతుంది. ఉదయం వీలు కాకపోతే సాయంత్రం అయినా పర్వాలేదు.
- ఎప్పుడూ ఒకేరకమైన వ్యాయామాలు కాకుండా శరీర అవసరాలకు తగిన వ్యాయామాలు చేయాలి.
- ఒకరోజు వ్యాయామం చేసి రెండు రోజులు మానుకోవటం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా లేనిపోని ఇబ్బందులు వస్తాయి. ❄

# స్కిన్‌టోన్ పెంచే ప్యూమిస్ స్టోన్



సాధారణంగా ప్యూమిస్ స్టోన్‌ను పాదాల స్క్రబింగ్‌కు మాత్రమే ఉపయోగిస్తూ ఉంటాం. కానీ చర్మపు మృత కణాల్ని తొలగించటంతోపాటు అవాంఛిత రోమాల్ని కూడా ప్యూమిస్ స్టోన్ తొలగించగలదు.

**పొడి చర్మానికి మేలు:** పొడి చర్మం కలిగినవారు సబ్బు నీళ్లలో నానబెట్టిన ప్యూమిస్ స్టోన్‌తో ఒళ్లు రుద్దుకుంటూ ఉండాలి. ముందుగా ఆయిల్ మసాజ్ చేసుకుని ఆ తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో రుద్దుకుంటూ ఉంటే మృత కణాలు తొలిగి పొడి చర్మం తేమగా తయారవుతుంది.

**స్కిన్‌టోన్ కోసం:** స్కిన్‌టోన్ పెరగాలంటే ప్రతిరోజూ ప్యూమిస్ స్టోన్‌తో శరీరానికి సున్నితంగా మసాజ్ చేయాలి. ఇలా చేస్తే రక్త ప్రసరణ బాగా జరిగి చర్మం మెరుస్తూ ఉంటుంది. ఇందుకోసం స్నానం చేసేటప్పుడు సబ్బు రుద్దుకున్న తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో శరీరమంతా వృత్తాకారంలో మసాజ్ చేయాలి.

**అవాంఛిత రోమాలు తొలగాలంటే:** ముఖంపై ఉన్న అవాంఛిత రోమాలను తొలగించటం కోసం కూడా ప్యూమిస్ స్టోన్‌ను ఉపయోగించొచ్చు. ఇందుకోసం ఫేస్ ప్యాక్ వేసుకున్న తర్వాత దాన్ని తొలగించటం కోసం ప్యూమిస్ స్టోన్ వాడాలి. అయితే ఆరిపోయిన ఫేస్‌ప్యాక్‌ను కొద్ది నీళ్లతో తడిపి మెత్తబడిన తర్వాతే ప్యూమిస్ స్టోన్‌తో రుద్దాలి. ❄

# ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

**ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి. దీంతో పిల్లలను ఏదో ఒక సమయంలోనైనా ఇంట్లో ఒంటరిగా వదిలేయాల్సివస్తుంది. అలాంటపుడు మనసంతా వారి క్షేమం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. ఆ అలజడిని పూర్తిగా అడ్డుకోలేకపోవచ్చు కానీ, ఇంట్లో పిల్లలను వదిలి వెళ్లేటప్పుడు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే కనుక వారి క్షేమానికి గ్యారంటీ ఇచ్చినట్లే అంటున్నారు పెద్దలు.**



**గమనించేందుకు ఎవరన్నా:** పిల్లలని ఒంటరిగా వదిలి వెళ్తున్న విషయం పొరుగువారికి తెలియచేసి, అప్పుడప్పుడూ కాస్త గమనించమని అభ్యర్థించడం మంచిది. దాని వల్ల వాళ్లూ కాస్త ఇంటిని గమనిస్తూ ఉంటారు, పిల్లలకూ తాము బుద్ధిగా మసలుకోవాలన్న జాగ్రత్తా ఉంటుంది. ఒకవేళ అలా కుదరని పక్షంలో మనమే మధ్యలో ఒకసారి ఇంటికి ఫోన్ చేసి పిల్లవాడు ఏమన్నా ఇబ్బంది పడుతున్నాడేమో విచారిస్తే సరి!

**ఫోన్ నెంబర్లు:** ఇంట్లో పిల్లలకి, తల్లిదండ్రులు ఫోన్ నెంబర్లు గుర్తుంచుకునేలా చేయడం చాలా అవసరం. వీటిని బట్టీ పట్టించడంలో ఏ తప్పూ లేదు సరికదా, ఒకోసారి అ నెంబర్లే పిల్లవాడిని ప్రమాదం నుంచి కాపాడవచ్చు కూడా! కాబట్టి అవసరం అయినప్పుడు మీ నెంబరుకి ఫోన్ చేయమని పిల్లవాడికి చెప్పి ఉంచండి. అలాగే పోలీస్, ఫైర్, ఆంబులెన్స్ వంటి సర్వీసులకు సంబంధించిన నెంబర్లను కూడా చెప్పి ఉంచడం మంచిది.

**అందుబాటులో ప్రాణాంతకాలు:** చాలా ఇళ్లల్లో కత్తెర, చాకు, లైటరు, అగ్గిపెట్టె.... లాంటి వస్తువులన్నీ ఎక్కడపడితే అక్కడ పడేసి ఉంటాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీటిని చేజిక్కించుకున్న పిల్లలకి వాటితో ఏదన్నా సాహసం చేయాలన్న సరదా పుట్టడం సహజమే! అలాంటి సాహసాలే ఒకోసారి ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉంటుంది. కాబట్టి బయటకు వెళ్లే ముందు ఒకసారి అలా ఇంట్లో కలియతిరగండి. ఇలాంటి వస్తువుల ఏమన్నా ఉంటే లోపల పడేయండి. గ్యాస్‌స్టవ్ కట్టేసి ఉందా లేదా! గీజర్ వంటి వస్తువులు ఏవన్నా ఆన్‌లో ఉన్నాయేమో ఓసారి చూసుకుని బయల్దేరండి.

**అపరిచితులకు నో ఎంట్రీ:** మరీ సన్నిహితులైతే తప్పా ఇంటి తలుపులను బార్లా తెరిచి ఆహ్వానించకూడదన్న జాగ్రత్త పిల్లలకు అందించాలి. గ్రిల్స్ మాటు నుంచో, డోర్ చెయిన్ వెనుక నుంచో సమాధానం చెబితే సరిపోతుంది. వచ్చినవాళ్లు మరీ తమకి కావల్సిన జవాబుల కోసం పట్టుబడితే, మీకు ఫోన్ చేయమని సూచించండి. ఎవరూ లేని సమయంలో మొహమాటానికి పోయి, అపరిచితులను లోనికి రానిస్తే ఉపయోగం కాదు కదా ప్రమాదానికే అవకాశాలు ఎక్కువ.

**ఏదన్నా వ్యాపకం:** పిల్లలకు ఏదన్నా వ్యాపకాన్ని అందించి వెళ్తే వాళ్ల మనసు ఇక అటూ ఇటూ చెదరదు. ఒక ప్రాజెక్టువర్కో, పుస్తకమో, పిల్లల సినిమానో... ఇలా అతని ఏకాగ్రతని ఆకర్షించే పని ఏదన్నా కల్పించి వెళ్తే మంచిది. ఇక వీలైతే అతని స్నేహితులని కూడా పిలుచుకొమ్మని చెబితే అటు కాలక్షేపానికీ, ఇటు భద్రతకీ లోటు ఉండదు. ❄

# ల్యాప్‌టాప్‌తో ఆరోగ్య సమస్యలు



ఇప్పుడు ల్యాప్‌టాప్ వాడకం బాగా పెరిగింది. ఎక్కడైనా కూర్చొని పనిచేసే వెసులుబాటు, కోరుకున్న తీరుగా కూర్చొనే వెసులుబాటు ఉండటంతో యువత గాడ్జెట్స్ జాబితాలో ఇది తప్పనిసరిగా ఉంటోంది. అయితే ఇష్టమొచ్చిన భంగిమల్లో కూర్చొని గంటల తరబడి ల్యాప్‌టాప్ వాడే వారిలో పలు అనారోగ్య సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ల్యాప్‌టాప్ వాడేవారు కొన్ని జాగ్రత్తలు పాటించటం మంచిది. అవి..

- ల్యాప్‌టాప్‌లను ఎక్కువమంది ఒడిలో పెట్టుకొని ముందుకు వంగి కూర్చొని గంటల తరబడి పనిచేస్తుంటారు. దీనివల్ల వెన్నుపూస మీద తెలియని భారం పడి వెన్నునొప్పి రావచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఇది క్రమంగా స్పాండిలైటిస్‌కు దారితీస్తుంది. ఈ పరిస్థితిని నివారించాలంటే తగిన ఎత్తున్న టేబుల్ మీద ల్యాప్‌టాప్ పెట్టి వాడాలి.
- ల్యాప్‌టాప్ మీద పనిచేసేటప్పుడు ఎదురుగా లైట్ ఉండకుండా చూసుకోవాలి. లేకుంటే ఆ కాంతి ప్రభావానికి కళ్ళు పొడిబారటం, నీళ్లు కారటం వంటి సమస్యలు వస్తాయి.
- ల్యాప్‌టాప్ స్క్రీన్‌కు ముఖం దగ్గరగా పెట్టి ఎక్కువ సమయం చూడటం వల్ల కళ్ళు తీవ్ర ఒత్తిడికిలోనై 'కంప్యూటర్ విజన్ సిండ్రోమ్' అనే నేత్ర సమస్య వస్తుంది. కనుక స్క్రీన్‌ను తగిన దూరం నుంచి చూడాలి. అవసరాన్ని బట్టి యాంటీ గ్లేర్ కళ్లద్దాలు వాడాలి.
- రోజంతా ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకొని పనిచేసేవారికి తొడ భాగంలో చర్మ సమస్యలు రావచ్చు. కొందరిలో ఇది చర్మ క్యాన్సర్‌కి దారి తీసే ప్రమాదం ఉంది. కనుక ఒడిలో పెట్టుకోవద్దు.
- ల్యాప్‌టాప్ ఇరుకైన కీ బోర్డును గంటల తరబడి వాడటం వల్ల వేళ్ల కండరాలు పట్టేయడం, వేళ్లకు రక్తప్రసరణ తగ్గి తిమ్మిరెక్కటం, వంటి సమస్యలు రావచ్చు. కనుక పరిమిత సమయమే కీబోర్డు వాడండి. ❄



# విమర్శలు పట్టించుకోను!

## ● టోక్యో పతకమే ధ్యేయంగా శ్రమిస్తున్నాను: అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు

నవతెలంగాణ-హైదరాబాద్

అభిమానుల అంచనాలు, విశ్లేషకుల విమర్శలు తనపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపబోవని భారత బ్యాడ్మింటన్ సూపర్‌స్టార్ పి.వి సింధు వ్యాఖ్యానించింది. గత ఏడాది ద్వితీయార్థం పూర్తిగా పరాజయాలే పలకరించినా, సానుకూల దృక్పథంతో టోక్యో 2020 ఒలింపిక్స్ మెడల్ ధ్యేయంగా షటిల్ కోర్టులో శ్రమిస్తున్నానని సింధు తెలిపింది. 2019 ఆగస్టులో బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ సాధించిన సింధు, ఈ ఘనత దక్కించుకున్న ఏకైక భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. కానీ ఆ తర్వాత జరిగిన వరుస టోర్నీల్లో ప్రీ క్వార్టర్స్‌లోపే నిష్క్రమించింది. డిసెంబర్‌లో జరిగిన టాప్-8 షట్లర్లు పోటీపడే బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగినా, గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. 2019లో అత్యున్నత విజయాలు నమోదు చేసిన తెలుగు తేజం, కెరీర్‌లో స్టార్‌డమ్ పొందిన తర్వాత అత్యంత చెత్త ప్రదర్శననూ గతేడాదే చవిచూసింది. ఒలింపిక్స్ ఏడాదిలోకి అడుగుపెట్టిన తరుణంలో పి.వి సింధుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి ప్రయత్నంలోనే రియోలో రజతం సాధించిన సింధు, టోక్యోలో మరో మెడల్ కొడితే దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ సరసన నిలువనుంది. ఒలింపిక్స్‌లో వ్యక్తిగత విభాగాల్లో రెండు పతకాలు సాధించిన ఏకైక అథ్లెట్ సుశీల్ కుమార్ మాత్రమే. టోక్యోలో ఆ ఘనత సాధించేందుకు సింధు సంకల్పించింది. గత ఏడాది పరాజయాలు, ఈ ఏడాది ఒలింపిక్స్ అంచనాలపై సింధు మనసులోని మాటలివే..

**వేగంగా నేర్చుకుంటాను :** ప్రపంచ చాంపియన్‌షిప్స్ నాకు అత్యంత గొప్పగా సాగాయి. కానీ ఆ తర్వాత వరుస టోర్నీల్లో ఆరంభ రౌండ్లలోనే ఓటమి పాలయ్యాను. అయినా, సానుకూల దృక్పథంతోనే ఉన్నాను. ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించటం సాధ్యపడదు. కొన్నిసార్లు అత్యద్భుతంగా ఆడవచ్చు, కొన్నిసార్లు పొరపాట్లు చేయవచ్చు. నా పొరపాట్లను ఎంతో నేర్చుకున్నాను. సానుకూల వైఖరితో ఉండటం నాకు అత్యంత కీలకం. తప్పిదాల నుంచి నేర్చుకుని, మరింత ధృడంగా పుంజుకోవటం ప్రధానం.

**అసలు పట్టించుకోను :** నేను ఎక్కడ బరిలోకి దిగినా, విపరీతమైన అంచనాలు ఉంటున్నాయి. కానీ అంచనాల ఒత్తిడి, విమర్శలు నాపై ఎటువంటి ప్రభావం చూపలేవు. నేను ఎప్పుడు ఆడినా నెగ్గాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఏ అథ్లెట్‌కు అయినా ఒలింపిక్స్ మెడల్స్ అంతిమ లక్ష్యం. స్కిల్ వర్కవుట్స్, టెక్నిక్‌పై ప్రతి రోజు ఎంతో కష్టపడుతున్నాం. ఒలింపిక్ సీజన్‌లో అన్ని పద్ధతి ప్రకారం సాగుతాయని అనుకుంటున్నాను.

**అతిగా ఆలోచన చేయను :** సుశీల్ కుమార్ రెజ్లింగ్ దిగ్గజం. దేశానికి ఎన్నో ఘన విజయాలు అందించారు. నేను కూడా అదే రీతిలో మంచి విజయాలు అందిస్తాననే ఆశిస్తున్నాను. ఇతరుల ఘనతలు, విజయాల గురించి ఆలోచించేందుకు ఎప్పుడూ గీత దాటలేదు. నాకు సంబంధించి ఒక్కో అడుగుతో సాధించే ప్రక్రియ ఇది. మరింత కఠినంగా శ్రమించి, కష్టపడితేనే అత్యుత్తమంగా రాణించగలను అనుకుంటున్నాను.

**అంత ఈజీ కాదు :** ఈ ఏడాది అంత సులువేమీ కాదు. 2020 జనవరిలోనే మలేషియా, ఇండోనేషియా ఓపెన్‌లు ఉన్నాయి. ఒలింపిక్స్ అర్హత కోసం మరికొన్ని టోర్నీలు ఉన్నాయి. అందుకే ఈ ఏడాది ప్రతి టోర్నీ ప్రధానమైనదే. బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ (పీబీఎల్)లో ఆడటంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. జనవరిలో జరిగే పీబీఎల్‌లో అన్ని జట్లూ బలంగానే ఉన్నాయి. ప్రతి మ్యాచ్ ముఖ్యమైనదే. పీబీఎల్ భారత్‌తో జరుగే టోర్నీ. ప్రజలు, అభిమానులు టాప్ షట్లర్ల ఆట చూడాలని అనుకుంటారు. ఏడాదికోసారి జరిగే పీబీఎల్‌లో గొప్ప వాతావరణం ఉంటుంది. యువ షట్లర్లు నేర్చుకునేందుకు పీబీఎల్ ఎంతో మంచి వేదిక అని సింధు తెలిపింది.

**కొసమెరుపు! :** ఇదిలా ఉండగా మాజీ కోచ్ కిమ్ జీ హ్యూన్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలపై సింధు స్పందించలేదు. కొరియా కోచ్ శిక్షణలోనే సింధు వరల్డ్ టూర్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ విజయాలు సొంతం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్స్ తర్వాత భర్త అనారోగ్య కారణాలతో కిమ్ జీ హ్యూన్ స్వదేశానికి వెళ్లిపోయింది. అప్పట్నుంచి సింధు ప్రదర్శనలో దారుణ మార్పు చోటుచేసుకుంది. జ్వరంతో హాస్పిటల్‌లో చేరినా, ట్రైనింగ్‌కు ఎప్పుడు వస్తారనే సింధు అడిగింది, కానీ ఆరోగ్యం ఎలా ఉంది? అని ఒక్క మాటైనా అడుగలేదు అని కిమ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సింధుకు హృదయం లేదని కిమ్ పేర్కొనటాన్ని సింధు తండ్రి రమణ తప్పుపట్టారు. క్రికెట్ సూపర్‌స్టార్ విరాట్ కోహ్లి తర్వాత బ్రాండ్ అంబాసిడర్‌గా అత్యధికంగా ఆర్జిస్తున్న సింధు నుంచి మార్కెట్ వర్గాలు సైతం సూపర్ ప్రదర్శన ఆశిస్తున్నాయి. మరి మన సింధు ఏం చేస్తుందో చూడాలి.



# మాథ్యూస్‌కు పిలుపొచ్చింది

## ● భారత్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక

**కొలంబో :** మాజీ కెప్టెన్ ఎంజెలో మాథ్యూస్‌కు మళ్లీ పిలుపొచ్చింది. 2018 ఆగస్టులో చివరగా టీ20 మ్యాచ్ ఆడిన మాథ్యూస్‌కు సెలక్షన్ కమిటీ అనూహ్య రీ ఎంట్రీ కల్పించింది. భారత్‌తో జరుగనున్న మూడు మ్యాచుల టీ20 సిరీస్‌కు మాథ్యూస్‌ను జట్టులోకి తీసుకుంది. 32 ఏండ్ల మాథ్యూస్ చివరి టీ20 లంకేయులను సారథిగా నడిపించాడు. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై శ్రీలంక గెలుపొందినా, బ్యాట్స్‌మన్‌గా మాథ్యూస్ విఫలమయ్యాడు. దీంతో పొట్టి ఫార్మాట్ జట్టు నుంచి మాథ్యూస్‌కు ఉద్వాసన తప్పలేదు. కొత్త ఏడాది, అదీ టీ20 వరల్డ్‌కప్ సంవత్సరంలో మాథ్యూస్‌ను జట్టులోకి తీసుకున్న సెలక్టర్లు.. వరల్డ్‌కప్ అవకాశంపై సంకేతాలు ఇచ్చారు. దిగ్గజ సీమర్ లసిత్ మలింగ సారథ్యంలోని



శ్రీలంక టీ20 జట్టు గురువారం భారత్‌కు రానుంది. జనవరి 5న గువహతిలో తొలి టీ20 మ్యాచ్ జరుగనుంది.

**శ్రీలంక టీ20 జట్టు :** లసిత్ మలింగ (కెప్టెన్), దనుష్క గుణతిలక, అవిష్క ఫెర్నాండో, ఎంజెలో మాథ్యూస్, దశన్ శనక, కుశల్ పెరీరా, నిరోశన్ డిక్‌వెల్లా, ధనంజయ డిసిల్వ, ఇసురు ఉదాన, భానుక రాజపక్సె, ఒశాడ ఫెర్నాండో, వానిందు హసరంగ, లహిరు కుమార, కుశల్ మెండిస్, లక్షన్ సందకన్, కసున్ రజిత.

# దశాబ్దపు జట్టులో ధోని, కోహ్లి, రోహిత్, బుమ్రా

## ● ఈఎస్‌పీఎన్ వన్డే, టెస్టు, టీ20 జట్లు



**బెంగళూర్ :** భారత క్రికెట్ స్టార్స్ మహేంద్రసింగ్ ధోని, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఈ దశాబ్దపు జట్లలో చోటు సాధించారు. క్రికెట్ వెబ్‌సైట్ ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో ప్రకటించిన 2010-2019 టెస్టు, వన్డే, టీ20 జట్లలో మనోళ్లు నిలిచారు. 54.97 సగటుతో 7202 పరుగులు చేసిన విరాట్ కోహ్లి టెస్టు జట్టులో నం.4 బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. అలస్టర్ కుక్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ వంటి సారథులు ఉన్న టెస్టు జట్టుకు కోహ్లి నాయకత్వం వహించే అవకాశం లభించింది. 25.36 సగటుతో 362 వికెట్లు కూల్చిన ఆర్. అశ్విన్ ఆఫ్ స్పిన్నర్‌గా టెస్టు జట్టులో ఉన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, ఎం.ఎస్ ధోనిలు వన్డే జట్టులో నిలిచారు. రోహిత్ 52.92 సగటుతో 7991 పరుగులతో ఓపెనర్‌గా, 61.31 సగటుతో 11036 పరుగులతో విరాట్ కోహ్లి నం.3 బ్యాట్స్‌మన్‌గా, 50.35 సగటుతో 5640 పరుగులతో ఎం.ఎస్ ధోని నం.6 బ్యాట్స్‌మన్‌గా జట్టులో ఉన్నారు. ఆమ్లా, డివిలియర్స్, షకిబ్, స్టెయిన్, మలింగలతో కూడిన జట్టు సారథ్య బాధ్యతలు ధోనికి దక్కాయి. టీ20 జట్టులో విరాట్ కోహ్లి, ఎం.ఎస్ ధోని, జస్‌ప్రీత్ బుమ్రా చోటు సాధించారు. వెస్టిండీస్ ఆటగాళ్లు క్రిస్ గేల్, సునీల్ నరైన్, కీరన్ పొలార్డ్, ఆండ్రీ రసెల్, డ్వేన్ బ్రావోలు టీ20 జట్టులో చోటు దక్కించుకున్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృత్యుంజయం రాజీనామా

## ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి లెటర్



నవతెలంగాణ - మంకమ్మతోట

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి ఫ్యాక్స్ ద్వారా పంపారు. ఈ మేరకు మీడియాకు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. పార్టీ విధానాల్లో మార్పు రావడమే తన రాజీనామాకి కారణమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సమయంలో, ఇందిరాగాంధీ పరిపాలన సమయంలో ఉన్న పార్టీకి ఇప్పుడున్న పార్టీకి చాలా మార్పు ఉందని తెలిపారు. పార్టీ ప్రాథమిక భావజాలానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ అవలంబిస్తున్న విధానాలతో సామాన్యులు దూరం అవుతున్నారని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలోనూ విఫలమయ్యామని అన్నారు. ఇదే విషయమై పార్టీలో చర్చిస్తే తన మాటలను తిరస్కరించారని పేర్కొన్నారు. కాగా, స్థానిక నేతలతో ఆయనకు గతం నుంచీ విబేధాలు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఇటీవల కొత్తపల్లి మున్సిపల్ అభ్యర్థుల ఎంపిక విషయంపై తనకు తెలియకుండా కమిటీ వేయడంపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. గతం నుంచీ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌తోనూ విబేధాలు ఉన్నాయి. గత నెల 31న జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్వహించిన ప్రెస్‌మీట్‌కూ ఆయన హాజరు కాలేదు. ఈ క్రమంలో మృత్యుంజయం రాజీనామా నిర్ణయం తీసుకున్నారు.

# 18 సంవత్సరాలు పైబడిన.. నిరక్షరాస్యుల జాబితాను సిద్ధం చేయాలి

● జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభమవుతున్న పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యుల జాబితాను ఈనెల 10వ తేదీలోగా నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వయోజనుల అక్షరాస్యతను పెంచేందుకు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు అన్ని గ్రామ పంచాయితీలలో 'ఈచ్ వన్ టీచ్‌వన్' చేపట్టాలని నిర్ణయించారని అన్నారు. రెండో విడత పల్లె ప్రగతి సందర్భగా ప్రతి గ్రామ పంచాయితీలలో చదవడం రాయడం రాని వారి వివరాలను సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామానికి సంబంధించిన ఈ జాబితాలో 18 సంవత్సరాలు పైబడి నిరక్షరాస్యుల అందరి వివరాలు ఉండాలనీ, 10వ తేదీ వరకు వేచి చూడకుండా ఏ రోజుకు ఆ రోజు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.

# హస్తినలో అధికారం ఎవరిదో...?

## పథకాలతో ఆప్ సర్కార్ గట్టెక్కేనా ..!

● బీజేపీ వ్యూహాలు ఫలించేనా..!

● ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై వాడివేడి చర్చ



**న్యూఢిల్లీ :** హస్తినలో 'రాజకీయ వేడి' నెలకొంది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గెలిచేందుకు ఆయా రాజకీయ పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. అదేవిధంగా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ఈ చట్టంపై అనుకూలమైన ప్రకటనలు. వీటి వల్ల ఎవరూ లబ్ధిపొందనున్నారో అన్న అంశంపై కూడా విశ్లేషణలు సాగుతున్నాయి. ఢిల్లీలో ఆప్ మరోసారి ప్రభుత్వాన్ని చేజిక్కించుకోనుందా? బీజేపీ అధికార పీఠం అధిరోహించనుందా? కాంగ్రెస్, ఇతర పార్టీలు ఎలాంటి ప్రభావం చూపనున్నాయా అన్న చర్చలు నడుస్తున్నాయి. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు కేంద్రంలోని బీజేపీపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతుదారులు భావిస్తున్నప్పటికీ, జాతీయ జనాభా పట్టిక వల్ల ఎన్నికల్లో తమకు మేలు కలిగే అవకాశాలున్నాయని 'కాషాయ దళం' ఆశాభావంతో ఉంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం విజయవంతమైన కొన్ని పథకాలు తీసుకురావడం..దానికి 'ఫేవర్'గా మారనున్నాయి.

ఐదేండ్ల పాలనలో ఆప్ తీసుకువచ్చిన పథకాల్లో అత్యంత ప్రజాదరణ పొందినవి..ఉచిత నీటి సరఫరా..విద్యుత్ బిల్లులను తగ్గించడం. ఈ పథకాలు ఉన్నత వర్గాల నుంచి మధ్య, పేద తరగతి ప్రజల అభిమానం చూరగొన్నాయి. ముఖ్యంగా ఉచిత నీటి సరఫరాతో లబ్ధి పొందిన వారిలో బీజేపీ ఓటర్లు కూడా ఉన్నారు. ఇప్పుడు వీరి అభిప్రాయం మారింది. వీరి సైతం ఆప్‌కు అనుకూలంగా మాట్లాడుకుంటున్నారని భోగట్టా. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వం వీటినే తన పెట్టుబడిగా ముందుకు దూసుకెళుతున్నది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పథకాలను సంబంధించిన నాలుగు పేజీల 'రిపోర్ట్ కార్డు'ను ఆప్ విడుదల చేసింది. అంతేకాకుండా పథకాలకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ప్రింట్, టీవీల్లో ప్రకటనల రూపంలో ఊదరగొడుతూ.. అప్పుడే ఎన్నికల ప్రచారానికి తెరలేపింది. ఇక ఆప్ ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థి అయిన బీజేపీ ఈ విషయంలో కూడా కాస్త వెనుకబడినట్టు తెలుస్తోంది. ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని మొదలు పెట్టకపోవడంతో పాటు పబ్లిసిటీ డ్రైవ్‌ను సైతం చేపట్టలేదు. అయితే ఆప్ భ్రుత్వంపై 'ఆరోపణ పత్ర్' అనే బుక్‌లెట్‌ను విడుదల చేసింది. ఒక్క సోషల్ మీడియాను మాత్రమే ఆశ్రయిస్తోంది. ఆప్ ప్రభుత్వం చేసినవి తప్పుడు వాగ్దానాలంటూ ప్రచారం చేస్తోంది. దీన్నే వ్యూహంగా మలచుకోనున్నట్టు సమాచారం.

ఇక బీజేపీకి విజయావకాశాలను పరిశీలిస్తే..జాతీయ రాజధానిలో 40 లక్షలకు పైగా నివాసితులున్న 1,731 అనధికారిక కాలనీలను క్రమబద్ధీకరించడం. దీని వల్ల పేద వలసదారులకు ఎక్కువ ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయన్నది పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ ఉభయ సభల్లో దీనికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత..హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి...ఆస్తుల క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. జాతీయ వాదం, రామమందిర్, సీఏఏ వంటి అంశాలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కలిసిరాకపోవడంతో.. స్థానిక సమస్యలతో ముందుకు వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో మనోజ్ తివారీ నేతృత్వంలోని ఢిల్లీలో బీజేపీ నేతలు పలు కమిటీలను ఏర్పాటు చేసింది. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే తివారీ, రాజ్యసభ సభ్యుడు విజయ్ గోయల్ మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయన్న వార్తలు వినిపించాయి. అందుకు కారణం తివారీ ఢిల్లీ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడమే. గోయల్ ఢిల్లీ రాజకీయాల్లో కొన్నేండ్లుగా కొనసాగుతున్నా మంచి పేరును సంపాదించలేకపోయారని ప్రచారం జరుగుతున్నది. ఇది తమ పార్టీ మధ్య అంతర్గత వ్యవహారమేదైనప్పటికీ.. ఎన్నికల కోసం వాటిని పక్కనపెట్టకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతినడం ఖాయని బీజేపీ రాష్ట్ర వర్గాలు ఆందోళనచెందుతున్నాయి.

# యువకుడిపై కత్తులతో దాడి

## నూతన సంవత్సర వేడుకల్లో ఘర్షణ

● కేసు నమోదు

నవతెలంగాణ- బెజ్జంకి(చిన్నకోడూరు)/ఆదిలాబాద్ అర్బన్

నూతన సంవత్సర వేడుకల్లో యువకుల మధ్య ఏర్పడిన ఘర్షణ కత్తులతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. దాంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంచ గ్రామానికి చెందిన బోదాసు మల్లేశం, రఘు, రాజేందర్, శ్రీకాంత్, సంజు, సాయికుమార్ మంగళవారం అర్ధరాత్రి గ్రామ చావిడి వద్ద పాటలు పాడుకుంటూ కొత్త వేడుకలు చేసుకున్నారు. ఈ క్రమంలో స్థానిక యువకులు చింటు, అంజి అక్కడికి చేరుకుని ఇక్కడ డ్యాన్స్‌లు చేయొద్దని మందలించారు. దాంతో యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. చావిడి వద్ద నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో మల్లేశంపై చింటు, అంజి కత్తితో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన మల్లేశంను స్థానికులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుని సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.



**ఆదిలాబాద్‌లోనూ..**

చిన్నగా తలెత్తిన గొడవ.. మాటామాట పెరిగి కత్తులతో దాడి చేసేవరకు వెళ్లింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో కొత్త సంవత్సర వేడుకల్లో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డవారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయబాడకు చెందిన కలేరి రాజశేఖర్, గుమ్ముల రాజు, నైనేని రాజు మరికొంత మంది స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. డిజే సౌండ్ సిస్టమ్ పెట్టుకుని డ్యాన్స్ చేస్తూ హంగామా చేశారు. ఈ క్రమంలో అక్కడకు వచ్చిన ఎన్.సాగర్, ఉపేందర్, రాకేశ్, లక్ష్మణ్‌తో గొడవ జరిగింది. ఇరు గ్రూపుల మధ్య ఏర్పడిన ఘర్షణ కత్తితో దాడిచేసే వరకూ వెళ్లింది. ఈ దాడిలో కలేరి రాజశేఖర్, గుమ్ముల రాజు, నైనేజీ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

# మాగం రంగారెడ్డి చైర్మెన్‌గా కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి చైర్మెన్‌గా మొత్తం 11 మందితో కమిటీని నియమించింది. కమిటీలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బెల్లయ్యనాయక్, టీపీసీసీ మైనార్టీ విభాగం చైర్మెన్ ఎస్.ఏ.సోహెల్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ముదిరాజ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, మెదక్ డీసీసీబీ మాజీ చైర్మెన్ ఎం.జైపాల్ రెడ్డి, నాయకులు పాల్వాయి స్రవంతి, సత్యం శ్రీరంగం, గాలి అనిల్ కుమార్, టీపీసీసీ కార్యదర్శి పవన్ మల్లాడీ ఉన్నారు. ఈ కమిటీ జనవరి నాలుగులోపు మేనిఫెస్టోను రూపొందించి టీపీసీసీకి సమర్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సీ.కుంతియా ఒక ప్రకటనలో తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.